ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ప్రకాశం
గురువారం 10, అక్టోబరు 2024


| జిల్లావ్యాప్తంగా ఫ్రీ హోల్డ్ భూములు | |
|---|---|
| అసైన్డ్ భూములు | : 1,36,000 |
| చుక్కల భూములు | : 37,000 |
| సర్వీస్, ఇనాం భూములు | : 9,000 |


మర్రిపూడి మండలంలో ఫ్రీహోల్డ్ భూములను పరిశీలిస్తున్న ఎస్డీసీ లోకేశ్వరరావు(ఫైల్)

గత వైసీపీ సర్కారు తీసుకొచ్చిన 'ఫ్రీ హోల్డ్' చట్టం అక్రమార్కులకు వరంగా మారింది. ప్రభుత్వ భూములను అప్పనంగా దోచుకునేందుకు దోహదపడింది. పెత్తందారుల చేతుల్లో ఉన్న ఆక్రమిత భూములకు చట్టబద్ధత కల్పించేందుకు ఉపయోగపడింది. వైసీపీ నేతలు రూ.కోట్లకు పడగెత్తేలా చేసింది. అధికారులను దారికి తెచ్చుకుని భూములను రిజిస్ట్రేషన్ చేయించుకుని.. ఆపై అమ్మి సొమ్ము చేసుకోవడానికి దారులు కల్పించింది. జిల్లావ్యాప్తంగా 1.36 లక్షల ఎకరాల అసైన్డు భూములకు యాజమాన్య హక్కులు కల్పించినట్లు, వీటిలో 4వేల ఎకరాలు రిజిస్ట్రేషన్ కూడా చేయించినట్లు అధికారుల పరిశీలనలో తేలింది. అందులో అత్యధికం కనిగిరి, మార్కాపురం డివిజన్లలోనే ఉన్నాయంటే అక్కడ అక్రమాలు ఏ స్థాయిలో జరిగాయో తేటతెల్లమవుతోంది.


# అంతా ఫ్రీ హోల్డ్!

## జిల్లావ్యాప్తంగా లక్షా 82వేల ఎకరాలకు యాజమాన్య హక్కులు

- అందులో లక్షా 36వేల ఎకరాలు అసైన్డ్ భూమి
- 4వేల ఎకరాలకు రిజిస్ట్రేషన్ చేసినట్లు గుర్తింపు
- వైసీపీ నాయకుల కనుసన్నల్లోనే అక్రమం
- కనిగిరి, మార్కాపురం డివిజన్లలోనే అధికం
- అధికారుల విచారణలో వెలుగులోకి అవకతవకలు

ఒంగోలు (కలెక్టరేట్), అక్టోబరు 9 : ఏళ్ల తరబడి అనుభవంలో ఉన్న అసైన్డ్ భూములను అమ్ముకునేందుకు అవకాశం కల్పించినదే ఫ్రీ హోల్డ్ చట్టం. గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన ఈ చట్టం అక్రమార్కులకు వరంగా మారడంతోపాటు అధికారులకు కాసుల వర్షం కురిపించింది. వైసీపీ ప్రభుత్వం గతేడాది అసైన్డ్, చుక్కలు, ఇనాం భూములకు స్వేచ్ఛ కల్పిస్తున్నామని ప్రచారం చేసి గ్రామగ్రామానా సభలు పెట్టి రైతులకు హక్కులు ఇస్తున్నామని పైకి ఊదరగొట్టి లోలోపల వైసీపీ దళారులు బాగుపడటానికి అవకాశం కల్పించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఫ్రీ హోల్డ్ భూములపై దృష్టి పెట్టింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని రకాల భూ రికార్డుల పరిశీలన ప్రారంభించింది. గతేడాది డిసెంబర్ నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు జిల్లావ్యాప్తంగా లక్షా 82వేల ఎకరాలకు జగన్ సర్కారు పూర్తి యాజమాన్య హక్కులు కల్పించినట్లు తేలింది. అందులో లక్షా 36 వేల ఎకరాలు అసైన్డ్ భూములు, 37వేల ఎకరాల చుక్కల భూములు, 9వేల ఎకరాలు ఇనాం భూములు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. 4వేల ఎకరాల అసైన్డ్ భూములను రిజిస్ట్రేషన్ చేసినట్లు ఇప్పటి వరకూ అధికారులు చేసిన విచారణలో తేలింది. విచారణ పూర్తయితే ఎన్నివేల ఎకరాలు ఫ్రీ హోల్డ్ అయ్యాయో వెలుగులోకి వచ్చే అవకాశముంది.

| మండలాలవారీగా ఫ్రీ హోల్డ్‌లో ఉన్న అసైన్డ్ భూముల వివరాలు | |
|---|---|
| మండలం | ఎకరాలు |
| సీఎస్‌పురం | 8,505 |
| దర్శి | 2,302 |
| దొనకొండ | 125 |
| హనుమంతునిపాడు | 8,456 |
| కనిగిరి | 11,931 |
| కేకేమిట్ల | 12,750 |
| కురిచేడు | 689 |
| మర్రిపూడి | 6,591 |
| పీసీపల్లి | 9,773 |
| పామూరు | 4,945 |
| పొదిలి | 9,723 |
| పొన్నలూరు | 1,761 |
| వెలిగండ్ల | 7,055 |
| అర్ధవీడు | 272 |
| బేస్తవారిపేట | 4,344 |
| కంభం | 1,043 |
| దోర్నాల | 4,054 |
| గిద్దలూరు | 4,374 |
| కొమరోలు | 1,168 |
| మార్కాపురం | 3,501 |
| పెద్దారవీడు | 4,940 |
| పుల్లలచెరువు | 10,464 |
| రాచర్ల | 1,984 |
| తర్లుపాడు | 5,227 |
| త్రిపురాంతకం | 4,502 |
| వైపాలెం | 2,646 |
| చీమకుర్తి | 138 |
| కొండపి | 298 |
| కొత్తపట్నం | 651 |
| ముండ్లమూరు | 291 |
| నాగులుప్పలపాడు | 1,114 |
| ఒంగోలు | 402 |
| జరుగుమల్లి | 197 |




- జిల్లాలోని మార్కాపురం, కనిగిరి డివిజన్లలోనే అత్యధికంగా అసైన్డ్‌భూములను ఫ్రీహోల్డ్‌లో పెట్టారు.

### మార్కాపురం, కనిగిరి డివిజన్లలోనే అత్యధికం

- కనిగిరి డివిజన్‌లో 1,95,938 ఎకరాల అసైన్డ్ భూములు ఉండగా అందులో 84,611 ఎకరాలను ఫ్రీ హోల్డ్‌లో ఉంచారు.
- మార్కాపురం డివిజన్‌లో 1,19,228 ఎకరాలు అసైన్డ్ భూములు ఉండగా అందులో 48,523 ఎకరాలను ఫ్రీహోల్డ్ చేశారు.
- ఒంగోలు డివిజన్‌లో 29,571 ఎకరాల అసైన్డ్ భూములు ఉండగా 3,286 ఎకరాలను ఫ్రీ హోల్డ్‌లో పెట్టారు. సింగరాయకొండలో 3.91 ఎకరాల్లో, మద్దిపాడులో 5.70 ఎకరాలు, టంగుటూరులో 58, సంతనూతలపాడులో 52.53, తాళ్లూరులో 72 ఎకరాలను ఫ్రీ హోల్డ్‌లో పెట్టగా జిల్లాలోని మిగిలిన మండలాల్లో వంద నుంచి వేల ఎకరాలను ఫ్రీ హోల్డ్ చేశారు.



| డివిజన్ల వారీగా అసైన్డ్ భూముల వివరాలు | |
|---|---|
| డివిజన్ | ఎకరాలు |
| కనిగిరి డివిజన్ | 84,611 |
| మార్కాపురం డివిజన్ | 48,523 |
| ఒంగోలు డివిజన్ | 3,286 |



### వైసీపీ నేతలకు అనుకూలంగా భూములు

గత ప్రభుత్వ నిర్ణయం వైసీపీ నేతలకు వరంగా మారింది. వేల కోట్ల విలువచేసే భూములను కొల్లగొట్టడానికి ఉపయోగపడింది. చాలా మంది వైసీపీ నేతలు విలువైన భూములను తమ కుటుంబ సభ్యులు, అనుచరుల పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. మార్కాపురం, కనిగిరి డివిజన్లలో ఈ భూముల వ్యవహారం మరింత ఎక్కువగా ఉంది. డివిజన్ కేంద్రమైన కనిగిరితోపాటు ఆ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. అప్పటి ముఖ్య ప్రజాప్రతినిధి కనుసన్నల్లోనే ఈ ప్రక్రియ జరిగిందన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి.



సరస్వతీ నమస్తుభ్యం..

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఏడోరోజైన బుధవారం జిల్లావ్యాప్తంగా ఉన్న ఆలయాల్లో ఎక్కువచోట్ల అమ్మవార్లను సరస్వతీదేవిగా అలంకరించారు. త్రిపురాంతకంలోని శ్రీబాలాత్రిపురసుందరీదేవి గజవాహనంపై శ్రీకాళరాత్రి దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. మూలా నక్షత్రం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి, చిన్నమస్తాదేవికి ప్రత్యేక పూజలు చేశారు.

- ఒంగోలు కల్చరల్

# పారదర్శకంగా ఉచిత ఇసుక

- అక్రమంగా తరలిస్తే చర్యలు
- జిల్లాలో స్టాక్ పాయింట్లు లేవు
- స్థానిక అవసరాల కోసం ఎక్కడికక్కడ వెసులుబాటు
- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు (కలెక్టరేట్), అక్టోబరు 9 : జిల్లాలో ప్రజలకు ఉచిత ఇసుకను పారదర్శకంగా అందిస్తామని కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. అందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ ఏడాది జూలై 8నుంచి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని తీసుకువచ్చిందన్నారు. అప్పటి నుంచి జిల్లాలో 62,291 మెట్రిక్ టన్నుల ఇసుకను ఉచితంగా ప్రజలకు అందించామన్నారు. ప్రస్తుతం జిల్లాలో ఇసుక స్టాక్ పాయింట్లు లేవని స్పష్టం చేశారు. అవసరమైన ఇసుకను నెల్లూరు, కడప, కర్నూలు జిల్లాల్లోని స్టాక్ పాయింట్ల నుంచి సరఫరా చేస్తున్నామని చెప్పారు.

### ఫిర్యాదుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్

జిల్లాలో స్థానిక అవసరాల కోసం 285 వాగులు, వంకలను గుర్తించడం జరిగిందని కలెక్టర్ చెప్పారు. వాటి నుంచి సమీపంలోని గ్రామాల ప్రజలు సొంత అవసరాల కోసం ఉచితంగా తోలుకోవచ్చని తెలిపారు. పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలు చేపట్టేందుకు యజమానులు దరఖాస్తు చేసుకుంటే జిల్లాస్థాయి ఇసుక కమిటీ పరిశీలించి అనుమతులు ఇస్తుందన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా, పక్కన ఎస్పీ దామోదర్

ఈనెల నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు జిల్లాలో 4.36 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అవసరమవుతుందని అంచనా వేసినట్లు తెలిపారు. జిల్లాలో ఇసుక అక్రమ రవాణా, బ్లాక్ మార్కెటింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకొంటామని కలెక్టర్ తెలిపారు. ఇసుక అక్రమ తవ్వకాలపై ఫిర్యాదుల కోసం 62817 99518 నంబర్‌తో ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేశామన్నారు.

### 16 నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలు

జిల్లాలో మద్యం షాపుల కోసం ఈనెల 1నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని కలెక్టర్ అన్సారియా చెప్పారు. దరఖాస్తు గడువును ప్రభుత్వం మరో రెండు రోజులు పెంచిందన్నారు. జిల్లాలో 171 మద్యం దుకాణాలకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. 16నుంచి కొత్త దుకాణాలు ప్రారంభించుకోవచ్చని చెప్పారు. గీత కార్మికులకు 17 షాపులు కేటాయించడం జరిగిందని, వాటికి ప్రత్యేకంగా మార్గదర్శకాలు రావాల్సి ఉందని వెల్లడించారు.

### ఇసుక అక్రమ రవాణాపై నిఘా : ఎస్పీ దామోదర్

ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ దామోదర్ తెలిపారు. మూడు నెలల్లో 70 కేసులను నమోదు చేశామన్నారు. ఉచిత ఇసుక విధానం పటిష్ఠంగా అమలయ్యేలా క్షేత్రస్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇసుక అక్రమ రవాణా చేస్తూ వాహనాలు పట్టుబడితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. మరోసారి దొరికితే యజమానులపై పీడీ యాక్టు కింద చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జేసీ ఆర్.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

# మరో రెండు రోజులు

- మద్యం షాపులకు దరఖాస్తు గడువు పెంపు
- రేపటి వరకూ అవకాశం
- 14న లాటరీ ద్వారా కేటాయింపు

ఒంగోలు (క్రైం), అక్టోబరు 9 : మద్యం దుకాణాల కోసం దరఖాస్తు గడువును ప్రభుత్వం మరో రెండు రోజులు పెంచింది. శుక్రవారం వరకు అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. జిల్లాలో 171 మద్యం దుకాణాలకు అధికారులు నోటిఫికేషన్ ఇచ్చారు. తొలుత ప్రకటించిన ప్రకారం బుధవారంతో దరఖాస్తుల దాఖలుకు గడువు ముగియాల్సి ఉంది. కానీ దరఖాస్తుదారుల విజ్ఞప్తి మేరకు ఈనెల 11 వరకూ గడువు పొడిగించింది. బుధవారం రాత్రి వరకూ 2,168 దరఖాస్తులు అందాయి. ఈనెల 14న లాటరీ విధానంలో షాపులు కేటాయించనున్నారు. 16 నుంచి అవి తెరుచుకోనున్నాయి. ఇప్పటి వరకూ మద్యం దుకాణాల దరఖాస్తు ఫీజు ద్వారా 43.36 కోట్ల మేర ప్రభుత్వ ఖజానాకు ఆదాయం చేకూరింది. ప్రస్తుతం సరాసరి మద్యం దుకాణానికి 12 దరఖాస్తులకు పైగా వచ్చాయి. మరో రెండు రోజులు అవకాశం ఇవ్వడంతో వీటి సంఖ్య మరింత పెరుగుతుందని ఎక్సైజ్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

మంచంపట్టిన నాంచారపురం
లోపలి పేజీల్లో...

# పంచాయితీపై ఫైర్

- గ్రేడ్-5, గ్రేడ్-6 ఉద్యోగుల బది'లీలల'పై పీఆర్ డైరెక్టర్ సీరియస్
- డీపీవో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్
- పూర్వపు అధికారి ఉషారాణిపై విచారణకు ఆదేశం
- కలెక్టర్‌కు నివేదిక సమర్పించిన ఎస్డీసీ లోకేశ్వరరావు

ఒంగోలు (కలెక్టరేట్), అక్టోబరు 9 : గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న గ్రేడ్-5, గ్రేడ్-6 (సచివాలయ కార్యదర్శులు) ఉద్యోగుల బదిలీల్లో తిరకాసుపై పీఆర్ డైరెక్టర్ రవితేజ సీరియస్ అయ్యారు. బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో డీపీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కిషోర్‌బాబును కలెక్టర్ అన్సారియా సస్పెండ్ చేశారు. పూర్వపు డీపీవో ఉషారాణిపై విచారణకు ఆదేశించారు. గ్రేడ్-5, గ్రేడ్-6 ఉద్యోగుల బదిలీల విషయంలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయి. పెద్దఎత్తున చేతులు మారినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టిన ఎస్డీసీ లోకేశ్వరరావు బుధవారం సాయంత్రం నివేదికను సమర్పించారు. అయితే ఉద్యోగులకు బదిలీ ఉత్తర్వులు ఇవ్వడంలో జాప్యం వెనుక వసూళ్ల మర్మం ఉందన్న ఫిర్యాదులు పంచాయతీరాజ్ డైరెక్టర్‌కు వెళ్లాయి. దీనిపై ఆయన సీరియస్ అయ్యారు. తక్షణ చర్యలకు ఆదేశించారు. దీంతో కలెక్టర్‌కు విచారణాధికారి నివేదిక సమర్పించడానికి ముందుగానే జూనియర్ అసిస్టెంట్‌పై వేటు పడింది. డైరెక్టర్ ఆదేశాల మేరకు డీపీవో గొట్టిపాటి వెంకటనాయుడు అందుకు సంబంధించిన ఫైల్‌ను బుధవారం కలెక్టర్‌కు పంపగా ఆమె ఆమోదముద్ర వేశారు. పూర్వపు డీపీవో ఉషారాణిపై విచారణకు ఆదేశించారు. మున్ముందు మరికొంత మందిపై వేటు పడే అవకాశం ఉంది.

### విచారణలో అవాక్కయ్యే నిజాలు బహిర్గతం

బదిలీల్లో అక్రమాలపై విచారణాధికారిగా నియమితులైన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు రెండ్రోజుల క్రితం పూర్వ జిల్లా పంచాయతీ అధికారి ఉషారాణి, అప్పటి ఏవో శివప్రసాద్, జూనియర్ అసిస్టెంట్‌లు కిషోర్, సాయిలను విచారించారు. వారి వద్ద నుంచి లిఖిత పూర్వకంగా సమాచారం తీసుకున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న పంచాయతీ కార్యదర్శులతో లోకేశ్వరరావు మాట్లాడినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా విస్తుపోయే నిజాలను కార్యదర్శులు చెప్పినట్లు సమాచారం. ఎవరెవరికి ఎంత ఇచ్చింది పూసగుచ్చినట్లు వివరించినట్లు తెలిసింది. ప్రధానంగా ముగ్గురు పేర్లను వారు వెల్లడించినట్లు చెబుతున్నారు. వారి ఫోన్‌పే ఐడీల ద్వారా వారి బ్యాంకు ఖాతాలకు జమైన నగదు వివరాలను విచారణాధికారి సేకరించినట్లు సమాచారం. ఆ మొత్తం వివరాలను ఆయన తన నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. కౌన్సెలింగ్ నిర్వహించి నెల దాటినా సకాలంలో ఆర్డర్లు ఇవ్వకపోవడం వెనుక మర్మాన్ని కూడా ఆయన అందులో పొందుపర్చినట్లు తెలుస్తోంది.


విచారణకు హాజరైన పూర్వపు డీపీవో, సిబ్బంది(ఫైల్)

# ఎన్టీఆర్ గృహాలకు మహర్దశ

- త్వరలో లబ్ధిదారులకు బిల్లులు
- సర్వత్రా హర్షం

సంతనూతలపాడు, అక్టోబరు 9: పేదింటి సొంతకలను నెరవేర్చేందుకు 2014-19లో నాడు టీడీపీ ప్రభుత్వం పక్కా గృహాలను మంజూరుచేసింది. నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు కొంతమేర బిల్లులు చెల్లించింది. అనంతరం జరిగిన ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన గత వైసీపీ లబ్ధిదారులకు బిల్లులు మంజూరు చేయకపోవడంతో ఎన్టీఆర్ పక్కా ఇళ్ల బిల్లులు ఆగిపోయాయి. అప్పులు చేసి నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులు దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు. వైసీపీ హయాంలో మంజూరైన ఇళ్లు కూడా పూర్తిస్థాయిలో ఇప్పటికి బిల్లులు మంజూరు చేయలేదు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం పేదల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఎన్టీఆర్, జగనన్న పక్కా ఇళ్ల నిర్మాణ బిల్లులు మంజూరు చేయాలని నిర్ణయించడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో అధికారులు సర్వేలు చేపట్టి లబ్ధిదారులు పక్కా ఇళ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పిస్తున్నారు.

### నియోజకవర్గవ్యాప్తంగా..

సంతనూతలపాడు నియోజకవర్గవ్యాప్తంగా బీబీఎల్(పునాదుల కోసం తవ్విన గుంతలు), బీఎల్(పునాదులు), ఆర్ఎల్(గోడల స్థాయి), ఆర్సీ (పైకప్పు) ఎల్ఎల్(లెంట్‌లెవల్) వివిధ దశల్లో 3,119 ఇళ్లు ఉన్నాయి. వీటిలో బీబీఎల్ స్థాయిలో 128, బీఎల్ స్థాయిలో 332, ఆర్ఎల్‌స్థాయిలో 158, ఆర్సీ దశలో 2,296, ఎల్ఎల్ స్థాయిలో 10, పూర్తయిన ఇళ్లు 96, ఎస్ఎస్(మొదలు పెట్టనవి) 195 వరకు ఉన్నాయి. గతంలో ఎన్టీఆర్ ఇంటి నిర్మాణానికి రూ.1.50లక్షలు కేటాయించారు. దానిని పెంచి ప్రస్తుతం రూ.1.80లక్షలు ఇవ్వనున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. వైసీపీ హయాంలో అసంపూర్తిగా ఉన్న ఇళ్లకు వందరోజుల సమయం ఇచ్చారు. నిర్మాణాలు పూర్తి చేస్తే వీరందరికి డిసెంబరులో లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ అయ్యే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

| మండలం | ఎస్ఎస్ | బీబీఎల్ | బీఎల్ | ఎల్ఎల్ | ఆర్ఎల్ | ఆర్పీ | పూర్తి | మొత్తం |
|---|---|---|---|---|---|---|---|---|
| చీమకుర్తి | 24 | 27 | 79 | 2 | 35 | 552 | 34 | 753 |
| మద్దిపాడు | 55 | 23 | 89 | 5 | 25 | 521 | 2 | 720 |
| ఎన్‌జీపాడు | 50 | 14 | 101 | 1 | 74 | 593 | 60 | 893 |
| ఎస్ఎన్‌పాడు | 66 | 64 | 63 | 2 | 24 | 630 | 0 | 849 |
| **మొత్తం** | **195** | **128** | **332** | **10** | **158** | **2,296** | **96** | **3,215** |



ఎం.వేములపాడులో సర్వే చేస్తున్న హౌసింగ్ సిబ్బంది



చీమకుర్తి మండలం నాయుడుపాలెంలో..

### క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నాం
### - చెన్నారాయుడు, హౌసింగ్ డీఈ

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 2014-19 వరకు పక్కా గృహాలు మంజూరై బిల్లులు రాని లబ్ధిదారులను గుర్తించాం. మంజూరైన ఇళ్లు ఏ దశలో ఉందో సర్వే చేస్తున్నాం. ఉన్నతాధికారుల నుంచి అనుమతి రాగానే అందరికీ బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటాం.

## డ్వాక్రా మహిళలు వ్యాపారవేత్తలుగా మారాలి

- డీఆర్‌డీఏ పీడీ వసుంధర

నాగులుప్పలపాడు అక్టోబరు 9 : స్వయం సహాయక సంఘాల మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకొని వ్యాపారవేత్తలుగా ఎదగాలని డీఆర్‌డీఏ పీడీ టి.వసుంధర కోరారు. బుధవారం నాగులుప్పలపాడు వెలుగు కార్యాలయంలో వీవోఏలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపు మహిళలకు పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ పథకాల ద్వారా రూ.లక్ష నుంచి రూ.20లక్షల వరకు రుణాలను అందించనున్నట్లు తెలిపారు. డ్వాక్రా మహిళలు చిన్నపాటి వ్యాపారాలను చేపట్టి ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. తీసుకొన్న రుణాలను క్రమం తప్పకుండా చెల్లించాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో ఏసీ ఎం.విజయమ్మ, ఏపీఎం బి.నరేంద్రకుమార్, స్త్రీనిధి మేనేజర్ ఎం.శ్రీనివాసరావు, సీసీలు రామకృష్ణ, రమణమ్మ, కవిత, ఆరుణ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 9: లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి గురువారం ఒంగోలుకు రానున్నారు. సాయంత్రం ఐదు గంటలకు స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. రాత్రి ఏడు గంటలకు కొత్తపట్నం బస్టాండు వద్ద ఉన్న శ్రీగంగాపార్వతి సమేత రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో జరిగే పూజా కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం పోలేరమ్మతల్లి ఆలయం, శ్రీమహాలక్ష్మిఅమ్మవారి ఆలయంలో జరిగే నవరాత్రి ఉత్సవాలకు ఆయన హాజరవుతారు.

## ముగిసిన పొగాకు కొనుగోళ్లు



రైతులతో మాట్లాడుతున్న ప్రొడక్షన్ మేనేజర్ కృష్ణశ్రీ

సంతనూతలపాడు, అక్టోబరు 9: పేర్నమిట్ట సమీపంలో ఒంగోలు-1వ పొగాకు వేలంకేంద్రంలో బుధవారంతో పొగాకు అమ్మకాలు ముగిసినట్లు ప్రొడక్షన్ మేనేజర్ కృష్ణశ్రీ తెలిపారు. బుధవారం స్థానిక వేలం కేంద్రంలో జరిగిన రైతుల ఆత్మీయసమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు 18.70 మిలియన్ కేజీల పొగాకు కొనుగోలు జరిగిందన్నారు. సరాసరి కిలో రూ.278.19 ధరతో రూ.507కోట్ల పొగాకు అమ్మకాలు జరిగినట్లు చెప్పారు. మొత్తం వేలంలో 3,069 మంది రైతులు 10.04 మిలియన్ కేజీల పంట అనుమతించగా 18.70 మిలియన్ కేజీల పొగాకు పండించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎక్స్‌టెన్షన్ మేనేజర్ దామోదర్, బోర్డు మెంబర్లు పొద వరప్రసాద్, ఐటీసీ లీఫ్ మేనేజర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం దుకాణాల కోసం మంతనాలు

- సిండికేట్‌గా మారి దరఖాస్తులు

మద్దిపాడు, అక్టోబరు 9: రాష్ట్రంలో ఐదేళ్ల తర్వాత అమల్లోకి వచ్చిన కొత్త మద్యం పాలసీ తెచ్చింది. లాటరీల్లో మద్యం దుకాణం కేటాయించనుంది. దరఖాస్తుకు 11వ తేదీ ఆఖరు కావడంతో మద్దిపాడు మండలంలో పలు ఆసక్తికర పరిణామాలు వెలుగుచూస్తున్నాయి. మద్యం దరఖాస్తుల విషయంలో ఒక నేత జోక్యం చేసుకోవడంతో ఓత్సాహిక మద్యం వ్యాపారులు వాపోతున్నారు. ఒక నేత 20 శాతం వాటా అడుగుతున్నారని, అయితే 10 శాతం ఇస్తామని సంకేతాలు ఇచ్చామని వారు చెబుతున్నారు. ఇక మద్యం దుకాణం దరఖాస్తు ఫీజు గతంలో రూ.50 వేలు ఉండేది. దీంతో వ్యాపారులు పలు దుకాణాలకు దరఖాస్తులు చేసుకునేవారు. ప్రస్తుతం దరఖాస్తు ఫీజు రూ.2లక్షలకు పెంచారు. ఈక్రమంలో వ్యాపారులు అంతమొత్తం పెట్టలేక సిండికేట్‌గా ఏర్పడి కనీసం 20దరఖాస్తులు తక్కువ కాకుండా వేసేందుకు సిద్ధపడుతున్నారు. ఏ ఒక్కటి లాటరీలో దుకాణం వచ్చినా అందరికీ వాటాలు ఉండేలా చూసుకుంటున్నారు. ఇక ప్రతిపక్ష నాయకులు కూడా సిండికేట్‌లో సభ్యులవుతున్నారు. సిండికేట్ వ్యాపారులు కొందరు జాతకాలు ఆధారంగా దరఖాస్తులు వేస్తున్నారు. పేరు, నక్షత్రం బట్టి ఉన్న వారిలో ఎవరు జాతకం బలంగా ఉందో చూసి వారి పేరతో దరఖాస్తు చేస్తున్నారు. మండలంలో ప్రభుత్వం నాలుగు షాపులు కేటాయించగా ఒక షాపు గీత కార్మికులకు రిజర్వు, గీత కార్మికుల పేరుతో ఆ షాపు కూడా దరఖాస్తులు సిండికేట్‌తో వేస్తున్నారు. లాటరీ ఎవరికి దుకాణం వచ్చినా అందరూ కలిసి నిర్వహించేందుకు ఒప్పందం చేసుకుటున్నారు.

## మండల కార్యాలయానికి నూతన శోభ


- కూటమి ప్రభుత్వం వచ్చాక మరమ్మతులు



కార్యాలయంలో ఏర్పాటు చేసిన టైల్స్

నాగులుప్పలపాడు అక్టోబరు 9: స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే మరమ్మతులు పనులు చేపట్టింది. రంగులు కూడా దిద్దడంతో నూతన కళను సంతరించుకొంది. అప్పటి ముఖ్యమంత్రి దివంగత ఎన్టీఆర్ హయాంలో పోతవరం గ్రామానికి చెందిన పొనుగుపాటి కోటేశ్వరావు ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో నిర్మించిన మండల పరిషత్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరింది. వర్షపు నీరు శ్లాబు నుంచి ఉరుస్తూ ఉద్యోగులు విధులు నిర్వహించేందుకు ఇబ్బందిగా మారింది. ఫ్లోరింగ్ సైతం దెబ్బతింది. రంగులు వెలసిపోయి బోసిగా మారింది. గత వైసీపీ పాలనలో నూతన మండల కాంప్లెక్స్ భవన నిర్మాణాల కోసం నిధులు మంజూరు చేయాలని ఎంపీపీ నలమలపు అంజమ్మ అప్పటి సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లగా ఎలాంటి స్పందన లభించలేదు. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం రాకతో అధికారులు ఎంపీడీవో కార్యాలయానికి మరమ్మతు పనులు చేపట్టారు. ఈ నెలాఖరు నాటికి పనులు పూర్తికానున్నట్లు ఎంపీడీవో మహాలక్ష్మి తెలిపారు.

## విత్తనశుద్ధి చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఏవో రమేష్‌బాబు

మద్దిపాడు, అక్టోబరు 9: రైతులు పంటల సాగుకు ముందు విత్తనశుద్ధి చేసుకోవాలని వ్యవసాయ అధికారి జి.రమేష్‌బాబు పేర్కొన్నారు. బుధవారం వెల్లంపల్లి గ్రామంలో సర్పంచ్ చిట్టిబోయిన అనిల్‌కుమార్ యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మేలైన విత్తనాన్ని ఎంపిక చేసుకోవాలన్నారు. పంట దిగుబడి విత్తనం నాణ్యతపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వెల్లంపల్లి సర్పంచ్ చిట్టిబోయిన అనిల్‌కుమార్ యాదవ్, బీజేపీ మండల కన్వీనర్ చెన్నుపాటి వెంకటరమణ, విస్తరణ అధికారి పాటిబండ్ల వెంకటశేషారావు, సాగర్‌బాబు, వెల్లంపల్లి, మద్దిపాడు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను సక్రమంగా అందించాలి

- కలెక్టర్ అన్సారియా



పేర్నమిట్ట రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

సంతనూతలపాడు, అక్టోబరు 9: రైతుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. బుధవారం పేర్నమిట్టలో సాగు చేసిన మిరప పంటలను ఆమె పరిశీలించారు. ముందుగా డీఏవో శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 2లక్షల2వేల హెక్టార్లకు గాను, లక్షా69వేలహెక్టార్లలో పంటలు సాగైనట్లు చెప్పారు. 99శాతం మంది ఈ-పంట నమోదు చేసుకున్నారని, రైతుల ఈకేవైసీ వివరాలను ఈనెల 10వ తేదీకి పూర్తి చేస్తామని తెలిపారు. అవసరమైన ఎరువులను రాయితీపై అందిస్తున్నట్లు తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ బహిరంగ మార్కెట్లో ఎరువులు, పురుగుల మందులు అధికధరలకు విక్రయించేవారిపై కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులందరు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని, తద్వారా ప్రభుత్వం అందించే ప్రయోజనాలు అందుతాయన్నారు. కొందరు రైతులు మాట్లాడుతూ తమకు నీటి సమస్య ఉందని, కాలువల ద్వారా అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరగా సానుకూలంగా స్పందించారు. అనంతరం నియోజకవర్గ వ్యవసాయ పరీక్షాకేంద్రాన్ని సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో జేడీ రమేష్‌బాబు, తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఏవో పావని, ప్రత్యూష పాల్గొన్నారు.

### వంద రోజుల కార్యచణ ప్రణాళికను త్వరగా పూర్తి చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్): వంద రోజుల కార్యచరణ ప్రణాళిక లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో బుధవారం సాయంత్రం జిల్లా అధికారులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉపాధి హామీ పథకం కింద కార్యచరణ ప్రణాళికలో చూపిన పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. హౌసింగ్ శాఖ అధికారులు గృహ నిర్మాణాల పురోగతిపై దృష్టి సారించాలని చెప్పారు. సమావేశంలో సీపీవో వెంకటేశ్వర్లు, అధికారులు శ్రీనివాసరావు, చంద్రశేఖర్‌రెడ్డి, బేబీరాణి, వసుంధర, రవికుమార్, జోసఫ్‌కుమార్, మాధురి, రమణ, గొట్టిపాటి వెంకటనాయుడు, సుశీల, డాక్టర్ సురేష్‌కుమార్, దేవానంద్ పాల్గొన్నారు.

# త్వరలోనే మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం

- ఎమ్మెల్యే దామచర్ల



నూతన బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, మేయర్ సుజాత

ఒంగోలు(కార్పొరేషన్), అక్టోబరు 9: టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100రోజుల్లోనే అభివృద్ధివైపు అడుగుల వేయడంతోపాటు, హామీలు అమలు చేసి చూపిస్తుందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఏపీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో ఒంగోలులో నూతనంగా ఏర్పాటు చేసిన రెండు ఇంద్ర, స్టార్‌లైన్ బస్సులను ఎమ్మెల్యే ప్రారంభించారు ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ ప్రైవేటు బస్సులకు దీటుగా ఆర్టీసీ ఆధ్వర్యంలో ఆధునిక హంగులు, నూతన బస్సులను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. కూటమి హామీలలో భాగంగా త్వరలోనే మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు సురక్షిత ప్రయాణం ఆర్టీసీతోనే సాధ్యమన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలోనే ఒంగోలు డిపోకి 105 కొత్త బస్సులను తీసుకురావడం జరిగిందన్నారు. రోడ్డు భద్రత విషయంలో ఆర్టీసీ ప్రయాణ సురక్షితమని, ఆర్టీసీకి ఆదాయం వచ్చినా ప్రభుత్వానికి వచ్చినట్లే అని ఆయన చెప్పారు. ఒంగోలు డిపోలో మొత్తంగా 22 ఏసీ బస్సులను తెచ్చినట్లు వివరించారు. ప్రజలు ఆర్టీసీలో ప్రయాణించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, ఆర్టీసీ ఆర్ఎం సుధాకర్‌బాబు, డిపో మేనేజరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎంపీ మాగుంట పార్వతమ్మకు నివాళి

- దశదిన కర్మకు హాజరైన మంత్రి స్వామి







నివాళులర్పిస్తున్న మంత్రి స్వామి, చైర్మన్ సత్య, ఎంపీ మాగుంట, పరామర్శిస్తున్న పోతుల రామారావు

టంగుటూరు, అక్టోబరు 9 : అనారోగ్యం కారణంగా ఇటీవల మృతి చెందిన మాజీ ఎంపీ మాగుంట పార్వతమ్మ దశదిన కర్మ బుధవారం నెల్లూరులోని ఆమె స్వగృహంలో నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, మాజీ ఎమ్మెల్యే పోతుల నరసింహారావులు పార్వతమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మాగుంట కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు పోతుల నరసింహారావు, టీడీపీ నాయకులు చిడిపోతు లక్ష్మయ్య, కసుకుర్తి శ్రీధర్, చదలవాడ వేణు, కాగా జిల్లా నలుమూలల నుంచి మాగుంట అభిమానులు, తెలుగుదేశం పార్టీ నాయకులు భారీగా ఈ కార్యక్రమానికి తరలివెళ్లారు.

# హలో.. డీజీపీ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నాం..

- దొడ్డవరప్పాడు సర్పంచ్‌కు బెదిరింపులు
- రూ.10లక్షలు పంపకుంటే కేసులు పెడతామంటా హెచ్చరిక
- రూ.10వేలు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు
- నిందితులైన తండ్రీకొడుకుల అరెస్టు
- ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు వెల్లడి

ఒంగోలు(క్రైం)/మద్దిపాడు, అక్టోబరు 9: "హలో.. మేము డీజీపీ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నాం. సర్పంచ్‌గా నీవు చేసిన మోసాలు మాకు తెలును. కేసులు పెట్టకుండా ఉండాలంటే వెంటనే రూ.10లక్షలు పంపు. లేకుంటే ఇబ్బందిపడతావ్." అంటూ సైబర్‌నేరగాళ్లు బెదిరింపులకు దిగారు. దీంతో బాధిత సర్పంచ్ ఎస్పీ దామోదర్‌ను ఆశ్రయించడంతో రంగంలోకి దిగిన పోలీసులు నిందితులను పట్టుకున్నారు. బుధవారం ఒంగోలు రూరల్ సీఐ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో సీఐ శ్రీకాంత్‌బాబు కేసు వివరాలను వెల్లడించారు.

### అసలేం జరిగిందంటే..

దొడ్డవరపాడు పంచాయతీలో రూ.7.5లక్షలు అవినీతికి పాల్పడటంతో గ్రామ కార్యదర్శిని ఇటీవల సస్పెండ్ చేశారు. ఈ మేరకు మీడియాలో వచ్చిన కథనాలను చూసిన సైబర్‌నేరగాడు పెరుసోముల వీరనారాయణ అనే వ్యక్తి సర్పంచ్ శ్రీరామమూర్తి ఫోన్ నంబరు కోసం ఇంటర్నెట్‌లో వెతుకుతుండగా ఆ గ్రామ ఉపసర్పంచ్ నంబరు కనిపించింది. దీంతో ఆయన ద్వారా శ్రీరామమూర్తి కదలికలు కనుగొన్న వీరనారాయణ, ఆయన తండ్రి సత్యనారాయణ ఫోన్‌లో బెదిరింపులకు పాల్పడ్డారు. తాము డీజీపీ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామని శ్రీరామమూర్తి దంపతులకు ఫోన్ చేశారు. మీరు పంచాయతీలో చేసిన అక్రమాలు తమకు తెలుసని బెదిరించారు. అంతేగాకుండా గతంలో పనిచేసిన ఎస్పీ బాగా తమకు తెలుసని రూ.10లక్షలు ఇస్తే మీ మీద ఎలాంటి కేసులు లేకుండా చేస్తామని చెప్పారు. దీనికితోడు సర్పంచ్ శ్రీరామమూర్తి దంపతుల కదలికలు ఎప్పటికప్పుడు ఉపసర్పంచ్ ద్వారా తెలుసుకుని బెదిరిస్తున్నారు. దీంతో ఒకరోజు గత్యంతరం లేక రూ.10 వేలను ఫోన్‌పే ద్వారా చెల్లించారు. అయితే తరువాత రూ.10లక్షల కోసం డిమాండ్ చేయడం అధికమైంది. దీంతో భయాందోళన చెందిన సర్పంచ్ శ్రీరామమూర్తి ఒంగోలులో ఎస్పీ దామోదర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. గత నెల 20న మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేశారు. ఈక్రమంలో బాపట్ల జిల్లా అద్దంకికి చెందిన పెరుసోముల వీరనారాయణ, అతని తండ్రి సత్యనారాయణలను మద్దిపాడు పోలీసులు మంగళవారం సాయంత్రం ఒంగోలు-గుంటూరురోడ్డులోని మద్దిపాడు కొష్టాల వద్ద అదుపులోకి తీసుకొని విచారించారు. వారు సైబర్‌నేరాలకు పాల్పడుతుంటారని విచారణలో వెల్లడైందని, దొడ్డవరపాడు సర్పంచ్ శ్రీరామమూర్తి దంపతులను మోసం చేసి రూ.10 వేలు కొట్టేసినట్లు ఒప్పుకున్నారని సీఐ వెల్లడించారు. దొడ్డవరప్పాడుకు చెందిన ఉప సర్పంచ్‌ను, నిందితులను ఫస్ట్‌క్లాస్ జుడిషియల్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా వారికి రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. గతంలో కూడా వీరిపై హైదరాబాద్ సిటీ పరిధిలోని రాచకొండపోలీస్‌స్టేషన్, విద్యానగర్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు నమోదై ఉన్నాయని, సదరు కేసులు కోర్టులో పెండింగ్ ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మద్దిపాడు ఎస్సై శివరామయ్య, పోలీసులు పాల్గొన్నారు.

### అపరిచితుల మాటలు నమ్మొద్దు : రూరల్ సీఐ



సీఐ శ్రీకాంత్‌బాబు

అపరిచిత వ్యక్తులు ఫోనులు చేసి తాము డీజీపీ కార్యాలయం లేదా సీబీఐ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామని బెదిరిస్తే ఎవరూ నమ్మవద్దని ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు తెలిపారు. అలాంటి బెదిరింపుకాల్స్ వస్తే వెంటనే దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

## ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలి



జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

కొండపి, అక్టోబరు 9 : కేంద్ర, రాష్ట్ర పాలకులు ప్రజాసమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆంధ్ర మాల్యాద్రి చెప్పారు. పెరిదేపి గ్రామంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటిపోయినా ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని అయన ఆవిష్కరించారు. దివంగత సీపీఎం నేతలు సీతారాం ఏచూరి, ముప్పరాజు శేషయ్యలకు నివాళులర్పించారు. సమావేశంలో నేతలు కంకణాల ఆంజనేయులు, గంటెనపల్లి శ్రీనివాసులు, కంకణాల రమాదేవి, మల్లెల రమేష్, కేజీ మస్తాన్, ముప్పరాజు బ్రహ్మయ్య, అంగలకుర్తి విశ్రాంతి, మల్లెల కొండయ్య, చిన్నపేతురు తదితరులు పాల్గొన్నారు.

# అవీ..ఇవీ..

## మైథిలి కుటుంబాన్ని ఆదుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కృష్ణారావు

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 9: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన క్రీడాకారిణి మైథిలి కుటుంబాన్ని అన్ని విధాలుగా అదుకోవాలని జైశ్రీకృష్ణ బీసీ సమితి వ్యవస్థాపకుడు ద్రావిడ దేశం కృష్ణారావు కోరారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి వినతిపత్రం అందజేశారు. వినుకొండలో జరిగిన అండర్-19 ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొని గత నెల 29న ఇంటికి బయలుదేరిన మైథిలి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారన్నారు. ఈ ప్రమాదంపై విచారణ జరిపించి అందుకు బాధ్యులైన నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. క్రీడాకారిణి కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కోన గురవయ్య, కాటమరాజు, ఎం.రాజు, లగ్గాల కోటేశ్వరరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

## ఐసీపీఎస్ విభాగాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు

ఒంగోలు నగరం, అక్టోబరు 9: స్త్రీశిశుసంక్షేమశాఖ, ఇంటిగ్రేటెడ్ చైల్డ్ ప్రొటెక్షన్ స్కీమ్ కింద పని చేస్తున్న విభాగాల్లో ఉన్న ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కె.మాధురి బుధవారం కోరారు. ప్రత్యేక దత్తత విభాగం, గిద్దలూరు, ఒంగోలులోని బాలసదనంలు, ఒంగోలులోని వన్‌స్టాప్ సెంటర్‌లో ఉన్న ఖాళీ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రక్రియ ప్రారంభమయ్యిందన్నారు. ఖాళీల వివరాలు, విద్యార్హతల కోసం ప్రకాశం.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను చూడాలని తెలిపారు. ఈ నెల 14 నుంచి 21వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులను రామ్‌నగర్ మూడవలైనులో ఉన్న స్త్రీశిశుసంక్షేమశాఖ కార్యాలయంలో అందజేయాలని ఆమె కోరారు.

## రూ.65 లక్షలతో ఉపాధి పనులు

నాగులుప్పలపాడు అక్టోబరు 9: ఉపాధి హామీ పథకం కింద వచ్చే ఏడాదిలో కూలీలకు రూ.65లక్షలతో పనులు కల్పించేలా ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నట్లు ఏపీవో రవిబాబు తెలిపారు. చేకూరపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద 2025-26 ఏడాదికి గ్రామంలో చేపట్టనున్న ఉపాధి పనులపై బుధవారం గ్రామసభ సర్పంచ్ కొమ్మినేని రమేష్‌బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ ఇచ్చిన కొలతల ప్రకారం కూలీలు పనులు చేయాలని సూచించారు. పని ప్రదేశాల వద్ద కూలీలకు తాగునీరు, టెంట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## టెట్‌కు 98 మంది గైర్హాజరు

ఒంగోలు(విద్య), అక్టోబరు 9: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు బుధవారం జిల్లాలోని మూడు పరీక్షా కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 98 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కె.శివకుమార్ తెలిపారు. జిల్లాలో మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాలు ఉండగా, మార్కాపురంలోని శామ్యూల్‌జార్జి ఇంజనీరింగ్ కాలేజీలో బుధవారం పరీక్ష నిర్వహించలేదు. జిల్లాలో 792 మంది అభ్యర్థులను కేటాయించగా 694మంది పరీక్షకు హాజరయ్యారు. ఉదయం సెషన్‌కు 396మందికి గాను 347మంది హాజరు కాగా, 49 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో కూడా 396మంది అభ్యర్థులకు కేటాయించగా 49 మంది గైర్హాజరైనట్లు శివకుమార్ తెలిపారు.

## 15నుంచి యూనివర్సిటీలో స్పాట్ అడ్మిషన్లు

ఒంగోలు(విద్య), అక్టోబరు 9: ఒంగోలు ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకాం ఫీజు కోర్సుల్లో మిగిలి పోయిన సీట్లను ఈనెల 15నుంచి స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్లు యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్ల ప్రొఫెసర్ జి.సోమశేఖర్ బుధవారం తెలిపారు. ఎంఏ హిస్టరీ, ఎకనామిక్స్, సోషల్‌వర్క్, ఎంకాం, ఎమ్మెస్సీ మేథమేటిక్స్, స్టాటిస్టిక్స్, ఆక్వా కల్చర్, కంప్యూటర్ సైన్స్, కెమిస్ట్రీ, ఎంఎడ్, బీపీఎడ్, ఎంపీఎడ్ కోర్సుల్లో సీట్లు ఖాళీగా ఉన్నట్లు వివరించారు. యూనివర్సిటీ కళాశాలలో ప్రవేశాలు కోరుకునే వారు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఈనెల 15నుంచి డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఆయన కోరారు. అడ్మిషన్ పొందిన విద్యార్థులు అదేరోజు కోర్సు ఫీజు మొత్తం చెల్లించాల్సి ఉంటుందన్నారు. స్పాట్ అడ్మిషన్ల ద్వారా ప్రవేశాలు పొందే వారికి ఫీజు రీఎంబర్స్‌మెంట్ వర్తించదని, వివరాలకు 8341935856 సెల్ నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

## టిడ్కో కార్పొరేషన్ చైర్మన్‌కు సత్కారం



అజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 9: జనసేన పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ టిడ్కో కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులు కావడంతో ఆ పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. బుధవారం నెల్లూరులో అజయ్‌కుమార్‌ను జనసేన పార్టీ ప్రచార కమిటీ జిల్లా కో ఆర్డినేటర్ జడా బాలనాగేంద్రయాదవ్ ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకే అందజేసి శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో ఒంగోలు ఎంపీపీ మల్లికార్జునరెడ్డి, కాకి కృపారావు, స్వాతి, కృష్ణారెడ్డి, రవీంద్రనాథ్‌ఠాగూర్, కిరణ్‌కుమార్, కోటయ్య, నందకిషోర్, శ్యామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పీఎఫ్ స్లిప్పులు వెంటనే ఇవ్వాలి

ఒంగోలు(విద్య), అక్టోబరు 9: జిల్లాలోని ఉపాధ్యాయుల జడ్పీ పీఎఫ్ స్లిప్పులను మండలాలకు, హైస్కూళ్ళకు వెంటనే ఇవ్వాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వి.జనార్దనరెడ్డి, డి.శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. పీఎఫ్ స్లిప్పులు ఆన్‌లైన్ చేయాలని, మంజూరైన పీఎఫ్ క్లోజర్లు, లోన్సను వెంటనే పీఎఫ్ఎంఎస్‌కు అప్‌లోడ్ చేయాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను చర్చించి పరిష్కరించేందుకు ఉన్న ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించాలని డీఈవోను కోరారు. తెలుగు ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలకు స్టైపస్ కోసం వెంటనే డీఈవో పంపాలని, ఎన్‌వోసీలు వెంటనే క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు.

## వచ్చే నెలలో హేతువాద సంఘం మహాసభలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 9: ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘం మహాసభలు వచ్చేనెల 9,10 తేదీల్లో ఒంగోలులో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య తెలిపారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో మహాసభల కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశం మతోన్మాద భావజాల కబంధ హస్తాలలో చిక్కుకుందన్నారు. దీనికి పరిష్కారంగా ప్రజల్లో భావచైతన్య రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ మహాసభల్లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రిటైర్డ్ న్యాయమూర్తి వంగవోలు నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్వీ.రంగారెడ్డి, నజీర్, శిఖా చంద్రశేఖర్‌బాబు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్‌కే.బేగ్ పాల్గొన్నారు.

## ఏపీఎండీసీలో కార్మికులను పర్మినెంట్ చేయాలి



కార్మికులతో మాట్లాడుతున్న సుబ్బారావు

చీమకుర్తి, అక్టోబరు 9 ఏపీ మినరల్ డవలెప్‌మెంట్ కార్పొరేషన్‌లో గత ఇరవై ఏళ్లుగా పనిచేస్తున్న గిరిజన కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు డిమాండ్ చేశారు. రామతీర్థం వద్ద ఉన్న ఏపీఎండీసీ కార్యాలయంలో పనిచేస్తున్న కార్మికులను ఆయన బుధవారం కలిసి వారి సమస్యలపై మాట్లాడారు. ఇరవైఏళ్ల క్రితం ట్రైనీలుగా చేరిన గిరిజన కార్మికులకు ఔట్‌సోర్సింగ్ ద్వారా తీసుకున్న ఉద్యోగుల కన్నా జీతాలు తక్కువ ఇవ్వటం దారుణంగా ఉందని చెప్పారు. సమాన పనికి సమాన వేతనం అన్న సుప్రీంకోర్టు తీర్పు ఉల్లంఘనేనని, తక్షణమే అధికారులు గిరిజన కార్మికులను పర్మినెంట్ చేసి న్యాయంచేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పల్లాపల్లి ఆంజనేయులు, రామకృష్ణ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలు

మద్దిపాడు, అక్టోబరు 9: ఆటో, మోటార్‌సైకిల్ ఢీకొని ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఈ ఘటన త్రోవగుంట ఆటోనగర్ వద్ద బుధవారం జరిగింది. చీరాల నుంచి ఒంగోలు వెళ్తున్న ఆటో అదుపుతప్పి మోటార్‌సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో పర్చూరుకు చెందిన ఆర్.డేవిడ్సన్‌కు గాయాలు కాగా ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.


త్రోవగుంటలో పూజలు


ఒంగోలులోని కాశీవిశ్వేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే దామచర్ల ప్రత్యేక పూజలు


గాంధీరోడ్డులో సరస్వతీదేవిగా వాసవి అమ్మవారు


బాలాజీరావుపేటలో..


అచలానంద ఆశ్రమంలో అమ్మవారికి పుస్తకాల నివేదన

# సరస్వతీ నమస్తుభ్యం !

## మూలానక్షత్రంలో సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవార్లు

## పలు ఆలయాల్లో అమ్మవార్లను దర్శించుకున్న ఎమ్మెల్యే దామచర్ల

## నేడు దుర్గాష్టమి, కళారాల ఉత్సవం

ఒంగోలు(కల్చరల్), అక్టోబరు 9: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో ఏడవ రోజైన బుధవారం అమ్మవారు పలు దేవాలయాలలో సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి జన్మనక్షత్రమైన మూలా నక్షత్రం రోజున సరస్వతీ దేవిగా అలంకరణ చేయటం ఆనవాయితీ. అదేవిధంగా ఒంగోలు నగరం కేశవస్వామిపేట శ్రీవిజయ దుర్గాదేవి ఆలయం, మంగమూరు రోడ్డు గాయత్రీ మందిరం, శ్రీఅచలానందఆశ్రమం, బాలాజీరావుపేట శ్రీపార్వతీదేవిదేవస్థానం, గంటాపాలెం పోలేరమ్మ, మహాలక్ష్మి దేవస్థానాలు, కొత్తపట్నం బస్టాండులోని శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానం, కేశవస్వామిపేట శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం, అమలనాధుని వారి వీధి శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం మొదలైన పలు ఆలయాలలో అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**నేడు దుర్గాష్టమి :** ఇక శరన్నవరాత్రి ఉత్సవాలలో అత్యంత కీలకమైనవి దుర్గాష్టమి, మహర్నవమి, విజయదశమి. కాగా గురువారం దుర్గాష్టమి పండుగ. ఈ సందర్భంగా అమ్మవారు పలు దేవాలయాలలో దుర్గామాతగా దర్శనమివ్వనున్నారు. అదేవిధంగా దాదాపు 100 సంవత్సరాలుగా ఒంగోలు నగరంలో ప్రత్యేకంగా దసరా పండుగ సందర్భంగా కళారాల ఉత్సవం అత్యంత వైభవోపేతంగా జరుగుతుంది. దేశంలో కోల్‌కత్తా తర్వాత ఒంగోలులో ఈ కళారాల ఉత్సవం జరగటం విశేషం. ఈ ఉత్సవంలో పాల్గొనటానికి వేలాదిమంది ప్రజలు ఎంతో ఆసక్తి చూపుతారు. నగరంలో మొత్తం 6 కళారాల ఊరేగింపు జరుగనుండగా అందులో మూడు దుర్గాష్టమి రోజున, మరో మూడు కళారాలు మహర్నవమి రోజున ఊరేగింపు జరుగుతాయి. శ్రీలక్ష్మీ నరసింహస్వామి, కాళికా అమ్మవారు, పార్వతీదేవి కళారాల ఊరేగింపు బుధవారం రాత్రి జరుగుతుంది. ఆయా దేవస్థానాల దగ్గర నుంచి ప్రారంభమయ్యే కళారాల ఊరేగింపు శుక్రవారం ఉదయానికి స్థానిక మస్తాన్‌దర్గా సెంటర్‌కు చేరుకుంటుంది. ఇక ఈ కళారాల ఊరేగింపులో కళాకారులు వివిధ దేవతామూర్తుల అలంకరణలతో అలరించనుండగా, యువకుల నృత్యాలు, డప్పు వాద్యాలు, బాణాసంచాలతో కళారాల ఊరేగింపు కొనసాగుతుంది.

**ఎమెల్యే దామచర్ల పూజలు :** ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ బుధవారం రాత్రి పలు దేవాలయాలను సందర్శించి అమ్మర్లను దర్శించుకున్నారు. స్థానిక కేశవస్వామి చెన్నకేశవస్వామిదేవస్థానం, మహిషాసురమర్ధని దేవస్థానం, 37వ డివిజన్ సుజాతనగర్‌లోని కనకదుర్గ అమ్మవారి దేవస్థానం, త్రోవగుంట కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థాన అధికారులు, నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతాన్ని పలికి అమ్మవారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలను అందజేశారు.

### అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

దసరా ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక లాయర్‌పేట సాయిబాబా మందిరంలో శ్రీనళినీప్రియ కూచిపూడి నృత్య నికేతన్ విద్యార్థులు ప్రదర్శించిన సాయిబాబా దివ్య చరిత్ర నృత్య రూపకం భక్తులను విశేషంగా అలరించింది. నృత్య శిక్షకురాలు శివకుమారి ఆధ్వర్యంలో 33 మంది నృత్యాన్ని ప్రదర్శించారు. అటు కేశవస్వామిపేట శ్రీప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానంలో పొన్నూరి వెంకట శ్రీనివాసులు మూలా నక్షత్రం విశిష్టత అంశంపై సరస్వతీ దేవి మహిమలను అద్భుతంగా వర్ణించారు. ఈవో ఆర్.శివశంకర్, పొన్నూరి శ్రీనివాసులును శాలువతో సత్కరించారు.


శ్రీనళినీప్రియ కూచిపూడి నృత్య నికేతన్ కళాకారుల ప్రదర్శన


అంకమ్మపాలెంలో అమ్మవారి కళారం, పూజలు చేస్తున్న భక్తులు


గాయత్రీమందిరంలో అమ్మవారికి అలంకరణ


గంటాపాలెంలో పుస్తకాలు, పెన్నులతో..

### క్విస్‌లో..

ఒంగోలు(విద్య): ఒంగోలులోని క్విస్ విద్యాసంస్థల్లో రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించిన ముందస్తు దసరా వేడుకలు బుధవారంతో ముగిశాయి. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో అలరించారు. పలు ఆటల పోటీలు నిర్వహించారు. సుమారు 300మంది విద్యార్థులు వేడుకల్లో భాగస్వాములయ్యారు. కార్యక్రమంలో క్విస్ విద్యాసంస్థల చైర్మన్ నిడమానూరి సూర్యకళ్యాణచక్రవర్తి, ప్రిన్సిపాల్ వైవీ.హనుమంతరావు, ఫార్మశీ ప్రిన్సిపాల్ కిషోర్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

### వల్లూరమ్మ ఆలయంలో..

టంగుటూరు: మండలంలోని వల్లూరులో వేంచేసిఉన్న వల్లూరమ్మ దేవస్థానంలో శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఏడవ రోజైన బుధవారం వల్లూరమ్మకు సరస్వతీదేవి అలంకరణ చేశారు. భక్తులు పూజలు, కుంకుమార్చనలు చేశారు. ఈవో రమేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### నాగులుప్పలపాడు మండలంలో..

నాగులుప్పలపాడు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవార్లు సరస్వతిదేవి అవతారంలో దర్శనమిచ్చారు. అమ్మనబ్రోలు చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఉప్పుగుండూరు బ్యాంక్ బజారులో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం వద్ద అర్చకులు రంగయ్య పంతులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గుంటూరుకు చెందిన కళాకారుడు గోపి మ్యాజిక్ షో, మిమిక్రీ చేశారు.

### గుండ్లాపల్లిలో..

మద్దిపాడు: గుండ్లాపల్లి గ్రామంలోని శ్రీఅఖిలాండ అంకమ్మతల్లి అమ్మవారి దేవస్థానంలో బుధవారం అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. భజన, కోలాట ప్రదర్శన నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు జి.అంజనాచారి పర్యవేక్షించారు.


కొత్తపట్నం బస్టాండులో శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో..


సరస్వతీదేవి అలంకరణలో వల్లూరమ్మ


ఒంగోలులోని గొడుగుపాలెంలో..

## ముగిసిన పొగాకు కొనుగోళ్లు

టంగుటూరు, అక్టోబరు 9: టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో అన్ని రకాల పొగాకు కొనుగోళ్లు బుధవారంతో ముగిశాయి. ఈ ఏడాది మొత్తం 152 రోజుల పని దినాలతో లీఫ్ కొనుగోళ్లు సోమవారంతో ముగిశాయి. మంగళ, బుధవారాలలో చూర కొనుగోలు ముగియడంతో ఈ ఏటికి వేలం ప్రక్రియ ముగిసిందని వేలం కేంద్రం అధికారి ఏ శ్రీనివాసరావు చెప్పారు. వచ్చే ఏడాది మార్చిలో వేలం కేంద్రం ప్రారంభించే అవకాశముంది. అంతవరకు వేలం కేంద్రంలో కొనుగోళ్లకు సెలవు ప్రకటించారు.

## స్వీపర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలి

పొన్నలూరు(కొండపి), అక్టోబరు 9 : మండలంలోని మాలెపాడులోని కేజీబీవీ స్కూల్‌లో ఖాళీగా ఉన్న ఒక స్వీపర్ పోస్టుకు అర్హులైన మహిళలు ఈనెల 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో రవిచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి విద్యార్హత లేదని, 47 ఏళ్లలోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు దరఖాస్తులను తన కార్యాలయంలో అందజేయాలని ఆయన కోరారు.

## ముగిసిన శిక్షణ తరగతులు

కొండపి, అక్టోబరు 9 : కొండపిలోని మండల పరిషత్ సమావేశం హాలులో మండలంలోని ఉపసర్పంచ్‌లు, వార్డుమెంబర్లకు నిర్వహిస్తున్న రెండోరోజుల శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. రిసోర్స్ పర్సన్ అశోక్, గ్రామ పంచాయతీ కార్యదర్శి సాంబయ్యలు సభ్యులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

## యాజమాన్య పద్ధతులు అవలంబించాలి

మర్రిపూడి, అక్టోబరు 9 : సాగులో నూతన యాజమాన్యపద్ధతులు అవలంబించాలని ఏవో సీహెచ్.వెంకటేష్ చెప్పారు. బుధవారం రామాయపాలెం, చిమట గ్రామాల్లో జరిగిన పొలంబడి పిలుస్తుంది కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు మహేంద్రాచారి, పశుసంవర్ధక, మార్కెటింగ్‌శాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## గ్రామపరిపాలనపై అవగాహన అవసరం

మర్రిపూడి, అక్టోబరు 9 : గ్రామ పంచాయతీల పాలనపై ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో జగదీష్ కోరారు. రీఫ్రెష్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో బుధవారం ఆయన మాట్లాడారు పంచాయతీలకు వచ్చే నిధుల గురించి తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ ఏ సాంబశివరావు, జీ డేవిడ్, టీవీ నాయుడు, శ్రీనివాసులు, గాయత్రీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## పోలీస్ స్పోర్ట్స్ ఇండోర్ హాలు ప్రారంభం

ఒంగోలు(క్రైం), అక్టోబరు 9: ఒంగోలులోని జిల్లా పోలీసు శిక్షణ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఇండోర్‌హాలును ఎస్పీ దామోదర్ బుధవారం ప్రారంభిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఇక్కడి క్యాంపస్‌లో వివిధ జిల్లాల నుంచి వచ్చిన పోలీసు క్రీడాకారులు శిక్షణ తీసుకుంటున్నారని తెలిపారు. అందువల్ల వారికి అవసరమైన వసతులను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ ఏడాది జాతీయ స్థాయిలో ఏపీ పోలీస్‌శాఖ 9 పతకాలు సాధిచారని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీ శ్రీనివాసరావు, స్టేట్ స్పోర్ట్స్ ఆఫీసర్ రేణుకాఅభిరామ్‌రెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్రరావు, తాలుకా సీఐ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## ఎస్‌ఐను కలిసిన ఎంపీపీ

సంతనూతలపాడు, అక్టోబరు 9: సంతనూతలపాడు ఎస్‌ఐ వి.అజయ్‌బాబును బుధవారం సాయంత్రం ఎంపీపీ బుడంగుంట విజయ, భర్త నాగేశ్వరరావు దంపతులు మార్యదపూర్వకంగా కలిశారు. బొకే అందజేసి పలు సమస్యలపై చర్చించారు.





## రౌడీలపై పీడీ యాక్ట్ : ఎస్పీ

ఒంగోలు(క్రైం), అక్టోబరు 9: ప్రజల శాంతిభద్రతలకు భగం కలిగిస్తే రౌడీషీటర్లపై పీడీచట్టం అమలు చేస్తామని ఎస్పీ దామోదర్ బుధవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఒంగోలు నగరంలో రౌడీషీటర్లకు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. స్థానిక కేశవస్వామిపేటలో జానకీరామ్‌పై దాడి చేసిన సంఘటన, పాత మార్కెట్ వద్ద ఆటోడ్రైవర్ ఉంగరాల సాయికృష్ణలపై రౌడీషీటర్లు దాడిచేసిన ఘటనలను తీవ్రంగా పరిగణించి వారిపై కఠిన చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. అదేవిధంగా గ్రానైట్‌కి సంబంధించి వైరల్ అవుతున్న వీడియో ఆధారంగా కాంద్ర శ్రీకాంత్‌పై బైండోవర్ కేసు నమోదు చేశామన్నారు. రౌడీల పేరుతో ఎవరైనా తోక జాడిస్తే సహిచేది లేదని ఎస్పీ హెచ్చరించారు. అవసరమైన వారిపై పీడీ చట్టం కింద ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

## రోడ్డు విస్తరణ పనుల కోసం సమగ్ర నివేదిక

● కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 9: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన బుగ్గ-కైప- గిద్దలూరు సెక్షన్ ఎన్‌హెచ్ 544డి రోడ్డు పనులకు సంబంధించి ప్రాజెక్టు నివేదికను సమగ్రంగా రూపొందించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బుధవారం ఎన్‌హెచ్ఏఐ, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, వ్యవసాయ, పొల్యూషన్ కంట్రోలు తదితర శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా అధికారులు ఈ ప్రాజెక్టుకు సంబంధించి జిల్లా పరిధిలో 24.028 కి.మీ ఉందని తెలిపారు. దీనిపై కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ ఈ రోడ్డు విస్తరణ పనుల ప్రాజెక్టుకు సంబంధిత అధికారులు నివేదికను సమర్పించాలని సూచించారు. సమావేశంలో మార్కాపురం సబ్‌కలెక్టర్ సహదీత్‌వెంకటత్రివినాగ్, డీఆర్వో ఆర్.శ్రీలత, హైవే పీడీ పద్మ, ఎస్ఈ దేవానంద్, డీఏవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఊళ్లో సబ్‌స్టేషన్.. అయినా లోవోల్టేజీ !

**ఉప్పుగుండూరు వాసులను ఇబ్బందిపెడుతున్న సమస్య ● ఏళ్లుగా పరిష్కారం కాని వైనం ● పట్టించుకోని అధికారులు**

నాగులుప్పలపాడు, అక్టోబరు 9: నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరులో లోవోల్టేజీ ఏళ్లుగా సమస్య వేధిస్తోంది. దీనివల్ల పలు గృహోపకరణాలు కాలిపోతుండటంతో వినియోగదారులు ఇబ్బందిపడుతున్నారు. గ్రామంలో సబ్‌స్టేషన్ ఉన్నా లోవోల్టేజీ సమస్య వేధిస్తుండటం గమనార్హం. మండలంలోనే మేజర్ పంచాయతీ ఉప్పుగుండూరు. అక్కడ సుమారు 15 వేల జనాభా నివశిస్తుంటారు. విద్యుత్‌శాఖ లెక్కల మేరకు 3వేల నివాసగృహాలు, 800పై చిలుకు వ్యాపార సంబంధ భవనాలు, గోడౌన్లకు విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. గ్రామంలో 6.30 కిలోవాట్ల సామర్థ్యంతో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి గ్రామంలోకి విద్యుత్ సరఫరా చేసేందుకు 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 3, అలాగే 100 కేవీ 22, 63 కేవీ 2, ఇక 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 8 ఉన్నాయి. ఇవన్నీ కూడా గ్రామం వెలుపల ఏర్పాటు చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా చీకటి పడితే చాలు లోవోల్టేజీ సమస్య తలెత్తుతోంది. సాధారణంగా గృహాలకు 230-250 వరకు వాట్స్ కరెంటు అందాలి. అయితే 180 వాట్లకు మించి ఉండటం లేదు. దీంతో లైట్లు సైతం పూర్తి స్థాయిలో వెలగడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసిన సమీపం లోని కొద్దిపాటి నివాస గృహాలకే కరెంటు సక్రమంగా అందుతోంది. మిగతా ఇళ్లకు లోవోల్టేజీ సమస్య వేధిస్తోంది. ఎక్కడైనా లోవోల్టేజీ సమస్య ఏర్పడితే కనీసం సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి సమస్యను అధిగమించాల్సి ఉండగా అలాంటి చర్యలు సంబంధిత అధికారులు చేపట్టం లేదు. ఏళ్ల నుంచి ఈ సమస్యపై గ్రామస్థులు అనేకమార్లు విద్యుత్‌శాఖ అధికారులకు మొరపెట్టుకున్నా నిబంధనల పేరుతో కాలం వెళ్లదీస్తున్నారే తప్ప పరిష్కార మార్గాలు అన్వేషించిన దాఖలాలు లేవు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.


గ్రామంలో ఉన్న సబ్‌స్టేషన్

### 11 కేవీ లైన్ వస్తేనే పరిష్కారం

### - ఇన్‌చార్జ్ ఏఈ రమేష్

ఉప్పుగుండూరులో లోవోల్టేజీ సమస్య పరిష్కారం కోసం ఊరి చివర ఉన్న 11 కేవీ విద్యుత్ లైను గ్రామ మధ్యలోకి తీసుకురావాలి. కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి ప్రాంతాల వరకు ఈ లైను వెళ్లాల్సి ఉంటుంది. అయితే 11కేవీ లైన్ వెళ్లే ప్రాంతాల ప్రజల నుంచి ఎలాంటి ఆటంకాలు లేకుంటే ఊరి మధ్యలో కొత్త ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేస్తాం. దాంతో సమస్య పరిష్కారమవుతుంది. గత ఏడాది యూనియన్ బ్యాంక్ వద్దకు 11 కేవీ లైన్ తీసుకొచ్చి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు పనులు చేపట్టగా అప్పటి నాయకులు కొందరు అడ్డుకోవడంతో ఆగిపోయాయి. అది పూర్తయితే సగం ఊరికి లోవోల్టేజీ సమస్య తీరుతుంది. ఇందుకోసం ప్రజలు సహకరించాలి.


పొలాలను పరిశీలిస్తున్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న

## రైతులు ఈ-క్రాప్ చేయించుకోవాలి

● ఆర్డీవో లక్ష్మీప్రసన్న

మద్దిపాడు, అక్టోబరు 9: రైతులు తాము సాగుచేసే పంట పొలాలను ఈ-క్రాప్ చేయించుకోవాలని ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న తెలిపారు. పెద్దకొత్తపల్లి గ్రామంలో 297/4లో నల్లూరి వెంకట్రావు, 113/1లో నల్లూరి శ్రీనివాసరావు సాగు చేసిన భూములను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట పొలాలను ఈ-క్రాప్ చేయిండంతోపాటు కేవైసీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మద్దిపాడు తహసీల్దార్ సృజనకుమార్, ఆర్ఐ రమణయ్య, వీఆర్వో ఆరిఫా, వ్యవసాయ విస్తరణ అధికారి పాటిబండ్ల వెంకట శేషారావు, రైతులు పాల్గొన్నారు.

## వర్షపు జల్లులతో చల్లబడిన వాతావరణం

నాగులుప్పలపాడు అక్టోబరు 9: వాతావరణ మార్పుల వల్ల గత కొద్ది రోజుల నుంచి మండలంలో ఎండలు మండిపోతే ఉక్కపోతలతో జనం అల్లాడిపోతున్నారు. అక్టోబరు నెల వచ్చినా ఎండ తీవ్రత ఏమాత్రం తగ్గలేదు. వేసవిని తలపించేలా వేడిమి ఉండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు.ఈ తరుణంలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గత రెండు రోజుల నుంచి పలు గ్రామాల్లో చెదురుమదురు జల్లులు పడుతున్నాయి. దీంతో వాతావరణం చల్లబడింది.

## దేవరపాలెంలో 'పొలంపిలుస్తోంది'

చీమకుర్తి, అక్టోబరు 9 : మండలంలోని దేవరపాలెం, నిప్పట్లపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఏవో భాస్కర్ సిబ్బందితో కలిసి వరి, పత్తి పంటలను పరిశీలించారు. పలు సూచనలు చేశారు.


వరి పంటను పరిశీలిస్తున్న ఏవో భాస్కర్



ట్రయిల్‌రన్‌లో భాగంగా పొదిలికి వచ్చిన రైలు

# పొదిలిలో రైలుకూత

పొదిలి, అక్టోబరు 9 : ఎన్నోఏళ్ళ నిరీక్షణ ఫలించింది. పొదిలి ప్రాంతవాసుల కల సాకారమైంది. నడికుడి రైల్వేలైన్‌లో మొదటి సారిగా పట్టణంలో రైలుకూత వినపడింది. పట్టణ ప్రజలంతా సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. బుధవారం సాయంత్రం నడికుడి కాళహస్తి రైలు మార్గంలో పొదిలి వరకు రైల్వే అధికారులు ట్రయిల్‌రన్ నిర్వహించారు. దీంతో రైలును చూసేందుకు వందలాదిమంది ప్రజలు రైలుకట్ట వెంబడి బారులు తీరారు. రైలు కనిపించడంతో యువత కేరింతలు కొడుతూ సెల్ఫీఫోటోలు తీసుకునేందుకు ఆసక్తి కనపరిచారు. ఎన్నోఏళ్లుగా ఎదురుచూసిన ఎదురు చూపులు ఫలించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# దరఖాస్తుదారులు అపోహలకు గురికావద్దు

● మార్కాపురం ఏఈఎస్ బాలయ్య

మార్కాపురం, అక్టోబరు 9: రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నూతన మద్యం పాలసీ నోటిఫికేషన్‌కు సంబంధించి దుకాణాలకు దరఖాస్తు చేసుకోవడానికి మరో రెండు రోజులపాటు గడువు పొడిగించినట్లు మార్కాపురం ఏఈఎస్ డి.బాలయ్య తెలిపారు. మార్కాపురం, ఎర్రగొండపాలెం, గిద్దలూరు, కంభం, కనిగిరి సర్కిళ్ల పరిధిలో మూడు విధాలుగా ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా పెట్టుకోవచ్చని అన్నారు. ఒక్కో దరఖాస్తుకు రూ.2 లక్షల చొప్పున నాన్ రిఫండబుల్ రుసుము చెల్లించాలన్నారు. ఈ నెల 11వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 12, 13 తేదీల్లో దరఖాస్తులను పరిశీలించి 14వ తేదీన లాటరీ తీసి లైసెన్స్‌లు జారీ చేస్తామన్నారు. ఈ నెల 16వ తేదీ నుంచి లైసెన్స్‌దారులు నూతన మద్యం దుకాణాలను ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుదారులు ఎలాంటి అపోహలకు గురికావాల్సిన అవసరంలేదన్నారు. ప్రభుత్వం పొడిగించిన గడువును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి దరఖాస్తును పరిశీలించి లాటరీకి అనుమతిస్తామన్నారు. ఎటువంటి అనుచిత ప్రచారాలకు లోనుకావాల్సిన అవసరం లేదన్నారు.

## రేపటి వరకు దరఖాస్తులకు గడువు

కంభం, అక్టోబరు 9 : కంభం ఎక్సైజ్ కార్యాలయ పరిధిలో నూతన మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేయదలచుకున్న వారికి 11వ తేదీ వరకు అవకాశం ఉందని ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం వరకు గడువు ఉండగా దానిని పొడిగించినట్లు తెలిపారు. 12న దరఖాస్తులను పరిశీలించి 14వ తేదీ లక్కీడ్రా ద్వారా మద్యంషాపుల కేటాయింపు ఉంటుందని, 16 నుంచి నూతన మద్యం పాలసీ ప్రారంభమవుతుందన్నారు. బుధవారం సాయంత్రానికి 139 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.



రామచంద్రాపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ బాలాజీ నాయక్

# పచ్చిరొట్ట పైర్లతో భూసారం పెంపు

● ఏడీఏ బాలాజీ నాయక్

మార్కాపురం రూరల్, అక్టోబరు 9. రైతులు పచ్చి రొట్ట పైర్లను సాగు చేసి భూసారాన్ని పెంచుకోవాలని ఏడీఏ బాలాజీ నాయక్ కోరారు. మండలంలోని రామచంద్రాపురం, కొండేపల్లి గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం మండల వ్యవసాయాధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆ గ్రామాలలో రైతులు సాగుచేస్తున్న పంటలను పరిశీలించి పలు సలహాలు, సూచనలు తెలియజేశారు. అనంతరం నిర్వహించిన గ్రామ సభలో మాట్లాడుతూ రసాయన ఎరువుల వినియోగం ద్వారా భూమిలోని సారం తగ్గి పోతోందని అన్నారు. మట్టిలోని సారాన్ని పెంచి మట్టికి పునరుజ్జీవం పోసేందుకు సేంద్రియ ఎరువులు ఎంతగానో తోడ్పడతాయని తెలిపారు. ఈ సేంద్రియ ఎరువులలో పచ్చిరొట్ట ఎరువులైన జీలుగలు, జనుములు, పిల్లి పెసరలు కూడా ఒక భాగం అని తెలిపారు. ఏవో శ్రీనివాసులు మాట్లాడుతూ చిరు ధాన్యాలను రైతులు అధికంగా సాగుచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు గౌరీ శంకర్, ఆర్ఎస్‌కె సిబ్బంది పాల్గొన్నారు.




దోర్నాలలో పొగాకు పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

# యాజమాన్య పద్ధతులు పాటించాలి

పొదిలి, అక్టోబరు 9 : వ్యవసాయంలో రైతులు నూతన యాజమాన్యపద్ధతులు అవలంబించాలని వ్యవసాయాధికారి షేక్ జైన్‌లుబ్దీన్ అన్నారు. బుధవారం మండలంలోని ఓబులక్కపల్లి, పొదిలి గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అన్నదాతలు వ్యవసాయంలో ఖర్చులు తగ్గించుకొని అధిక దిగుబడులు సాధించాలంటే రసాయన ఎరువుల వినియోగాన్ని వీలైనంత వరకు తగ్గించుకోవాలని సూచించారు. పైర్లను ఆశించిన చీడపీడలను గుర్తించి క్షేత్రస్థాయిలో ఉన్న వ్యవసాయ సిబ్బంది సలహాలు తీసుకోవాలన్నారు. అనంతరం మిరపపైరును పరిశీలించారు. నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.

## తర్లుపాడులో..

తర్లుపాడు : కంది, మిరప పంటలపై ఆశించే తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి పి.వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని మంగళకుంట, తర్లుపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

## పుల్లలచెరువులో..

పుల్లలచెరువు : పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని చౌటపల్లిలో సాగులో ఉన్నకందిని మండల వ్యసాయయశాఖ అధికారి పి.నిర్మలాదేవి పరిశీలించారు. గూడు పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. వీఏఏ మస్తాన్,మంత్రు నాయక్‌రైతులు పాలొన్నారు.

## దోర్నాలలో

పెద్ద దోర్నాల : మండలంలోని వై.చెర్లోపల్లి,చిలకచెర్ల గూడెంలో రైతులకు శిక్షణా తరగతులు బుధవారం ఏవో జవహర్ లాల్ నాయక్ నిర్వహించారు. అనంతరం కంది, మిరప, పొగాకు పంటలను పరిశీలించారు.సస్య రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

# రియల్టర్ల దందా



**వివాదాస్పద స్థలాలు, భూముల సెటిల్‌మెంట్‌లు**

**ఎదురుతిరిగితే దాడులు**

**భయాందోళనలో పొదిలి పట్టణ ప్రజలు**

పొదిలి, అక్టోబరు 9 : పొదిలి పట్టణంలో నిన్నమొన్నటి వరకు ఆక్రమణలు, కబ్జాలకే పరిమితమైన రియల్టర్లు ఇప్పుడు దాడుల సంస్కృతికి శ్రీకారం చుట్టారు. ఒకరిపై ఒకరు దాడులకు పూనుకుంటున్నారు. అంతటితో ఆగకుండా సెటిల్‌మెంట్‌ల మాటున దందాలకు పాల్పడుతున్నారు. దీంతో ఏక్షణం ఏమి జరుగుతుందో అనే భయాదోళనలు పట్టణ ప్రజల్లో నెలకొన్నాయి. ఇటీవల పట్టణంలోని విశ్వనాథపురం బ్యాంక్ కాలనీలో నివాసం ఉంటున్న మాదిరెడ్డిపాలెం మాజీ సర్పంచ్ ఓంకార్‌పై జరిగిన దాడే ఒక నిదర్శనం. బైకుపై వెళుతుండగా అతనిపై విచక్షణారహితంగా దాడి జరగడం పట్టణ ప్రజలను ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. ప్యాక్షన్ ప్రాంతాల్లో జరిగినట్లుగా రియల్‌ఎస్టేట్ ముసుగులో గతంలో ఎన్నడూ లేని విధంగా దాడి జరగడంతో పట్టణంలో అసలేం జరుగుతుందోనన్న సందేహాలు మొదలయ్యాయి. గతంలో కలిసిమెలిసి రియల్ వ్యాపారాలు చేసుకున్నారు. ఈక్రమంలో భూములకు రెక్కలు రావడంతో వారే విడిపోయి వ్యాపారాలు మొదలు పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో వారిమధ్య వ్యాపారంలో పోటీ ఏర్పడింది. ఆపోటీలో తలెత్తిన వ్యవహారాలే దాడుల ప్రేరేపణకు దారితీస్తున్నాయి. అలాంటి సెటిల్‌మెంట్‌ల వ్యవహారంతో వచ్చిన బేదాభిప్రాయాలే దాడికి కారణం అయి ఉండవచ్చనే వాదనలు వినిపిస్తున్నారు. ఈదాడి వెనుక మరికొన్ని సందేహాలు ఉన్నాయనే వార్తలు వస్తున్నాయి.

గతంలో కొనకనమిట్ల మండలంలో జరిగిన భూవివాదంలో నరసింహారెడ్డి అనే వ్యక్తిని హత్యచేసి వెలుగొండ కాలువలో పడవేసిన ఘటన కూడా ఇందుకు కారణం అయి ఉండవచ్చని కొందరు అనుమానిస్తున్నారు. మనగ్రోమోర్ వీధిలో ఇటీవల ఒక సెటిల్‌మెంట్ వ్యవహారం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. దీనికితోడు వివాదాస్పద భూములు, ఆస్తుల కొనుగోలు విషయంలో రియల్టర్ల మధ్య పెద్దఎత్తున వివాదాలు కొనసాగుతున్నట్లు సమాచారం. విలువైన ఆస్తులను కొరుచౌకగా ఒకరు ముందు కొనుగోలు చేస్తారు. మరికొందరు వ్యక్తులు ఆస్తులు అమ్మే వ్యక్తి వద్దకు వెళ్లి నేను ధర ఎక్కువ ఇస్తాను.., నాకు ఇవ్వాలంటూ బేరం పెడతారు. అమ్మే వ్యక్తి భయంతో ఎవరికి ఇవ్వాలో తెలియని స్థితిలో నేను అమ్మనని చెబుతాడు. అక్కడ వివాదం మొదలై కొట్లాట, హత్యల వరకు దారితీస్తోంది. ఎక్కడైనా వివాదాస్పదంగా ఉన్న అన్నదమ్ముల ఆస్తుల వ్యవహారంలో వ్యాపారులు చెరోవైపున చేరి వారి మధ్య అగ్గిరాజేస్తున్నారు. ఇలాంటి సంఘటనలు చినికిచినికి గాలివానగా మారి శాంతి భద్రతల సమస్య తలెత్తే ప్రమాదం కూడా ఉంది. పట్టణంలో మధ్యతరగతి వ్యక్తులు స్థలాలు, భూములు కొనుగోలు చేయాలంటేనే భయపడుతున్నారు. దీంతో ఇక్కడ రియల్ దందా ఏస్థాయిలో జరుగుతుందో ఇట్టే అర్థమౌతోంది. ఏది ఏమైనా పొదిలి పట్టణంలో ఎప్పుడూ లేని విధంగా రియల్ దందాలు, సెటిల్‌మెంట్‌లు మొదలయ్యాయని, ఆ సంస్కృతి ఎక్కడికి దారి తీస్తుందోనని పలువురు చర్చించుకుంటున్నారు.



ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి స్వీటు తినిపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

# ఘనంగా ఎమ్మెల్యే ముత్తుముల పుట్టిన రోజు వేడుకలు

● పలు ప్రాంతాలలో కేక్ కటింగ్‌లు

● రోగులకు పండ్లు పంపిణీ, అన్నదానం

గిద్దలూరు టౌన్, అక్టోబరు 9 : ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను గిద్దలూరు ప్రాంతంలో ఆపార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. పలు ప్రాంతాలలో కేక్ కటింగ్‌లు, అన్నదాన కార్యక్రమాలు, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. గిద్దలూరు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ఆయన సోదరుడు క్రిష్ణకిశోర్‌రెడ్డి కేక్ కట్ చేశారు. స్థానిక అన్న క్యాంటీన్ ఆవరణలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను సోదరుడు క్రిష్ణకిశోర్‌రెడ్డి కట్ చేసి సిబ్బందికి, శ్రేణులకు పంచిపెట్టారు. ఆయా కార్యక్రమాలలో పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు షానేషావలి, మార్తాల సుబ్బారెడ్డి, మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, జడ్‌పీటీసీ బుడత మధుసూదన్, కౌన్సిలర్లు చంద్రశేఖర్ యాదవ్, లొక్కు రమేష్, టీడీపీ నాయకులు బిల్లా రమేష్, దుత్తా బాలీశ్వరయ్య, చిన్నశ్రీనివాస రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా టీడీపీ నాయకులు పాలుగుళ్ళ చిన్నశ్రీనివాసరెడ్డి అన్న క్యాంటీన్‌లో ఒక రోజు ఖర్చును క్యాంటీన్‌కు అందచేసి ఉచితంగా భోజనం ఏర్పాటు చేశారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పిడతల రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించగా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సోదరుడు క్రిష్ణకిశోర్‌రెడ్డి హాజరై కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆదర్శ విద్యాసంస్థల అధినేత బుడత తిమ్మయ్య, జడ్‌పీటీసీ బుడత మధుసూదన్, మాజీ సర్పంచ్ దప్పిలి బాస్కర్‌రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షులు ఎ.ఉదయ్‌శంకర్, బీజేపీ నాయకులు బాదుల్లా, నరసింహులు, వెంకటరామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు. ఉండవల్లిలోని తనను కలిసిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపి స్వీట్ తినిపించారు.



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సోదరుడు కృష్ణ కిశోర్‌రెడ్డి

## కొమరోలులో

కొమరోలు : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను బుధవారం నిర్వహించారు. కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు, గోడి ఓబుల్ రెడ్డి, ముత్తుముల సంజీవరెడ్డి, తుమ్మలపెంట వెంకటరమణ, షేక్ నబీ పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

కంభం : కంభం, అర్థవీడు మండలాల్లో బుధవారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారీ కేక్‌ను కట్ చేశారు. కంభం ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ కంభం మండల నాయకులు తోట శ్రీను, కేతం శ్రీను, గోన చెన్నకేశవులు, షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.



కంభంలో సరస్వతీదేవి అలంకారం



మార్కాపురంలో కాళరాత్రిగా జగదాంబ



దోర్నాలలో సరస్వతీ దేవి అలంకారంలో అమ్మవారు

# సరస్వతీ దేవి అలంకారంలో అమ్మవార్లు

గిద్దలూరు, అక్టోబరు 9 : దసరా నవరాత్రుల్లో భాగంగా బుధవారం అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కన్యకలు కలశాలు ఎత్తుకుని ప్రధాన వీధుల గుండా అమ్మవారిశాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముత్తైదువులు సామూహికంగా తీసుకుని వచ్చిన గంగాజలంతో అమ్మవారికి అభిషేకం చేశారు. సాయంత్రం ఆలయంలో 400 మొక్కలతో తోట ఉత్సవం వైభవంగా నిర్వహించారు. అంకాలమ్మ, కాళికాంబ, కనకదుర్గ, సాయి బాబా దేవాలయాలలో నవరాత్రుల సందర్భంగా సామూహిక పూజలు నిర్వహించారు. కొన్ని దేవాలయాలలో అన్నదాన కార్యక్రమాలను భక్తులకు ఏర్పాటు చేశారు.



జమ్మనపల్లి వద్ద ముద్ద సానమ్మ ఆలయంలో దసరా నవరాత్రుల ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఉభయదాతలు

## వైభవంగా కల్యాణ మహోత్సవం

పట్టణంలోని షరాఫ్ బజారులో గల శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం వైభవంగా స్వామి వారికి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి అలంకారంలో స్వామి వారు భక్తులకు దర్శనమివ్వగా దేవాలయ ఆవరణలో కనుల పండుగగా స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు.

## శ్రీకాళరాత్రిదేవిగా బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారు

త్రిపురాంతకం : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వర క్షేత్రంలో నిర్వహిస్తున్న దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా శ్రీబాలాత్రిపురసుందరీ దేవి అమ్మవారు బుధవారం గజవాహనంపై శ్రీకాళరాత్రిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మూలా నక్షత్రం కావడంతో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారికి, చిన్నమస్తాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా వేదపండితులు ఫణీంద్రకుమార్‌శర్మ, అర్చకులు ప్రసాద్‌శర్మ, విశ్వనారాయణ శాస్త్రి అమ్మవారికి అభిషేకాలు, ప్రాతఃకాలపూజ, బాలబోగం, ఉభయదాతలచే కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం జైబాలా, జైజైబాలా అంటూ ఆలయ ఉత్సవం నిర్వహించారు. అమ్మవారికి పరాకులు, పవలింపుసేవ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు. అమ్మవారు గురువారం శ్రీమహాదుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

## శ్రీ సరస్వతీ దేవి అలంకారంలో అమ్మవారు

పెద్ద దోర్నాల : స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయం, మండలంలోని తిమ్మాపురం శ్రీ చౌడేశ్వరీ దేవాలయం, మోట్ల మల్లికార్జున స్వామి దేవాలయంలో బుధవారం అమ్మవారు శ్రీ సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అధిక సంఖ్యల్లో హాజరై అమ్మవార్లను దర్శించుకున్నారు.

## అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు

మార్కాపురం వన్‌టౌన్ : దసరా శరన్నవరాత్రులు మార్కాపురం పట్టణంలో వైభవంగా భక్తజన రంజకంగా నిర్వహిస్తున్నారు. స్థానిక లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో మూలానక్షత్రాన్ని పురస్కరించుకుని రాజ్యలక్ష్మీ అమ్మవారు విద్యాలక్ష్మీ అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. శివాలయంలో జగదాంబ కాళరాత్రిగా అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. వాసవీ కాన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

## ముద్దసానమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు

మార్కాపురం రూరల్: మండలంలోని జమ్మనపల్లి గ్రామం వద్ద వెలసిన ముద్ద సానమ్మ అమ్మవారికి దసరా నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం అమ్మవారికి ప్రత్యేక అంకరణ చేసి హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఉభదాతలతో చండీహోమం, నివేదన హారతులు జరిపించారు. రాత్రి ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కంభం : దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా బుధవారం 7వ రోజు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా రేలారే రేలావంటి జానపద పాటలు భక్తులను అలరించాయి.

# మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల నిరసన



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

మార్కాపురం వన్ టౌన్, అక్టోబరు 9: స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురు మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు బుధవారం ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ తాము గత 30 ఏళ్ల నుంచి ఇంజనీరింగ్ విభాగంలో కార్మికులుగా పనిచేస్తున్నామని, ఎటువంటి కారణాలు లేకుండా 20 మంది కార్మికులను పనులకు రావొద్దని చెప్పారని తెలిపారు. తమను పనులలోకి తీసుకోవాలని కోరారు. ఈమేరకు మున్సిపల్ కమిషనర్ బీఎస్ నారాయణను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మికులు ఎ.సుబ్బరాయుడు, ఎ.వెంకటరమణ, హరి, కనకయ్య, ఇమామ్ సాహెబ్, సలాంఖాన్, కరిముల్లా, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



సయ్యద్ రహీమూన్

## తెలంగాణ డీఎస్సీలో తర్లుపాడు అభ్యర్థినికి రెండో ర్యాంకు

తర్లుపాడు, అక్టోబరు 9: తెలంగాణ డీఎస్సీలో తర్లుపాడుకు చెందిన సయ్యద్ రహీమూన్ సత్తా చాటి ఆ రాష్ట్రంలో 2వ ర్యాంకు సాధించింది. మంగళవారం విడుదల చేసిన ఫలితాల్లో నాన్ లోకల్ కేటగిరిలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయిని(ఉర్దూ) కింద ఆమె ఎంపికయ్యారు. నిరుపేద కుటుంబానికి చెందిన రహీమూన్ తండ్రి సయ్యద్ అల్లాబాషా టైలర్ కాగా ఆమె తల్లి అమినాబి గృహిణి. ఈ సందర్భంగా తర్లుపాడు జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు ఎం.సుధాకర్ బాబు, పలువురు ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభ్యర్థిని రహీమూన్‌ను అభినందించారు.

# 15లోపు దరఖాస్తులు అందజేయాలి

మార్కాపురం, అక్టోబరు 9: స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో వంట మనిషి, సహాయకురాలు ఉద్యోగాలకు ఈ నెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని మార్కాపురం విద్యాశాఖాధికారి బి.రామదాస్‌నాయక్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సమగ్ర శిక్ష అభియాన్ నాన్ టీచింగ్ స్టాఫ్ టైప్-3 ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానించిందన్నారు. దరఖాస్తుదారులు ఆధార్ కార్డు, అడ్రెస్ ప్రూఫ్, విద్యార్హతల సర్టిఫికెట్ నకలు కాపీలను మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు.

# గుండెపోటుతో అర్ధవీడు తహసీల్దార్ మృతి



కె.దాసు (ఫైల్)

కంభం, అక్టోబరు 9 : అర్ధవీడు మండల తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న కె.దాసు (55) బుధవారం గుండెపోటుతో మృతిచెందారు. కంభంలో నివాసం ఉంటూ అర్ధవీడు విధులకు వెళ్ళి వచ్చేవారు. బుధవారం ఉదయం ఇంట్లో ఉండగా అస్వస్థతకు గురికావడంతో వెంటనే ఆయనను మార్కాపురం వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలిస్తుండగా మార్గమధ్యంలో గుండెపోటు రావడంతో మృతిచెందారు.

# నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గిద్దలూరు టౌన్, అక్టోబరు 9 : విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 7.30 గంటల నుంచి 11 గంటల వరకు గిద్దలూరులోని 132/33 కెవి సబ్‌స్టేషన్ పరిధిలోని గిద్దలూరు, కొమరోలు, రాచర్ల మండలంలోని సబ్ స్టేషన్లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ అధికారి బి.వై.శేషగిరి ఒక ప్రకటనలో తెలిపారు.

# కొండపేటలో రెండిళ్లలో చోరీ

గిద్దలూరు టౌన్, అక్టోబరు 9 : నగర పంచాయతీ పరిధిలోని కొండపేట గ్రామంలో రెండు ఇళ్లలో చోరీ జరిగింది. సుమారు రూ. 80వేల వరకు చోరీ జరిగినట్లు ఇంటి యజమానులు తెలిపారు. గ్రామానికి చెందిన పాముల చిన్ననరసింహ, పాముల నరసింహ డ్రైవర్లుగా పని చేస్తున్నారు. ఇంటిలో ఎవరూ లేని సమయంలో చోరీకి పాల్పడ్డారు. దాదాపు రూ. 50వేల నగదు, జత బంగారు కమ్మలు, ఒక ఉంగరం చోరీకి గురైనట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

# సామూహిక అక్షరాభ్యాసం

గిద్దలూరు, అక్టోబరు 9 : పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో బుధవారం మూలానక్షత్రాన్ని పురస్కరించుకుని సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలతో సరస్వతీదేవికి ప్రత్యేక పూజ నిర్వహించిన అనంతరం అక్షరాభ్యాస కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. సీపీ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు చీతిరాల ప్రసాద్ పలకలు, బలపాలు, పుస్తకాలు, పూజా సామాగ్రిని సమకూర్చారు. దేవస్థాన కమిటీ అధ్యక్షులు వాడకట్టు రంగసత్యనారాయణ, కార్యదర్శి తుమ్మలపెంట సత్యనారాయణ, కమిటీ ప్రతినిధులు అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్నారు.

# చర్మకారుల సమస్యలను పరిష్కరించాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న చర్మకారులు

పెద్ద దోర్నాల, అక్టోబరు 9: చర్మకారుల సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు చర్మకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుల్లా రాజారావు బుధవారం వినతి పత్రం అందజేసినట్లు ఆ సంఘం మండల అధ్యక్షులు కాకర్ల ధనరాజు తెలిపారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో చర్మకార నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని, రుణాలు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు.

## వంట మనిషి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ఎర్రగొండపాలెం(పుల్లలచెరువు),అక్టోబరు 9: ఎర్రగొండపాలెంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో రెండు సహాయ వంట మనిషి(2) పోస్టులను అవుట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు వైపాలెం ఎంఈవో పి. ఆంజనేయులు బుధవారం తెలిపారు. 18 నుంచి 45 సంవత్సరాల లోపు వయస్సు కలిగి స్థానికంగా నివాసం ఉన్న వారు ఈ నెల 15 వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు స్థానిక ఎంఈవో కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు ఎంఈవో కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

## చౌకీదారు పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్ద దోర్నాల : మండలంలోని మోట్ల మల్లికార్జునపురంలోని మోడల్ స్కూల్ లోని వసతిగృహంలో చౌకీదారు పోస్టుకు అర్హత కల్గిన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో మస్తాన్ నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాల కోసం ఎంఈవో కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.


మందుల కోసం జ్వర పీడితులు


జ్వరంతో చికిత్స పొందుతున్న మహిళ

# మంచంపట్టిన నాంచారపురం

● గొంతు, కీళ్ల నొప్పులు ● ఎంతకీ తగ్గక నరసరావుపేట, గుంటూరుకు పయనం

కురిచేడు, అక్టోబరు 9 : జ్వరపీడితులతో నాంచారపురం విలవిల్లాడుతోంది. వారం రోజుల నుంచి గ్రామంలో జ్వరాలు పెరుగుతున్నాయి. ఆర్‌ఎంపీల వద్ద పరీక్షలు చేయించి మందు వాడినా ఫలితం లేక ఎక్కువ శాతం మంది బాధితులు నరసరావుపేట, గుంటూరుకు పరుగు పెడుతున్నారు. జ్వరంతో పాటుగా కడుపులో మంట, కీళ్ల నొప్పులు వారిని బాధ పెడుతున్నాయి. పేదవారు మాత్రం కురిచేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వస్తున్నారు. ఒక్క బుధవారం రోజునే కురిచేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చాలా మంది జ్వర పీడితులు వచ్చారు. వారిని పరీక్షించిన వైద్యులు వైరల్ ఫీవర్‌గా గుర్తించారు. ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తోందని అన్నారు. రెండు రోజుల్లో నాంచారపురంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రవీణ్ తెలిపారు. గ్రామంలో మురికి నిల్వ ఉండటం వల్ల దోమలు పెరిగిపోయాయి.

**నాలుగు రోజులుగా జ్వరం**



కడుపులో మంట, కీళ్ల నొప్పులు ఎక్కువగా ఉన్నాయి. ఎన్ని మందులు వాడినా ఫలితం లేదు. నాలుగు రోజులుగా రాత్రి సమయాల్లో నొప్పులు ఎక్కువగా ఉంటున్నాయి. ఏమి తినలేని పరిస్థితి ఉంది. గ్రామంలో ఎక్కువ మందిది ఇదే పరిస్థితి. మా ఇంట్లో అందరూ జ్వరపీడితులే.

– గాదె శ్రీను, నాంచారపురం

# చిల్లకర్రకు గిరాకీ

● టన్ను రూ.5వేలు

ఖాళీ భూముల్లోనూ, రోడ్ల పక్కన పెరిగే చిల్లచెట్లు కాసులు కనిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఆయకట్టు భూముల్లో చెరువు గట్లపై, ప్రభుత్వ భూముల్లో దట్టంగా పెరిగిన చిల్లచెట్లను కొందరు కూలీలతో నరకించి సొమ్ము చేసుకొంటున్నారు. టన్ను రూ.5 వేలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ట్రాక్టర్ల ద్వారా పామూరులోని కాటా వద్ద తూకం వేసుకొని ఇటుక బట్టీలకు, పొగాకు బ్యారన్లకు అమ్ముతున్నారు. తక్కువ ధరతోపాటు ఎక్కువ మొత్తంలో లభిస్తుండటంతో రైతులు చిల్ల కర్ర కొనుగోలుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. - పామూరు




దర్శిలో ఫ్లడ్‌లైట్లు ప్రారంభిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

## దర్శిని సుందరంగా తీర్చిదిద్దుతాం

● డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, అక్టోబరు 9 : దర్శి నగర పంచాయతీని సుందరంగా అభివృద్ధి చేస్తానని దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. పట్టణంలోని తూర్పుగంగవరం రోడ్డులో, పొదిలి రోడ్డులోని కాటేరువాగు వద్ద నూతనంగా నిర్మించిన ఫ్లడ్‌లైట్లను ఆమె ప్రారంభించారు. పుచ్చలమిట్టలో డివైడర్లపై నిర్మించిన లైట్లు ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ దర్శిలో పూర్తిస్థాయిలో మౌలిక సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య పాల్గొన్నారు.

## మాగుంట పార్వతమ్మకు నివాళి

దర్శి, అక్టోబరు 9 : దివంగత మాజీ పార్లమెంట్ సభ్యురాలు మాగుంట పార్వతమ్మ పేదల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని దర్శి నియోజకవర్గ టీడీపీ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ పేర్కొన్నారు. నెల్లూరులో బుధవారం జరిగిన మాగుంట పార్వతమ్మ దిశదిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబసభ్యులు ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసరెడ్డి, ఆయన కుమారుడు మాగుంట రాఘవరెడ్డిలను కలిసి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## కేజీబీవీలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

దొనకొండ : మండలంలోని టైప్-3, టైప్-4 కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న బోధనేతర సిబ్బంది పోస్టులను అవుట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేయడానికి నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎంఈవో-2 షేక్ అమీర్ తెలిపారు. కేజీబీవీ టైప్-3లో హెడ్ కుక్-1, అసిస్టెంట్ కుక్- 3, కేజీబీవీ టైప్- 4లో హెడ్ కుక్-1, అసిస్టెంట్ కుక్-1, కాపలాదారు-1 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఈ పోస్టులకు స్థానిక మహిళా అభ్యర్థులే అర్హులని, ఆసక్తిగల వారు వారి దరఖాస్తులను ఈనెల 15వ తేదీలోపు మండల విద్యాశాఖ కార్యాలయంలో అందించాలన్నారు.

## తాళ్లూరులో కాలువల పూడికతీత


తాళ్లూరు ఎస్సీ కాలనీలో మురుగు కాలువలో పూడిక తీస్తున్న కార్మికులు

తాళ్లూరు, అక్టోబరు 9 : తాళ్లూరు గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బుధవారం మురుగు కాలువల పూడిక తీత పనులు ప్రారంభించారు. గ్రామంలోని అన్ని వీధుల్లో మురుగు కాలువలు పూడి మురుగు నీరురోడ్లపైకి, ఇండ్లలోకి ప్రవహిస్తోంది. రెండు రోజుల క్రితం పంచాయతీ కార్యదర్శిగా విధుల్లో చేరిన ఐ.వి.రమణారెడ్డికి దృష్టికి ఈ సమస్య వెళ్లడంతో తక్షణమే చర్యలు చేపట్టారు. ఈవోఆర్‌డీ కల్లూరి సుందరరామయ్య దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఈవోఆర్‌డీ ఆదేశానుసారం పంచాయతీ నిధులతో గ్రామసర్పంచ్ చార్లెస్ సర్జన్, పంచాయతీ కార్యదర్శి రమణారెడ్డి ఆధర్యంలో గ్రామంలోని మురుగుకాలువ పూడిక తీత పనులకు శ్రీకారం చుట్టారు. ఎస్సీ కాలనీ నుండిప్రారంభించి అన్ని సైడు కాలువల్లో పూడిక తొలగించారు. కాలువల్లో బ్లీచింగ్, ఫినాల్ చల్లారు.

## సీనియర్ అసిస్టెంట్‌గా ప్రసాద్ బాధ్యతలు

తాళ్లూరు : తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా ప్రసాద్ బుధవారం బాధ్యతల స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న పీఎస్ఆర్ మూర్తి ముండ్లమూరు తహసీల్దార్ కార్యాలయ రెవెన్యూ ఇన్స్పెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ముండ్లమూరు ఆర్ఐ కెవిప్రసాద్‌ను ఇక్కడికి సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీ అయ్యారు.

## పంచాయతీల అభివృద్ధిపై దృష్టి పెట్టండి

తాళ్లూరు, అక్టోబరు 9 : గ్రామ పంచాయతీలకు ఆదాయ వనరుల గుర్తింపులో భాగస్వాములు కావాలని ఈవోపీఆర్‌డీ కల్లూరి సుందరరామయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వార్డు మెంబర్లు, ఉపసర్పంచ్‌ల శిక్షణా కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ కార్యక్రమంలోఇంచార్జి ఎంపీడీవో సానికొమ్ము సత్యం, వార్డు మెంబర్లు, ఉప సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# దేవీ పాహిమాం

● భక్తిశ్రద్ధలతో దసరా ఉత్సవాలు
● శోభాయమానంగా ఆలయాలు

**కనిగిరి, దర్శి నియోజకవర్గాల్లో దసరా సందర్భంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఏడో రోజు బుధవారం పలు ఆలయాల్లో అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు.. అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.**

దర్శి, అక్టోబరు 9 : మండలంలో దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ స్థానిక కనకదుర్గమ్మ ఆలయంలో, వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో బుధవారం పూజలు చేశారు. అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చి భక్తుల పూజలందుకున్నారు.

● **జ్ఞాన సరస్వతీదేవిగా...**

**దొనకొండ :** స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఆనంద ఆశ్రమంలో ధర్మకర్త కాకర్ల భైరవానందస్వామి నేతృత్వంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఈశ్వరాంబ అమ్మవారు జ్ఞానసరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.


తూర్పు గంగవరం ఆలయంలో సరస్వతీదేవి అలంకారంలో అమ్మవారు దర్శనం

● **ముండ్లమూరు :** మండలంలోని మారెళ్ల శివాలయంలో భ్రమరాంబ అమ్మవారు, పులిపాడు, ఈదర, ముండ్లమూరు, పోలవరం, శంకరాపురం, నూజెండ్లపల్లిలలోని పోలేరమ్మ, నాంచారమ్మ, భ్రమరాంబ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. మారెళ్లలో సరస్వతి దేవి అలంకరణ చేశారు.

● **పామూరు :** స్థానిక శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అర్చనలు, హోమాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. భక్తులకు మొక్కులు చెల్లించుకొన్నారు.

● **తాళ్లూరు :** తాళ్లూరులోని రామలింగేశ్వర స్వామి, వేణుగోపాలస్వామి, కన్య కాపరమేశ్వరి, తూర్పుగంగవరం వాసవీమాతా, గంగాభవానీ దేవాలయాల్లో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారు సరస్వతీదేవి అవతారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు.

● **కనిగిరి :** దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో కనిగిరి ప్రాంతంలోని దేవాలయాల్లోని అమ్మవారు ఏడోరోజు బుధవారం సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. పట్టణంలోని అంకాలమ్మ, దొంతులమ్మ అమ్మవారి దేవాలయాల్లో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. దొరువులో కొలువైన దుర్గామాత, నందనమారెళ్లలోని పార్వతీదేవి విగ్రహాలను సుందరంగా అలంకరించారు.

# పంట నమోదులో నిష్పక్షపాతంగా ఉండాలి

దొనకొండ : రైతులు సాగుచేసిన పంటల నమోదును ఫీల్డ్‌లోకి వెళ్లి పూర్తి సమాచారంతో నిష్పక్షపాతంగా నిర్వహించాలని కనిగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి కేశవర్ధన్‌రెడ్డి సూచించారు. నూతన ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టిన ఆయన బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డుల గది, సిబ్బంది గదులు, పనితీరు, సరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. తహశీల్దార్ రమాదేవికి, సిబ్బందికి పలు అంశాలపై సూచనలు చేశారు. అనంతరం మండలంలోని బాధాపురంలో 'పొలం పిలుస్తోంది'లో పాల్గొన్నారు. రుద్రసముద్రం సమీపంలో ఏర్పాటు చేసిన చిన్న తరహ పరిశ్రమల పార్క్‌ను, బ్రిటీష్ కాలంనాటి విమానాశ్రయాన్ని పరిశీలించారు.


విమానాశ్రయం వివరాలను తెలుసుకుంటున్న కనిగిరి ఆర్డీవో


ముండ్లమూరులో మిరపను పరిశీలిస్తున్న ఒంగోలు ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న

● **కురిచేడు :** కురిచేడు మండలంలో ఈ క్రాప్ నమోదును కందుకూరు ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డి పరిశీలించారు. మండల వ్యవసాయ శాఖ సిబ్బంది పంటలను ఈ క్రాప్ నమోదు చేశారు. వాటిలో కొన్న ఆర్డీవో లాగిన్‌కు వెళ్ళగా ఆయన వాటిని తిరిగి పరిశీలించారు.

● **ముండ్లమూరు :** ముండ్లమూరులో పంటలను ఒంగోలు ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న పరిశీలించారు. వీఆర్‌వోలు, వ్యవసాయ శాఖ సిబ్బంది సంయుక్తంగా పంటలను పరిశీలించి ఈ క్రాప్‌లో నమోదు చేయాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఆర్ఐ వీవీఎస్ఆర్ మూర్తి, మండల సర్వేయర్ కోటంరాజు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, వీఆర్‌వో బ్రహ్మతేజ ఉన్నారు.

## బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

కనిగిరి : బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీఐ ఖాజావలి అన్నారు. ఆపరేషన్ స్వేచ్ఛా కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ సుబ్బారాయుడు, వైద్యులు సుబ్బయ్య, ఐసీడీఎస్ సీడీపీఓ సరోజినీ పాల్గొన్నారు.

## పొలాలకెళ్లే దారులను మూసేస్తే చర్యలు


గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ మధు

వెలిగండ్ల, అక్టోబర్ 9 : పొలాలకు వెళ్లే దారులను మూసేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మధుసూదనరావు హెచ్చరించారు. పూర్వం నుంచి పొలాల్లోకి వెళ్లే దారులు కొంతమంది రైతులు మూసివేయడంతో తాము పొలాలకు ఎలా వెళ్లాలంటూ చందులూరిపాడు గ్రామస్తులు బుధవారం తహసీల్దార్ సువర్ణకి ఫిర్యాదు చేశారు. ఆయన సూచన మేరకు వెలిగండ్ల ఎస్ఐ రెవెన్యూ సిబ్బంది గ్రామానికి వెళ్లి రైతులతో మాట్లాడారు. పూర్వ రహదారికి వెళ్లకుండా అడ్డుకుంటే గ్రామాల్లోన్ని వ్యవసాయ పొలాలు బీడు భూములుగా మారాల్సి వస్తుందన్నారు. ఉద్దేశపూర్వకంగా గొడవలు సృష్టిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

## స్వీపర్, కుక్ పోస్టులకు నోటిఫికేషన్

పీసీపల్లి : స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో ఖాళీగా ఉన్న స్వీపర్, అసిస్టెంట్ కుక్ లను నియమించేందుకు నోటిపికేషన్‌ను విడుదల చేసినట్లు మండల విద్యాశాఖ అధికారులు జి.సంజీవి మరియు ఆర్.శ్రీనివాసులు తెలిపారు.

## నేడు మోపాడులో ధ్వజస్తంభ ప్రతిష్ఠ

పామూరు : మండలంలోని మోపాడు పంచాయతీ పరిధిలోని పార్వతీదేవి సమేత గొంది మల్లేశ్వర స్వామి దేవస్థాన ధ్వజస్తంభ ప్రతిష్ఠ వేడుకలు గురువారం నుంచి శనివారం వరకు నిర్వహించనున్నారు. జి.కొండలరావు, ఆదిలక్ష్మమ్మ, కె.వెంగయ్య, లక్ష్మీదేవమ్మ దంపతులు సమకూర్చిన ఆర్థిక సహకారంతో ధ్వజస్తంభం ఏర్పాటు చేయనున్నారు.

## సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

పామూరు : పంటల సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏవో రాధ సూచించారు. మండలంలోని బొట్ల గూడూరు, కోడిగుంపల గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు.


బొట్లగూడూరులో సాగుపై అవగాహన కల్పిస్తున్న ఏవో రాధ


విద్యుత్ తీగలు తగిలి అంటుకొన్న వరిగడ్డి ట్రాక్టర్


బోడవాడలో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు

## తక్కువ ఎత్తులో విద్యుత్ తీగలు

పామూరు, అక్టోబరు 9 : మండలంలోని బోడవాడ గ్రామ ఎస్సీ కాలని వద్ద ఉన్న విద్యుత్ తీగెలు తక్కువ ఎత్తులో ఉండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల గడ్డి ట్రాక్టర్ గ్రామంలోకి వస్తుండగా విద్యుత్ తీగలు అంటుకోవడంతో మంటలు చెలరేగాయి. ట్రాక్టర్ డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు ప్రమాదాలు జరగకుండా తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను ఎత్తు పెంచి సరిచేయాలని బోదవాడ వాసులు కోరుతున్నారు.

## 300 మంది గర్భిణులకు భోజన సదుపాయం

కురిచేడు : కురిచేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం గర్భిణులకు వైద్య పరీక్షలు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ నిర్వహించారు. మొత్తం 300 మంది వరకు హాజరయ్యారు. వీరికి కురిచేడు లయన్స్ క్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో భోజన సదుపాయం కల్పించారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ జెబి రామారావు, అధ్యక్షుడు వివి రమణారావు, కోశాధికారి పెండ్యాల ప్రసాదరావు, సభ్యులు యెలిసెట్టి రంగగనాయకులు, ఇందూరి వెంకట నరిసిరెడ్డి, ఎస్‌వీయస్ గుప్తా, సూరె నాసరయ్య గుప్తాతదితరులు పాల్గొన్నారు.


గర్భిణులకు భోజనం పెడుతున్న లయన్ క్లబ్ సభ్యులు

## చెట్టు కొమ్మ విరిగిపడి కార్లు ధ్వంసం

కురిచేడు : కురిచేడు ఎన్నెస్పీ కాలనీలో బుధవారం ఉదయం చెట్టు కొమ్మ విరిగి పడి రెండు కార్లు ధ్వంసం అయ్యాయి. ఉదయాన్నే వర్షం కురిసింది. అదే సమయంలో కొత్త ఎన్నెస్పీ కాలనీలోని రెండవ లైన్‌లో నివాసం ఉంటున్న డాక్టర్ సునీల్ ఇంటి ఎదురుగా ఉన్న చెట్టు కొమ్మ విరిగి పడింది. చెట్టు కింద ఉన్న రెండు కార్లు ధ్వంసం అయ్యాయి. విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేశారు.


కార్లపై పడిన చెట్టుకొమ్మ

## తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు

ముండ్లమూరు : తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే విధంగా రైతులు పంటలు సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి ఎండీ ఫరూక్ అన్నారు. ఆయన బుధవారం మండలంలోని మారెళ్ళలో పొలం బడి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హాజరైన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రైతులు పంటలకు విచ్చలవిడిగా పురుగు మందులు వాడ వద్దన్నారు. ప్రభుత్వం ఇచ్చే సలహాలు సూచనలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు సుంకర రాఘవరెడ్డి, నరేంద్ర, వీఏఏ బాల వెంకటయ్య, కోనంకి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.




కంపచెట్లతో నిండిపోయిన పెదనందిపాడు బ్రాంచ్ కెనాల్

# రేషన్.. డాన్

- మాఫియాలో గుత్తాధిపత్యం
- గుంటూరుకు చెందిన ఓ మిల్లర్‌తో కుమ్మక్కు
- ఎదురు తిరిగిన వారిపై అధికారులతో దాడులు.. కేసులు
- గతంలో వైసీపీతో.. ప్రస్తుతం కూటమి నేతలతో సంబంధాలు

పేదల బియ్యం బొక్కే రేషన్ మాఫియాలో ఓ డాన్ అవతరించాడు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ నేతలతో అంటకాగి.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తన అక్రమాలకు అడ్డులేకుండా చేసుకునేందుకు గోడ దూకాడు. ఈ క్రమంలో సొంత సామాజికవర్గం పేరుతో జనసేన నేతలతో.. మరో సామాజిక వర్గం అండతో టీడీపీ నేతలతోనూ సంబంధాలు కొనసాగిస్తున్నాడు. రేషన్ మాఫియాను తన చెప్పుచేతుల్లో ఉంచుకునేందుకు కూటమి నేతలు, అధికారులను వినియోగించుకుంటున్నాడని సమాచారం. తన గుత్తాధిపత్యానికి చెక్ చెప్పే వారిని టార్గెట్ చేసి వారిపై అధికారులతో దాడులు చేయించి.. కేసులు పెట్టిస్తున్నాడు. ఈ క్రమంలోనే రెండు రోజులుగా గుంటూరు పరిసరాల్లో వరుసగా రేషన్ బియ్యం పట్టుబడిందని సమాచారం. తనకు అడ్డు వస్తున్నాడని సొంత బావపైనే ఏకంగా దాడి చేసి తిరిగి అతడిపైనే కేసు పెట్టించి ఇతరులకు హెచ్చరికలు పంపాడు. తనకు తెలియకుండా రేషన్ బియ్యం కొన్నా, తనకు తెలియకుండా అమ్మినా వారి అంతు తేల్చడమే పనిగా ఈ డాన్ పెట్టుకోగా అతడికి అధికారులు పూర్తిగా సహకరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. సాక్షాత్తూ రాష్ట్ర పౌర సరఫరాల శాఖామంత్రి సొంత జిల్లా అయిన గుంటూరులో రేషన్ డాన్ ఇంతలా పెచ్చరిల్లిపోతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



- రెండు రోజుల క్రితం గుంటూరు పట్టాభిపురం పరిధిలో అక్రమంగా రవాణా చేస్తున్న 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. గుజ్జనగుండ్ల నుంచి పలకలూరు మీదగా కాకినాడ పోర్టుకు బియ్యాన్ని తరలిస్తున్నట్లు పోలీసులు కేసు పెట్టి ఇద్దర్ని అదుపులోకి తీసుకున్నారు.
- తాజాగా బుధవారం తెల్లవారుజామున రెండు భారీ వాహనాల్లో తరలిస్తున్న 28 టన్నుల రేషన్ బియ్యాన్ని చేబ్రోలులో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ వాహనాలు వట్టిచెరుకూరు మండలం చమళ్లమూడి నుంచి గుజరాత్‌కు తరలిస్తుండగా తనిఖీల్లో దొరికినట్లు పోలీసులు తెలిపారు.

బాపట్ల, గుంటూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వరుసగా మూడు రోజుల్లో గుంటూరు పరిసరాల్లో ఈ ఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఈ రెండు ఘటనల ద్వారా రేషన్ బియ్యం తరలింపును అధికారులు అడ్డుకట్ట వేస్తున్నారు అని అందరూ భావిస్తారు. అయితే ఇన్నాళ్లూ గుట్టుగా సాగిపోయిన ఈ వ్యవహారం రేషన్‌మాఫియాలో గ్రూపుల మధ్య కుమ్ములాటలతో వెలుగులోకి వచ్చింది. మొత్తం రేషన్ బియ్యం మాఫియాను తన గుప్పెట్లో పెట్టుకోవాలని చూస్తున్న 'డాన్' ఒకరు ఈ వ్యవహారాలు మొత్తం నడిపిస్తున్నారని సమాచారం. తనకు అడ్డుగా ఉన్నవారిపై సదరు డాన్ అధికారులకు సమాచారం ఇవ్వడం.. అప్పటికప్పుడు వారు తనిఖీలు చేపట్టడం.. కేసులు పెట్టడం జరిగిపోతోంది. అక్రమాలకు అడ్డు వచ్చిన వారిని తొలగించుకునేందుకు ఎంతకైనా తెగిస్తున్నాడు. తన గుత్తాధిపత్యానికి అడ్డువచ్చినవారు తనవారైనా.. పరాయివారైనా ఉపేక్షించేది లేదంటూ మాఫియా డాన్ హెచ్చరికలు చేస్తున్నాడు. తన మాట వినలేదన్న కసితో సదరు మాఫియా డాన్ సొంత బావను కూడా వదిలిపెట్టలేదు. అక్క భర్తన్న ఆలోచన కూడా లేకుండా తల పగలగొట్టాడు. తన పలుకుబడిని ఉపయోగించి గుంటూరు పట్టాభిపురంలో అక్రమంగా కేసు పెట్టి మిగిలిన వారికి తీవ్ర హెచ్చరికలు పంపాడు. గుంటూరులోని 201 రేషన్ షాపుల్లో 40కిపైగా షాపుల్లో ఈ డానే పెట్టుబడి పెడుతూ వాటిని తన అదుపాజ్ఞల్లో ఉంచుకుని రేషన్ మాఫియాను శాసిస్తున్నాడు. ఈ డాన్ గుంటూరు కాకాని రోడ్డులోని ఓ మిల్లర్‌తో కుమ్మక్కయ్యాడు. దాదాపు రెండు దశాబ్దాలుగా రేషన్ అక్రమాలకు పాల్పడుతున్న ఈ డాన్ మిల్లర్‌తో కలిసి రేషన్‌బియ్యంపై గుత్తాధిపత్యానికి తెరతీశాడు. గతంలో వైసీపీతో అంటకాగిన సదరు డాన్.. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే తన సామాజిక వర్గాన్ని అడ్డుపెట్టుకుని జనసేనతో సంబంధాలు నెరపుతున్నాడని సమాచారం. అదే పద్ధతిలో మరో ప్రధాన సామాజిక వర్గానికి చెందిన మిల్లర్‌తో కలిసి టీడీపీతో సంబంధాలు కొనసాగిస్తున్నాడు. సదరు మిల్లర్ ద్వారా ప్రాసెసింగ్ చేసి సన్నబియ్యంగా మార్చి ఎగుమతి చేస్తున్నాడు.

## డాన్‌కు అధికారుల విధేయత

రేషన్ మాఫియా డాన్ పౌర సరఫరాల శాఖ, విజిలెన్స్, పోలీసు అధికారులతో సత్సంబంధాలు నెరుపుతూ తన వ్యవహారాలను చక్కబెట్టుకుంటున్నాడు. అధికారులకు కావాల్సిన కేసులు కూడా తనే సమాచారం ఇచ్చి సహకరిస్తుంటాడు. కానివారిపై కేసులు పెట్టి దారికి తెచ్చుకుంటున్నాడు. ఇలా రేషన్‌మాఫియా గుత్తాధిపత్యం భరించలేని కొందరు సొంత ప్రయత్నాలు చేసుకుంటున్న మరికొందరు అక్రమార్కులపై అధికార బలాన్ని ఉపయోగించి కేసులు పెట్టిస్తున్నాడు. డాన్‌కు వ్యతిరేకంగా ఉన్నాడన్న కారణంగా వట్టిచెరుకూరు మండలం చెవళ్లమూడిలోని ఓ మిల్లర్‌పై అధికారులు పదే పదే దాడులు చేస్తున్నారు. గత జూలైలో ఆ మిల్లుపై దాడి చేసి 750 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నారు. తాజాగా బుధవారం మరో 28 క్వింటాళ్ల బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. ఇలా పట్టుకున్న బియ్యాన్ని సదర్ డాన్‌తో చేతులు కలిపిన కాకాని రోడ్డులోని మిల్లుకే తరలిస్తున్నారు. కాకాని రోడ్డులోని మిల్లర్‌పై ఇప్పటికే లెక్కకు మించిన కేసులు ఉన్నా పట్టుబడిన బియ్యాన్ని ఆ మిల్లుకే తరలించి పౌర సరఫరాల శాఖ అధికారులు తమ విధేయతను చాటుకుంటుండడం విశేషం.

## పీడీ యాక్టే విరుగుడు

వైసీపీ ప్రభుత్వంలో నేతలు సహజవనరుల దోపిడీనే కాకుండా పేదోడి బియ్యం మీద కూడా మాఫియాను వ్యవస్థీకృతం చేసి కోట్లు ఆర్జించారు. వైసీపీ నేతలకు ముడుపులు ముట్టచెప్పి దర్జాగా బియ్యం దందా చేసేవారు. మొక్కుబడిగా 6ఏ కేసులు నమోదు చేయడం తప్ప వ్యవస్థీకృతంగా మారిన రేషన్ దందాకు మాత్రం అడ్డుకట్ట వేయలేకపోయారు. రేషన్ మాఫియాలోని కీలక వ్యక్తులపై పీడీ యాక్టు ప్రతిపాదనలను అధికారులు పంపినా రాజకీయ ఒత్తిళ్లతో వాటిని అప్పట్లో నీరుగార్చారు. వ్యవస్థీకృతంగా మారిన దందాను కట్టడి చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. కానీ క్షేత్రస్థాయిలో ఈ దందా చాలా వరకు కూటమి పార్టీ ద్వితీయశ్రేణి నేతల కనుసన్నల్లోనే నడుస్తుండడంతో ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పడుతుంది. పైగా తనిఖీలకు వెళ్లిన అధికారులకు గత ప్రభుత్వంలో ఈ దందా జరగలేదా? ఇప్పుడు జరిగితే తప్పేంటన్న రీతిలో ప్రశ్నించడం బరితెగింపునకు నిదర్శనంగా కనబడుతోంది. నెలన్నర క్రితం నిజాంపట్నం మండలపరిధిలో బియ్యం నిల్వలు ఉన్నాయనే సమాచారంతో అధికారులు తనిఖీలకు వెళ్లగా అక్కడ దందాను నడిపిస్తున్న వ్యక్తుల వద్ద నుంచి యంత్రాంగానికి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. అద్దంకి నియోజకవర్గ పరిధిలో అధికారుల వాహనాలకు తమ వాహనాలను అడ్డుగా పెట్టి మరీ రేషన్ మాఫియా బెదిరింపులకు దిగింది. గత ప్రభుత్వం అటకెక్కించిన పీడీయాక్టు కేసు ప్రతిపాదనలను అమలు చేయడమే ఈ దందాకు విరుగుడుగా కనబడుతోంది. పదేపదే ఈ దందాలో పట్టుబడుతున్న వారిపై పీడీ యాక్టు చట్టం కింద కేసు నమోదు చేసి కఠినచర్యలుంటాయనే సంకేతాలను సదరు మాఫియాకు పంపగలిగితేనే కూటమి ప్రభుత్వంలోనైనా రేషన్ దందాకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంది. లేదంటే ప్రభుత్వం మారినా మూడు పువ్వులు ఆరు కాయలుగా ఈ మాఫియా వర్ధిల్లుతూనే ఉంటుంది. బాపట్ల జిల్లా వ్యాప్తంగా ఈ రెండు నెలల్లో రేషన్ అక్రమార్కులపై 42 వరకు 6 ఏ కేసులు నమోదు కాగా 780 క్వింటాళ్ల బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం కేసులునమోదైన వారిలో గత ప్రభుత్వంలో 6ఏ కేసులు నమోదై ఉన్న వారు కూడా ఉండడం గమనార్హం.

### భయానకంగా పరిస్థితులు

రేషన్‌మాఫియా మధ్య గొడవలు ఉద్రిక్తంగా మారుతున్నాయి. ఒకరిపై ఒకరు దాడులుచేసుకునే స్థాయిని దాటి పోలీస్ స్టేషన్ల వరకు వెళ్తున్నాయి. గతంలో పొన్నూరు చెందిన రేషన్ మాఫియా లీడర్ 'బర్న్‌బాస్' హత్యోదంతం జరిగిన అనుభవాలున్నా అధికారుల్లో చలనం లేదు. గతంలో 2022 చివర్లో ఇదే మాఫియా డాన్ పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ఓ రిపోర్టరుపై దాడి చేయించి తల పగలగొట్టిన ఘటన కూడా ప్రజలు ఇంకా మర్చిపోలేదు. కానీ మాఫియా తగాదాలు ఆందోళనకర స్థాయిలో జరుగుతున్నా యంత్రాంగం ఏమాత్రం పట్టించుకోకపోవడం శోచనీయం.

### గతంలో రాజకీయ ఒత్తిళ్లు

వైసీపీ హయాంలో చివరి రెండేళ్లలోనే బాపట్ల జిల్లాలో దాదాపుగా 250 వరకు 6ఏ కేసులను అధికారులు నమోదు చేశారు. మూడు సార్లకు మించి 6ఏ కేసులు పెడితే వారిపై పీడీయాక్టు ప్రతిపాదనలను అప్పటి అధికారులు చేశారు. రేషన్ మాఫియాలో కీలకంగా వ్యవహరించే చీరాలకు చెందిన ఓ వ్యక్తితో పాటు కారంచేడు పరిధిలోని వైసీపీ నేత అనుచరుడు, చినగంజాం మండల పరిధిలోని ఒకరితో సహా మొత్తం ముగ్గురిపై పీడీయాక్టు ప్రతిపాదనలను అప్పటి జేసీ శ్రీనివాసులు ఎస్పీకి పంపారు. అయితే రాజకీయ ఒత్తిళ్లతో వాటిని అటకెక్కించారు. తర్వాత రేషన్ మాఫియా జిల్లాలో మరింతగా చెలరేగిపోయింది.

# నీటి సంఘాల.. సమరం

- ఈ నెల 16న ఎన్నికల షెడ్యూల్
- రైతు వర్గాలతో పాటు గ్రామాల్లో సందడి
- సాధారణ ఎన్నికల తర్వాత జరగనున్న తొలి ఎన్నికలు
- ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న ప్రధాన పార్టీలు
- గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలో 259 సంఘాలకు ఎన్నికలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఐదేళ్లుగా నిర్వీర్యమైన సాగునీటిరంగాన్ని గాడి లో పెట్టే క్రమంలో కూటమి ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమైంది. నిధులు ఇవ్వాల్సివస్తోందని లేదంటే కాల్వలకు మరమ్మతులపై నీటి సంఘాల నుంచి డిమాండ్లు వస్తాయనో వైసీపీ ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికలను విస్మరించింది. సాగునీటి సంఘాల కు ఎన్నికలు లేకపోవడంతో కాల్వల మరమ్మతులు, వాటి బాగోగులు, నీటి నిర్వహణ ఐదేళ్లుగా జరగ లేదు. దీంతో కాల్వలు అధ్వానంగా మారిపోయి, సాగునీరు సక్రమంగా అందక రైతులు నష్టపోవాల్సివచ్చింది. ఈ క్రమంలో నీటి పంపిణీలో రైతులను భాగస్వామ్యం చేయడంతో పాటు కాల్వల బాగుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ఏర్పాటుచేస్తోంది. ఈ నెల 16 నుంచి ఎన్నికల ప్రక్రియను ప్రారంభించే దిశగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. సాధారణ ఎన్నికల అనంతరం జరగనున్న తొలి ఎన్నికలు కావడంతో ప్రధాన పార్టీలు వీటిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. గ్రామ స్థాయిలో రైతు వర్గాల్లో పట్టు నిలుపుకునేందుకు ఆయా పార్టీల నేతలు సమాయత్తమవుతున్నారు. దీంతో పల్లెల్లో సాగు నీటి ఎన్నికల సందండి ప్రారంభమైంది. నీటి సరఫరాలో కీలకపాత్ర వహించే సంఘాలకు నేతృత్వం వహించేందుకు రైతులు ముందుకువస్తున్నారు. నాగార్జునసాగర్ కుడికాల్వ ప్రాజెక్టు కమిటీ పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో 259 నీటిసంఘాలు, 30 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. 2015లో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. వీటి పదవీకాలం ముగిసినా వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సాగునీటి సంఘాల ప్రాధాన్యాన్ని గుర్తించి ఎన్నికల నిర్వహణకు సిద్ధమైంది. ఈ క్రమంలో తొమ్మిదేళ్ల తర్వాత సదరు సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పల్లెల్లో సాగునీటి సంఘాల ఎన్నికల సందడి నెలకొంది.



కంప చెట్ల మూసుకు పోయిన గోవిందాపురం మైనర్ కాల్వ

### 40 రోజుల్లో ప్రక్రియ పూర్తి

ఈ నెల 16వ తేదీన సాగునీటి సంఘాల ఎన్నికల షెడ్యూల్ విడుదల కానున్నది. తొలుత సాగునీటి సంఘాలకు ఆ తదుపరి డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ఆ తర్వాత ప్రాజెక్టు కమిటీల ఎన్నిక జరగనున్నది. ఈ ప్రక్రియ అంతా 40 రోజుల్లో పూర్తిచేసేందుకు అధికారులు ఏర్పాట్లుచేస్తున్నారు. ఎన్నికల ప్రక్రియపై కలెక్టర్లు, జలవనరులశాఖ అధికారులతో మంత్రి నిమ్మల రామానాయుడు మంగళవారం ప్రత్యేకంగా సమీక్షించారు. సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సమస్యాత్మక సంఘాలను గుర్తించి, ప్రశాంత ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపట్టాలని మంత్రి కలెక్టర్లకు సూచించారు.

### ఈ సారి కౌలు రైతులకు ఓటు హక్కు

ఈ సారి కౌలు రైతులకు ఓటు హక్కు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రుణ అర్హత కార్డులు పొందిన కౌలు రైతులకు ఓటు హక్కు కల్పించనున్నారు. అయితే కౌలు రైతులు వారు సాగు చేసుకుంటున్న భూముల సర్వే నెంబర్లలో యజమానులకు ఓటు హక్కు ఉండదని అధికారులు చెబుతున్నారు. భూమి, పట్టాదారు పాసు పుస్తకం ఉన్న రైతులను ఓటర్లుగా గుర్తిస్తారు. సర్వే నెంబర్లు ఆధారంగా నీటి సంఘాల వారీగా ఓటర్లను కేటాయిస్తారు. నీటి సంఘాల పరిధిని ఇప్పటికే జలవనరుల శాఖ గుర్తించింది. చెరువుల ఆయకట్టు పరిధిలోని రైతుల వివరాలను మైనర్ ఇరిగేషన్ శాఖ సేకరించింది. ఒక్కో నీటి సంఘం పరిధిలో ఆయకట్టు ఆధారంగా రైతులకు ఓటు హక్కును కల్పిస్తారు. ఏ సర్వే నెంబరులో ఎంత మంది రైతులు ఉన్నారు. వీరిలో కౌలు రైతులు ఎంత మంది ఉన్నారో నిర్ధారిస్తారు. ఈ వివరాలు ఆధారంగా సాగు నీటి సంఘం పరిధిలో ఓటర్ల జాబితాలను సిద్ధం చేస్తున్నారు. జలవనరుల, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా ఓటర్లను గుర్తిస్తున్నాయి.

### సాగునీటి కాల్వలకు మహర్దశ

సాగునీటి సంఘాలకు ఎన్నికలతో కాల్వలకు మహర్దశ పట్టనున్నది. మరమ్మతులకు ఇవ్వాల్సిన నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించుకుంది. ఎన్నికలు జరగకపోవడంతో సంబంధిత అధికారులకే నీటి సంఘాల బాధ్యతలను అప్పగించారు. నీటి తీరువాకు సంబంధించిన నిధుల కేటాయింపు కూడా నిలిచిపోయింది. ఈ నిధులను వైసీపీ ప్రభుత్వం దారిమళ్లించి కాల్వల మరమ్మతులకు మొండిచేయి చూపింది. ఈ పరిస్థితుల్లో ఎన్నికలతో మళ్లీ సాగు నీటి సంఘాలకు పూర్వ వైభవం రానున్నది. కాల్వల మరమ్మతులకు పుష్కలంగా నిధులు రానున్నాయి.

# సరస్వతి నమస్తుభ్యం

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం మూలా నక్షత్రం పురస్కరించుకుని అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు జరిగాయి. అమ్మవారి ఆలయాల్లో గోపూజ, సువాసిని, సువాసినులచే సామూహిక కుంకుమార్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలు దేవాలయాల్లో అమ్మవారిని శ్రీ సరస్వతి అమ్మవారిగా అలంకరించారు. విద్యార్థులు సామూహిక సరస్వతి పూజలు నిర్వహించారు. పలు దేవాలయాల్లో చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు.

\- బాపట్ల



రేపల్లె: పట్టణంలోని బూరుగలమ్మ దేవాలయంలో సరస్వతిదేవిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ



వేమూరు: జంపని రామేశ్వరాలయంలో సరస్వతిదేవి అలంకారం



కొల్లూరు: భట్టిప్రోలు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో సరస్వతీదేవి అలంకారంలో అమ్మవారు



బాపట్ల: శ్రీకన్యకాపరమేశ్వరి దేవస్థానంలో సరస్వతీదేవిగా అమ్మవారు



బాపట్ల: చందోలు గ్రామంలో శ్రీసరస్వతీదేవి అలంకరణలో శ్రీబగళాముఖి అమ్మవారు

# మద్యం షాపులకు 1270 దరఖాస్తులు

- గడువు పొడిగింపు.. రేపటి వరకు అవకాశం
- స్పందన తక్కువగా ఉన్న షాపులపై ఈఎస్ సమీక్ష

బాపట్ల(ఆంధ్రజ్యోతి), అద్దంకి, అక్టోబరు 9: మద్యం షాపుల లైసెన్సుల కోసం జిల్లా వ్యాప్తంగా 1270 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల సమర్పణకు గడువు బుధవారంతో ముగియాల్సి ఉండగా ఈ నెల 11 వరకు అవకాశం ఇస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్టేషన్ల వారీగా మద్యం షాపులకోసం వచ్చిన దరఖాస్తులపై బుధవారం ఈఎస్ సమీక్ష నిర్వహించారు. ఎక్కడెక్కడ స్పందన తక్కువ ఉందో ఆరా తీసి అక్కడ ఉన్న ఇబ్బందులను గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా 117 షాపులకు నోటిఫై చేయగా అన్నింటికి దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. 30 షాపులకు సంబంధించి సగటున 7 మాత్రమే దఖాస్తులురావడంపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

### లాటరీ తీశాక చూద్దాం...

నిన్న మొన్నటి వరకు మద్యం షాపుల విషయంలో సిండికేట్‌కు తెర వెనక నుంచి సహకారం అందిస్తూ వచ్చిన కొంతమంది నేతలు ప్రస్తుతం చేతులెత్తేసినట్లు తెలుస్తోంది. మద్యం షాపుల లైసెన్సుల విషయంలో కూటమి నేతల జోక్యంపై అధిష్ఠానం సీరియస్‌గా ఉండడంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నట్లు సమాచారం. అధిష్ఠానం ఆగ్రహంతో సిండికేట్ ప్రతిపాదనలకు నేతలు కొంత వెనకడుగు వేసినా ఈ నెల 14న లాటరీ తీసిన తర్వాతనే అసలైన ఆట మొదలుకానుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

### సంతమాగులూరులో సిండికేట్‌గా

అద్దంకి నియోజకవర్గ పరిధిలో కొన్ని మండలాల్లో ముందస్తుగానే సిండికేట్‌గా మారి మద్యందుకాణాలకు దరఖాస్తులు వేసినట్లు సమాచారం. నియోజకవర్గం పరిధిలో 23 షాపులకు బుధవారం సాయంత్రం 5 గంటల సమయానికి 232 దరఖాస్తులు మాత్రమే అందాయి. మద్యం అమ్మకాలు అధికంగా ఉండే సంతమాగులూరు మండలంలో 5 షాపులకు 20 దరఖాస్తులు మాత్రమే వేయడం అనుమానాలకు తావిస్తుంది. పంగులూరు మండలంలో మూడు దుకాణాలకు అత్యధికంగా 54, అద్దంకి పట్టణంలో 5 షాపులకు 59, మండలంలో రెండు షాపులకు 12, బల్లికురవ మండలంలో నాలుగింటికి 35 దరఖాస్తులు వచ్చాయి.

# ముగిసిన విచారణ

- ఎస్టీవో కార్యాలయంలో రికార్డుల పరిశీలన పూర్తి

చీరాల, అక్టోబరు 9: చీరాల ఉప ఖజానా అధికారి కార్యాలయంలో మూడు రోజుల నుంచి కొనసాగుతున్న విచారణ బుధవారంతో ముగిసింది. ట్రెజరీస్ డైరెక్టర్ ఉత్తర్వుల మేరకు విజయనగరం డీటీవో ఆర్ఎస్ కుమార్, మరో ఐదుగురు అధికారుల బృందం విచారణ చేపట్టింది. బృంద అధికారి ఆర్ఎస్ కుమార్ మాట్లాడుతూ ఆరోపణలకు సంబంధించి రికార్డులు పరిశీలించామని, సస్పెండ్ అయిన, బదిలీపై వెళ్లిన వారిని కూడా పిలిచి మాట్లాడినట్లు చెప్పారు. నివేదికను డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్‌కు అందజేస్తామని, వారు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటారని చెప్పారు. విచారణ బృందం కోరిన రికార్డులను ఎస్టీవో సుబ్బారావు అందజేశారు. కార్యక్రమంలో విచారణ బృందం సభ్యులు ఐ.రమేష్(ఎస్టీవో విజయనగరం), తులసిరావు(ఎస్టీవో శ్రీకాకుళం), సురేష్‌కుమార్(ఎస్టీవో విజయనగరం), ఫయాజ్ అహ్మద్(ఎస్ఏ, ఎస్టీ కర్నూల్), అంజాద్‌పాషా(ఎస్టీవో కర్నూలు) పాల్గొన్నారు.

# చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన మోపిదేవి

- వెంకటరమణరావు, ఆయన తనయుడికి పసుపు కండువా కప్పిన సీఎం

రేపల్లె, అక్టోబరు 9: మాజీ రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు, ఆయన కుమారుడు రాజీవ్‌లు బుధవారం టీడీపీ కండువా కప్పుకున్నారు. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో మోపిదేవి, ఆయన తనయుడ్ని చంద్రబాబు పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మోపిదేవి మాట్లాడుతూ అమరావతి సృష్టికర్త అయిన చంద్రబాబుతో కలిసి పని చేస్తానన్నారు. టీడీపీ పార్టీకి అండగా నిలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర, నారాయణ, గొట్టిపాటి రవి, ఎంపీ లావు కృష్ణదేవరాయులు, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తదితరులు పాల్గొన్నారు.



మాజీ రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు, బీద మస్తాన్‌రావు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన సీఎం చంద్రబాబు,మంత్రులు అనగాని, గొట్టిపాటి, నారాయణ, రవీంద్ర

» సాగర్ కాలువ చివరి భూములకు రాని సాగు నీరు
» ట్రాక్టర్ ఇంజన్ల సాయంతో తడులు
» పెరుగుతున్న పెట్టుబడి » సాగుదారుల ఆందోళన



పొగనారు మళ్లకు నీరు పెడుతున్న మహిళ



కుంటలో నీటిని ఇంజన్ ద్వారా నారుమడికి పెడుతున్న రైతు

# నారుమళ్లు.. తడికోసం తంటాలు

అన్నీ అనుకూలంగా ఉంటే వ్యవసాయం లాభసాటి. లేదంటే నష్టం తప్పదు. అదునులో పదును కావాలి. పదును భూమిలో విత్తనం పడాలి. అనంతరం సాగునీరు (వర్షం లేదా ఇతర వనరుల నుంచి) అందాలి. సకాలంలో సస్యరక్షణ చర్యలు, మేలైన యాజమాన్య పద్ధతులు చేపట్టాలి. పంట దిగుబడులు చేతికి అందే వరకు ప్రకృతి వైపరీత్యాలు ఉండకూడదు. ఇదంతా జరిగితేనే రైతు, కూలీకి నాలుగు రూపాయలు మిగిలేది. లేదంటే నష్టాలు మూటగట్టుకోవాల్సిందేనని రైతులు ముక్తకంఠంతో చెప్తున్నారు.

చీరాల, అక్టోబరు 9 : ఇంకొల్లు, గొల్లపాలెం మధ్య సాగరు కాలువ ఆయకట్టు పరిధిలోని చివరి భూములలో పొగనారుమళ్లు సాగు చేస్తున్నారు. గత ఏడాది వైట్‌బర్లీ, బ్యారన్ పొగాకుకు మంచి ధరలు పలికాయి. ఈ ఏడాది కూడా వైట్ బర్లీ, బ్యారన్ పొగాకు విస్తీర్ణం పెరగనుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని పలువురు రైతులు పొగాకు నారమళ్ల సాగుచేస్తున్నారు. సాగర్‌ఆయకట్టు చివరి భూములు కావడంతో సాగునీరు రావడం లేదు. రెండో వైపు కొమ్మమూరు కాలువ పరిధిలో ఎత్తిపోతల పథకం నుంచి వచ్చే సాగునీరు సాగుదారులకు సక్రమంగా అందడం లేదు. దీంతో రైతులు సమీపంలో చెరువులో నీటిని ట్రాక్టర్ ఇంజన్, ఆయిల్ ఇంజన్లతో పంప్‌చేస్తూ పైప్‌లైన్ల ద్వారా నారుమళ్ల నీటి తడులు ఇస్తున్నారు. ఇది అదనపు ఖర్చు. దీంతో పెట్టుబడులు పెరుగుతున్నాయని సాగుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నారుమళ్లకు దుక్కి దున్నకం, బెడ్లు ఏర్పాటు, విత్తనాలు చల్లడం, ఎరువులు, పురుగుమందులు, నీటి తడులు, కూలీ, కౌలు తదితరాలను లెక్కిస్తే ఎకరాకు సుమారు రూ.3లక్షల వరకు ఖర్చవుతుంది. అన్నీ సక్రమంగా ఉండి నారు విక్రయాలు జరిగితే నాలుగు రూపాయలు మిగులుతాయి. నారుమళ్లలో సస్యరక్షణ కీలకం. వరు స వర్షాలు లేదా మంగువాతావరణం ఉండకూడదు. బెట్టకు రాకూడదు. ఉదయం, సాయంత్రం నీటిని పైపాటును పిచికారీ చేయాల్సిందే. కాలువలో నీరులేక పోవడంతో సాగు ప్రశ్నార్థకంగా మారుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో కాలువకు సాగునీరు వచ్చే విధంగా తగిన చర్యలు చేపట్టాలని ఆ పరిధిలో నారుమళ్లతో పాటు ఇతర పంటలు సాగుచేసిన, చేయాల్సిన రైతులు కోరుతున్నారు. అందుకు అనుగుణంగా అధికారగణం స్పందిస్తారని ఆశిద్దాం.

## ముంపు గ్రామమైన మణికేశ్వరం సమస్యలు పరిష్కరించాలి

అద్దంకి, అక్టోబరు 9 : కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ రిజర్వాయర్ ముంపు గ్రామాలలో ఒకటైన మణికేశ్వరం గ్రామస్థుల సమస్యలను పరిష్కరించాలని పలువురు అద్దంకి నియోజవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు షేక్ కరిముల్లా ఆధ్వర్యంలో గ్రామ టీడీపీ నేతలు బుధవారం ఒంగోలులో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సునీల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎస్సీ కాలనీ వాసులు, ముస్లిం కాలనీల స్థలాలకు సంబంధించి భూసేకరణ వేగవంతం చేయాలని, ముంపు గ్రామ ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు.



సునీల్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నేతలు

## ఆర్థిక ప్రణాళికను రూపొందించుకోవాలి

### ఈవోఆర్డీ సుమంత్

పంగులూరు, అక్టోబరు 9 : గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించి ముందుగా తగిన ఆర్థిక ప్రణాళిక రూపొందించుకోవాలని ఈవోఆర్డీ కె.సుమంత్ సభ్యులకు సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో వార్డు సభ్యుల రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. పంచాయతీలలో చేపట్టాల్సిన పనుల నిర్వహణపై ఆర్పీ సునీత సభ్యులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్పీ సునీత

## సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు

### తహసీల్దార్ గోపీకృష్ణ



చీరాలటౌన్, అక్టోబరు 9 : ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేసేందుకు కృషి చేస్తున్నట్లు చీరాల తహసీల్దార్ గోపీకృష్ణ పేర్కొన్నారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఎస్టీ సామాజిక వర్గానికి సంబంధించి గ్రామాలకు దూరంగా ఉంటూ పథకాలు అందక ఇబ్బంది పడుతున్నవారి కోసం ప్రత్యేక సర్వేను చేపట్టారు. ఇప్పటికే సుమారు 56 మందిని గుర్తించినట్లు తహసీల్దార్ తెలిపారు. మిగిలిన వారిని గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారన్నారు. ఎస్టీ వాసులు వారి వివరాలను అధికారులకు ఇచ్చి సహకరించాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారికి జనన ధ్రువపత్రం, ఆధార్ కార్డును అందిస్తున్నట్లు గోపీకృష్ణ తెలిపారు.

## సరస్వతీదేవి అలంకరణలో అమ్మవార్లు





అద్దంకి : సరస్వతీదేవిగా కన్యకాపరమేశ్వరి పంగులూరు శ్రీ భీమలింగేశ్వరస్వామి ఆలయంలో

అద్దంకి, అక్టోబరు 9 : దసరా శరన్నవరాత్రులలో భాగంగా బుధవారం పలు దేవాలయాలలో సరస్వతి దేవి అలంకారంలో అమ్మవారులు భక్తులకు దర్శనమిచ్చారు. అద్దంకి పట్టణంలోని వాసవీకన్యకాపరమేశ్వరి దేవాలయంలో సరస్వతి దేవిగా, దత్తపాదుకాక్షేత్రంలో మహాసరస్వతిదేవిగా శింగరకొండలోని గాయత్రి పరమేశ్వరి దేవాలయంలో సరస్వతిదేవిగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పంగులూరు : 7వ రోజు అమ్మవారిని సరస్వతీదేవిగా ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీ భీమలింగేశ్వర స్వామి ఆలయంలో సరస్వతీదేవి అలంకరణలో దర్శన మిచ్చిన పార్వతీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. పంచాయతీ కూడలిలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. చందలూరు రేణుకమ్మతల్లి, రేణంగివరంలో శరన్నవరాత్రి ఉత్సవాలు శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

పర్చూరు : పలు దేవాలయాల్లో అమ్మవార్లు శ్రీ సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ అద్దంకి నాంచారమ్మ, శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి, శ్రీవేణుగోపాలస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి దామానాగేశ్వరావు పర్యవేక్షణలో స్వామివార్లకు పూజలు జరిగాయి. శ్రీ వాసవీ ఆలయ అధ్యక్షుడు శ్రీరాం వెంకట సుబ్బారావు నేతృత్వంలో సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం, భజన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. గ్రామాల్లో కూడా నవరాత్రి పూజలు విశేషంగా నిర్వహిస్తున్నారు.



పర్చూరు నాంచారమ్మ ఆలయంలో

మార్టూరు : శ్రీదుర్గామల్లీశ్వరి దేవస్థానంలో బుధవారం అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. మహిళలు పిల్లలతో కలిసి వచ్చి అమ్మ వారిని దర్శించుకున్నారు. ఘట్టేశ్వరస్వామి, బొడ్డురాయి సెంటర్‌వద్ద వాసవీ అమ్మవారి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ఇంకొల్లు : కృష్ణమందిరంలో అమ్మవారిని బుధవారం సరస్వతీదేవిగా అలంకరించారు. భక్తులు, విద్యార్థులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోలాట ప్రదర్శన అలరించింది.





మార్టూరులో సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు, ఇంకొల్లులో పారాయణం చేస్తున్న భక్తులు



సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో కె.స్వరూపారాణి

## 14 నుంచి గ్రామాల్లో పల్లె పండుగ

### ఎంపీడీవో స్వరూపారాణి

పంగులూరు, అక్టబరు 9 : గ్రామాలలో ఈ నెల 14 నుంచి జరిగే పల్లె పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల అభివృద్ధి అధికారి కె.స్వరూపారాణి కోరారు. పల్లె పండుగ కార్యక్రమం నిర్వహణపై ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో ఎంపీడీవో స్వరూపారాణి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టే అభివృద్ధి పనుల ప్రారంభించేందుకు తగిన ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. 100రోజుల పనిదినాలకు సంబంధించిన ప్రణాళిక రూపకల్పన, గోకులాల షెడ్ల నిర్మాణాలపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో పీఆర్ ఏఈ హనుమంతరావు, ఈవోఆర్డీ కె.సుమంత్, ఏపీవో సంతోషం, ఈసీ మురళి, సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## విత్తనశుద్ధి పాటించాలి

పంగులూరు, అక్టోబరు 9 : పంట సాగుకు మందు రైతులు విత్తన శుద్ధిని పాటించాలని, సేంద్రియ పద్ధతులను అనుసరించాలని ఏవో సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని తూర్పు తక్కెళ్లపాడు, కొప్పెరపాడు గ్రామాలలో బుధవారం పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాగులో ఉన్న మినుము పంటను పరిశీలించి పలు సూచనలు చేశారు. వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పద్ధతులు అవలంబించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎనికపాటి కల్యాణ్, శ్రీనివాసరావు, పచ్చా శ్రీనివాసరావు, పశు సంవర్ధక, మార్కెటింగ్, వ్యవసాయ శాఖల సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్, అక్టోబరు 9 : పొగాకు సాగు తగ్గించి అపరాలు పంటలు ఎక్కువగా సాగు చేసుకోవాలని సహాయ వ్యవసాయ అధికారి కె.ధనరాజ్ సూచించారు. బుధవారం మండలంలోని ధేనువకొండ, గోపాలపురం గ్రామాలల్లో పోలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వలన ఆరోగ్యం దెబ్బతింటుందని, సాగు తగ్గించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకట కృష్ణ, ఉద్యాన అధికారి ఎస్ దీప్తి, ఏఈవో కోటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ తుపాకుల పద్మా, గ్రామ వ్యవసాయ సహాయకలు శేషయ్య, వీరేష్, రాఘవయ్య, నరసింహారావు, యర్రా చలపతిరావు పాల్గొన్నారు.

బల్లికురవ : వరిలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయాధికారి కుమారి అన్నారు. చెన్నుపల్లి, ముక్తేశ్వరంలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్య క్రమంలో సిబ్బంది సురేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మార్టూరు : ఎద పద్ధతిపై వరి పంటను సాగు చేయడం వలన రైతులకు నారుపెంచడం, నాట్లు వేయడంపై సుమారు ఎకరాకు రూ.8వేలు ఖర్చు తగ్గుతుందని సహాయ వ్యవసాయ సంచాలకుడు కేవీ శ్రీనివాసరావు అన్నారు. బొల్లాపల్లి, తాటివారిపాలెం గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ అధికారి వీరగంధం కిరణ్ కుమార్ మాట్లాడుతూ రబీలో మొక్కజొన్న సాగుచేసే అవకాశం ఎక్కువగా ఉందని, ఈ పంట సాగు చేసే రైతులు లైసెన్సు కలిగిన డీలర్ల నుంచి విత్తనాలను కొనుగోలు చేయాల సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి హనుమంతనాయక్, పశు వైద్యాధికారి మాధవీలత, సర్పంచ్ నార్నె సింగారావు, వీరవల్లి కృష్ణ మూర్తి, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకొల్లు : మిరపపంటలో చిన్నపాటి మెలకువలు పాటిస్తే తక్కువ ఖర్చుతో లాభాలు పొందవచ్చునని ఉద్యానశాఖ అధికారి రవిప్రకాశ్ అన్నారు. గంగవరం, నాగండ్ల గ్రామాలలో పొలంపిలుస్తొంది కార్యక్రమంలో భాగంగా సాగులో ఉన్న పంటలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వ్యవసాయసంచాలకులు, రైతులు పాల్గొన్నారు.

చినగంజాం మండలం నీలాయపాలెంలో పొలంపిలుస్తొంది కార్యక్రమం జరిగింది. వ్యవసాయాధికారి భాస్కరరావు మాట్లాడుతూ ప్రతి 3 సంవత్సరాలకోసారి పొలంలో జింకు వేసుకోవాలని, శనగ రైతులు విత్తనశుద్ధిని చేసుకోవాలని సూచించారు.

## తండ్రీకుమారుల అరెస్ట్

మార్టూరు, అక్టోబరు 9 : మండలంలోని కోలలపూడి గ్రామానికి చెందిన తండ్రి ఈమని సాంబయ్య, అతని కుమారుడు దుర్గా ప్రసాద్‌ను బుధవారం అరెస్ట్ చేసి అద్దంకి కోర్టులో హాజరుపరిచినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎం.శేషగిరిరావు తెలిపారు. గత నెలలో వారిద్దరూ అదేగ్రామానికి చెందిన పవన్ కుమార్ అనే వ్యక్తిపై దాడి చేసి గాయపరిచారన్నారు. ఆసుపత్రి నుంచి అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## సాగర్ కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

వలపర్ల పంచాయతీ పరిధిలో జంగమహేశ్వరపురం సమీపంలోని సాగర్ కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని బుధవారం మార్టూరు పోలీసులు వెలికితీశారు. వలపర్ల వీఆర్‌వో ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. అతని శరీరంపై ఎలాంటి దుస్తులు లేవు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎం.శేషగిరిరావు వెళ్లి పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టమ్ నిమిత్తం తరలించారు. మృతిచెందిన వ్యక్తికి సంబంధించి ఎలాంటి సమాచారం లేదని, 40 ఏళ్ల వయస్సు ఉంటుందని శేషగిరిరావు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## అమ్మ ఆశ్రమానికి ఆర్థిక సాయం

మార్టూరు, అక్టోబరు 9 : అమ్మ ఆశ్రమానికి జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి దంతనాల కనక రత్నాచారి పద్మావతి దంపతులు రూ.25 వేల విరాళాన్ని ఇచ్చారు. తమ కుమార్తె వైష్ణవి పుట్టినరోజు సందర్భంగా బుధవారం ఆర్థిక సాయాన్ని ఆశ్రమ అధ్యక్షుడు గుంటుపల్లి చందుకు అందచేశారు. అనంతరం వృద్ధులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

## కారు ఢీకొని బాలుడికి గాయాలు

బల్లికురవ, అక్టోబరు 9 : సైకిల్‌పై వెళ్తున్న బాలుడిని కారు ఢీకొనడంతో గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని వి.కొప్పెరపాడులో బుధవారం ఉదయం బాలుడు హైవేపై వెళ్తుండగా కారు ఢీకొట్టింది. కారు ఆపకుండా వెళ్లిపోవడంతో స్థానికులు వెంబడించి కొమ్మాలపాడు వద్ద ఆపారు. బాలుడికు చేతికి, ముఖంపై గాయాలయ్యాయి. నర్సరావుపేట వైద్యశాలకు తరలించారు.



గత వైసీపీ సర్కారు తీసుకొచ్చిన 'ఫ్రీ హోల్డ్' చట్టం అక్రమార్కులకు వరంగా మారింది. ప్రభుత్వ భూములను అప్పనంగా దోచుకునేందుకు దోహదపడింది. పెత్తందారుల చేతుల్లో ఉన్న ఆక్రమిత భూములకు చట్టబద్ధత కల్పించేందుకు ఉపయోగపడింది. వైసీపీ నేతలు రూ.కోట్లకు పడగెత్తేలా చేసింది. అధికారులను దారికితెచ్చుకుని భూములను రిజిస్ట్రేషన్ చేయించుకుని.. ఆపై అమ్మి సొమ్ము చేసుకోవడానికి దారులు కల్పించింది. జిల్లావ్యాప్తంగా 1.36 లక్షల ఎకరాల అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించినట్లు, వీటిలో 4వేల ఎకరాలు రిజిస్ట్రేషన్ కూడా చేయించినట్లు అధికారుల పరిశీలనలో తేలింది. అందులో అత్యధికం కనిగిరి, మార్కాపురం డివిజన్లలోనే ఉన్నాయంటే ఇక్కడ అక్రమాలు ఏ స్థాయిలో జరిగాయో తేటతెల్లమవుతోంది.

# అంతా ఫ్రీ హోల్డ్!

## జిల్లాలో లక్షా 82వేల ఎకరాలకు యాజమాన్య హక్కులు

- అందులో లక్షా 36వేల ఎకరాలు అసైన్డ్ భూమి
- 4వేల ఎకరాలకు రిజిస్ట్రేషన్ చేసినట్లు గుర్తింపు
- వైసీపీ నాయకుల కనుసన్నల్లోనే అక్రమం
- కనిగిరి, మార్కాపురం డివిజన్లలోనే అధికం
- అధికారుల విచారణలో వెలుగులోకి అవకతవకలు

ఒంగోలు (కలెక్టరేట్), అక్టోబరు 9 : ఏళ్ల తరబడి అనుభవంలో ఉన్న అసైన్డ్ భూములను అమ్ముకునేందుకు అవకాశం కల్పించినదే ఫ్రీ హోల్డ్ చట్టం. గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన ఈ చట్టం అక్రమార్కులకు వరంగా మారడంతోపాటు అధికారులకు కాసుల వర్షం కురిపించింది. వైసీపీ ప్రభుత్వం గతేడాది అసైన్డ్, చుక్కలు, ఇనాం భూములకు స్వేచ్ఛ కల్పిస్తున్నామని ప్రచారం చేసి గ్రామగ్రామానా సభలు పెట్టి రైతులకు హక్కులు ఇస్తున్నామని పైకి ఊదరగొట్టి లోలోపల వైసీపీ దళారులు బాగుపడటానికి అవకాశం కల్పించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఫ్రీ హోల్డ్ భూములపై దృష్టి పెట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రకాల భూ రికార్డుల పరిశీలన ప్రారంభించింది. గతేడాది డిసెంబర్ నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు జిల్లావ్యాప్తంగా లక్షా 82వేల ఎకరాలకు జగన్ సర్కారు పూర్తి యాజమాన్య హక్కులు కల్పించినట్టు తేలింది. అందులో లక్షా 36 వేల ఎకరాలు అసైన్డ్‌భూములు, 37వేల ఎకరాల చుక్కల భూములు, 9వేల ఎకరాలు ఇనాం భూములు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. 4వేల ఎకరాల అసైన్డ్ భూములను రిజిస్ట్రేషన్ చేసినట్లు ఇప్పటి వరకూ అధికారులు చేసిన విచారణలో తేలింది. విచారణ పూర్తయితే ఎన్నివేల ఎకరాలు ఫ్రీ హోల్డ్ అయ్యాయో వెలుగులోకి వచ్చే అవకాశముంది.



మర్రిపూడి మండలంలో ఫ్రీ హోల్డ్ భూములను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

### మార్కాపురం, కనిగిరి డివిజన్లలో ఇలా..

- జిల్లాలోని మార్కాపురం, కనిగిరి డివిజన్లలోనే అత్యధికంగా అసైన్డ్‌భూములను ఫ్రీ హోల్డ్‌లో పెట్టారు.
- కనిగిరి డివిజన్‌లో 1,95,938 ఎకరాల అసైన్డ్ భూములు ఉండగా అందులో 84,611 ఎకరాలను ఫ్రీ హోల్డ్‌లో ఉంచారు.
- మార్కాపురం డివిజన్‌లో 1,19,228 ఎకరాల అసైన్డ్ భూములు ఉండగా అందులో 48,523 ఎకరాలను ఫ్రీ హోల్డ్ చేశారు.
- ఒంగోలు డివిజన్‌లో 29,571 ఎకరాల అసైన్డ్ భూములు ఉండగా 3,286 ఎకరాలను ఫ్రీ హోల్డ్‌లో పెట్టారు. సింగరాయకొండలో 3.91 ఎకరాలు, మద్దిపాడు 5.70 ఎకరాలు, టంగుటూరు 58 ఎకరాలు, సంతనూతలపాడు 52.53 ఎకరాలు, తాళ్లూరు 72 ఎకరాలను ఫ్రీ హోల్డ్‌లో పెట్టగా జిల్లాలోని మిగిలిన మండలాల్లో వంద నుంచి వేల ఎకరాలను ఫ్రీ హోల్డ్ చేశారు.

### వైసీపీ నేతలకు అనుకూలంగా..

గత ప్రభుత్వ నిర్ణయం వైసీపీ నేతలకు వరంగా మారింది. వేల కోట్ల విలువచేసే భూములను కొల్లగొట్టడానికి ఉపయోగపడింది. చాలా మంది వైసీపీ నేతలు విలువైన భూములను తమ కుటుంబ సభ్యులు, అనుచరుల పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. మార్కాపురం, కనిగిరి డివిజన్లలో ఈ భూముల వ్యవహారం మరింత ఎక్కువగా ఉంది. డివిజన్ కేంద్రమైన కనిగిరితోపాటు ఆ నియోజకవర్గం లోని అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. అప్పటి ముఖ్య ప్రజాప్రతినిధి కనుసన్నల్లోనే ఈ ప్రక్రియ జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి.

### మండలాల వారీగా ఫ్రీ హోల్డ్‌లో ఉన్న అసైన్డ్ భూములు

| మండలం | ఎకరాలు |
|---|---|
| సీఎస్‌పురం | 8,505 |
| దర్శి | 2,302 |
| దొనకొండ | 125 |
| హనుమంతునిపాడు | 8,456 |
| కనిగిరి | 11,931 |
| కేకేమిట్ల | 12,750 |
| కురిచేడు | 689 |
| మర్రిపూడి | 6,591 |
| పీసీపల్లి | 9,773 |
| పామూరు | 4,945 |
| పొదిలి | 9,723 |
| పొన్నలూరు | 1,761 |
| వెలిగండ్ల | 7,055 |
| అర్ధవీడు | 272 |
| బేస్తవారిపేట | 4,344 |
| కంభం | 1,043 |
| దోర్నాల | 4,054 |
| గిద్దలూరు | 4,374 |
| కొమరోలు | 1,168 |
| మార్కాపురం | 3,501 |
| పెద్దారవీడు | 4,940 |
| పుల్లలచెరువు | 10,464 |
| రాచర్ల | 1,984 |
| తర్లుబాడు | 5,227 |
| త్రిపురాంతకం | 4,502 |
| యర్రగొండపాలెం | 2,646 |
| చీమకుర్తి | 138 |
| కొండపి | 298 |
| కొత్తపట్నం | 651 |
| ముండ్లమూరు | 291 |
| నాగులుప్పలపాడు | 1,114 |
| ఒంగోలు | 402 |
| జరుగుమల్లి | 197 |



వెంపరాల మేజర్‌లో పూడిక, చిల్లచెట్లు తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

# మేజర్ కాలువల్లో పూడిక, చిల్లచెట్ల తొలగింపు

- మంత్రి గొట్టిపాటి చొరవతో యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

అద్దంకి, అక్టోబరు 9 : సాగర్ కాలువలలో పూడిక పేరుకు పోవడం, చిట్ల చెట్లు దట్టంగా పెరగడంతో నీటి ప్రవాహం ముందుకు కదలక పొలాలకు నీరు సరిగా చేరడం లేదు. దీంతో పలు గ్రామాల రైతులు ఇటీవల అద్దంకి బ్రాంచి కాలువపై మంత్రి రవికుమార్ పర్యటించే సమయంలో వివరించారు. దీంతో వెంటనే స్పందించిన రవికుమార్ అద్దంకి నియోజకవర్గ పరిధిలోని అన్ని మేజర్ కాలువలలో వెంటనే పూడికతీత పనులు, చిల్లచెట్ల తొలగింపు చేపట్టాలని ఎన్నెస్పీ అధికారులను ఆదేశించారు. అన్ని మేజర్ కాలువలను పరిశీలించి, ఏయే ప్రాంతంలో పూడికతీత, చిల్లచెట్లు తొలగింపు చేపట్టాలో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలంటే ఆలస్యం అయ్యే అవకాశం ఉన్న దృష్ట్యా రైతుల పంటల సాగుకు ఇబ్బంది లేకుండా ఉండేలా వెంటనే పూడిక తీత పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ఈ మేరకు ఉన్నతాధికారులతో కూడా ఫోన్‌లో మాట్లాడారు. వెంటనే ఎక్స్‌కవేటర్ యజమానులతో మాట్లాడి పనులు ప్రారంభించారు. ప్రస్తుతం వెంపరాల, పసుమర్రు మేజర్‌లలో రెండేసి ఎక్స్‌కవేటర్లతో పూడికతీత పనులు పనులు మొదలుపెట్టారు. రెండు, మూడు రోజులలో రెండు మేజర్‌లలో ఈ పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. ఆ తరువాత మరో రెండు మేజర్‌లలో పనులు ప్రారంభించనున్నారు. మంత్రి గొట్టిపాటి వెంటనే స్పందించి నిధుల కోసం ఎదురు చూడకుండా యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభించడంతో నీటి విడుదలకు అడ్డంకులు తొలగనున్నాయి. పూడికతీత పనులు చేపట్టడంపట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ప్లాస్టిక్ వినియోగంపై చర్యలు

మునిసిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్

చీరాలటౌన్, అక్టోబరు 9 : ప్లాస్టిక్ వినియోగంపై నిబంధనలు పాటించాలని భిన్నంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని మునిసిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ హెచ్చరించారు. ఇప్పటికే దీనిపై స్పష్టమైన ఆదేశాలు ఉన్నత అధికారుల నుంచి అందినట్లు తెలిపారు. నేతాజీ సేవా సమితి వారు అందించిన జూట్ బ్యాగులను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రతినిధులు కృష్ణమూర్తి, పవని భానుచంద్రమూర్తి, సంఘ సభ్యులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సంచులు ప్రదర్శిస్తున్న కమిషనర్ రషీద్

# పారదర్శకంగా ఉచిత ఇసుక

- అక్రమంగా తరలిస్తే చర్యలు
- జిల్లాలో స్టాక్ పాయింట్లు లేవు
- స్థానిక అవసరాల కోసం ఎక్కడికక్కడ వెసులుబాటు
- కలెక్టర్ తమీమ్ అన్సారియా



ఒంగోలు (కలెక్టరేట్), అక్టోబరు 9 : జిల్లాలో ప్రజలకు ఉచిత ఇసుకను పారదర్శకంగా అందిస్తామని కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. అందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ ఏడాది జూలై 8 నుంచి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని తీసుకువచ్చిందన్నారు. అప్పటి నుంచి జిల్లాలో 62,291 మెట్రిక్ టన్నుల ఇసుకను ఉచితంగా ప్రజలకు అందించామన్నారు. ప్రస్తుతం జిల్లాలో ఇసుక స్టాక్ పాయింట్లు లేవని స్పష్టం చేశారు. అవసరమైన ఇసుకను నెల్లూరు, కడప, కర్నూలు జిల్లాల్లోని స్టాక్ పాయింట్ల నుంచి సరఫరా చేస్తున్నామని చెప్పారు.

### ఫిర్యాదుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్

జిల్లాలో స్థానిక అవసరాల కోసం 285 వాగులు, వంకలను గుర్తించడం జరిగిందని కలెక్టర్ చెప్పారు. వాటి నుంచి సమీపంలోని గ్రామాల ప్రజలు సొంత అవసరాల కోసం ఉచితంగా తోలుకోవచ్చని తెలిపారు. పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలు చేపట్టేందుకు యజమానులు దరఖాస్తు చేసుకుంటే జిల్లాస్థాయి ఇసుక కమిటీ పరిశీలించి అనుమతులు ఇస్తుందన్నారు. ఈనెల నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు జిల్లాలో 4.36 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అవసరమవుతుందని అంచనా వేసినట్లు తెలిపారు. జిల్లాలో ఇసుక అక్రమ రవాణా, బ్లాక్ మార్కెటింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకొంటామని కలెక్టర్ తెలిపారు. ఇసుక అక్రమ తవ్వకాలపై ఫిర్యాదుల కోసం 62817 99518 నంబర్‌తో ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేశామన్నారు.

### 16 నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలు

జిల్లాలో మద్యం షాపుల కోసం ఈనెల 1నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని కలెక్టర్ అన్సారియా చెప్పారు. దరఖాస్తు గడువును ప్రభుత్వం మరో రెండు రోజులు పెంచిందన్నారు. జిల్లాలో 171 మద్యం దుకాణాలకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. 16నుంచి కొత్త దుకాణాలు ప్రారంభించు కోవచ్చని చెప్పారు. గీత కార్మికులకు 17 షాపులు కేటాయించడం జరిగిందని, వాటికి ప్రత్యేకంగా మార్గదర్శకాలు రావాల్సి ఉందని వెల్లడించారు.

### ఇసుక అక్రమ రవాణాపై నిఘా : ఎస్పీ దామోదర్

ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ దామోదర్ తెలిపారు. మూడు నెలల్లో 70 కేసులను నమోదు చేశామన్నారు. ఉచిత ఇసుక విధానం పటిష్టంగా అమలయ్యేలా క్షేత్రస్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇసుక అక్రమ రవాణా చేస్తూ వాహనాలు పట్టుబడితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. మరోసారి దొరికితే యజమానులపై పీడీ యాక్టు కింద చర్యలు తీసుకుంటామన్నారు. విలేకరుల సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

# పంచాయితీపై ఫైర్

## గ్రేడ్-5, గ్రేడ్-6 ఉద్యోగుల బది'లీలల'పై పీఆర్ డైరెక్టర్ సీరియస్

- డీపీవో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్
- పూర్వ అధికారి ఉషారాణిపై విచారణకు ఆదేశం
- కలెక్టర్‌కు నివేదిక సమర్పించిన ఎస్డీసీ లోకేశ్వరరావు

ఒంగోలు (కలెక్టరేట్), అక్టోబరు 9 : గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న గ్రేడ్-5, గ్రేడ్-6 (సచివాలయ కార్యదర్శులు) ఉద్యోగుల బదిలీల్లో తిరకాసుపై పీఆర్ డైరెక్టర్ రవితేజ సీరియస్ అయ్యారు. బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో డీపీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కిషోర్‌బాబును కలెక్టర్ అన్సారియా సస్పెండ్ చేశారు. పూర్వపు డీపీవో ఉషారాణిపై విచారణకు ఆదేశించారు. గ్రేడ్-5, గ్రేడ్-6 ఉద్యోగుల బదిలీల విషయంలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయి. పెద్దఎత్తున చేతులు మారినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టిన ఎస్డీసీ లోకేశ్వరరావు బుధవారం సాయంత్రం నివేదికను సమర్పించారు. అయితే ఉద్యోగులకు బదిలీ ఉత్తర్వులు ఇవ్వడంలో జాప్యం వెనుక వసూళ్ల మర్మం ఉందన్న ఫిర్యాదులు పంచాయతీరాజ్ డైరెక్టర్‌కు వెళ్లాయి. దీనిపై ఆయన సీరియస్ అయ్యారు. తక్షణ చర్యలకు ఆదేశించారు. దీంతో కలెక్టర్‌కు విచారణాధికారి నివేదిక సమర్పించడానికి ముందుగానే జూనియర్ అసిస్టెంట్‌పై వేటు పడింది. డైరెక్టర్ ఆదేశాల మేరకు డీపీవో గొట్టిపాటి వెంకటనాయుడు అందుకు సంబంధించిన ఫైల్‌ను బుధవారం కలెక్టర్‌కు పంపగా ఆమె ఆమోదముద్ర వేశారు. పూర్వపు డీపీవో ఉషారాణిపై విచారణకు ఆదేశించారు. మున్ముందు మరికొంత మందిపై వేటు పడే అవకాశం ఉంది. విచారణలో



విచారణకు హాజరైన పూర్వపు డీపీవో, సిబ్బంది (ఫైల్)

### అవాక్కయ్యే నిజాలు బహిర్గతం

బదిలీల్లో అక్రమాలపై విచారణాధికారిగా నియమితులైన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు రెండ్రోజుల క్రితం పూర్వ జిల్లా పంచాయతీ అధికారి ఉషారాణి, అప్పటి ఏవో శివప్రసాద్, జూనియర్ అసిస్టెంట్‌లు కిషోర్, సాయిలను విచారించారు. వారి వద్ద నుంచి లిఖిత పూర్వకంగా సమాచారం తీసుకున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న పంచాయతీ కార్యదర్శులతో లోకేశ్వరరావు మాట్లాడినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా విస్తుపోయే నిజాలను కార్యదర్శులు చెప్పినట్లు సమాచారం. ఎవరెవరికి ఎంత ఇచ్చింది పూసగుచ్చినట్లు వివరించినట్లు తెలిసింది. ప్రధానంగా ముగ్గురు పేర్లను వారు వెల్లడించినట్లు తెలిసింది. దీంతో వారి ఫోన్‌పే ఐడీల ద్వారా వారి బ్యాంకు ఖాతాలకు జమైన నగదు వివరాలను విచారణాధికారి సేకరించినట్లు సమాచారం. ఆ మొత్తం వివరాలను ఆయన తన నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. కౌన్సెలింగ్ నిర్వహించి నెల దాటినా సకాలంలో ఆర్డర్లు ఇవ్వకపోవడం వెనుక మర్మాన్ని కూడా ఆయన అందులో పొందుపర్చినట్లు తెలుస్తోంది.



చికిత్స పొందుతున్న జ్వర బాధితులు



మందుల కోసం జ్వర పీడితులు

# మంచంపట్టిన నాంచారపురం

- గొంతు, కీళ్ల నొప్పులు
- ఎంతకీ తగ్గక నరసరావుపేట, గుంటూరుకు పయనం

కురిచేడు, అక్టోబరు 9 : జ్వరపీడితులతో నాంచార పురం విలవిల్లాడుతోంది. వారం రోజుల నుంచి గ్రామంలో జ్వరాలు పెరుగుతున్నాయి. ఆర్‌ఎంపీల వద్ద పరీక్షలు చేయించి మందు వాడినా ఫలితం లేక ఎక్కువ శాతం మంది బాధితులు నరసరావుపేట, గుంటూరుకు పరుగు పెడుతున్నారు. జ్వరంతో పాటుగా కడుపులో మంట, కీళ్ల నొప్పులు వారిని బాధ పెడుతున్నాయి. పేదవారు మాత్రం కురిచేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వస్తున్నారు. ఒక్క బుధవారం రోజునే కురిచేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చాలా మంది జ్వర పీడితులు వచ్చారు. వారిని పరీక్షించిన వైద్యులు వైరల్ ఫీవర్‌గా గుర్తించారు. ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తోందని అన్నారు. రెండు రోజుల్లో నాంచార పురంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రవీణ్ తెలిపారు. గ్రామంలో మురికి నిల్వ ఉండటం వల్ల దోమలు పెరిగిపోయాయి.

### నాలుగు రోజులుగా జ్వరం



కడుపులో మంట, కీళ్ల నొప్పులు ఎక్కువగా ఉన్నాయి. ఎన్ని మందులు వాడినా ఫలితం లేదు. నాలుగు రోజులుగా రాత్రి సమయాల్లో నొప్పులు ఎక్కువగా ఉంటున్నాయి. ఏమి తినలేని పరిస్థితి ఉంది. గ్రామంలో ఎక్కువ మందిది ఇదే పరిస్థితి. మా ఇంట్లో అందరూ జ్వరపీడితులే.

– గాదె శ్రీను, నాంచారపురం

# పూర్వవిద్యార్థుల అపూర్వ కలయిక

మార్టూరు, అక్టోబరు 9 : మండలంలోని కోలలపూడి జడ్పీ హైస్కూల్‌లో 1987-88లో 10 వతరగతి చదివిన పూర్వ విద్యార్థులు బుధవారం హైస్కూల్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులు హనుమంతరావు, జగన్మోహనరావు, సుబ్బమ్మ, దివంగత వెంకయ్య మాస్టారి సతీమణి నరసమ్మను వారు ఘనంగా పూలమాలలతో సత్కరించారు. ఏళ్ల తర్వాత ఒకచోట కలుసుకున్న వారు కష్టసుఖాలపై మాట్లాడుకున్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సర్పంచ్ సతీష్‌కుమార్, పూర్వ విద్యార్థులు దాసరి శ్రీనివాసరావు, వెంకట్రావు, మల్లికార్జున, సాంబశివరావు, హరిబాబు, ప్రభాకర్, సురేష్, మురళి, భూలక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించేలా చర్యలు

బల్లికురవ, అక్టోబరు 9 : సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు చీరాల ఆర్డీవో అఖిల అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 10 అర్జీలు అందాయి. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నివేదికలు ఇవ్వాలన్నారు. అర్జీదారులను తిప్పుకోకుండా సమస్యలు పరిష్కరించాలన్నారు. తహసీల్దార్ రవిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫొటో :09ఐఎన్‌కె01 అన్నదానం చేస్తున్న నాయకులు

# వెయ్యి మందికి డొక్కా సీతమ్మ అన్నదానం

ఇంకొల్లు, అక్టోబరు 9 : అంకమ్మకాలనీ 7వ వార్డులో బుధవారం డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎన్‌ఆర్ఐ మన్నం శ్రీకాంత్ ఆధ్వర్యంలో సుమారు 1000 మందికి అన్నదానం చేసారు. కార్యక్రమంలో జనసేన ఉమ్మడి ప్రకాశం జిల్లా సంయుక్త కార్యదర్శి షేక్ ఇంతియాజ్, ఇంకొల్లు మండల అధ్యక్షుడు నారిశెట్టి ప్రవీణ్, ఉపాధ్యక్షుడు ఆర్‌కె రెడ్డి, మండల కార్యదర్శి మహేష్, కొండపల్లి వెంకటేశ్వర్లు, ముస్తాఫా, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మరో రెండు రోజులు

## మద్యం షాపులకు దరఖాస్తు గడువు పెంపు

- రేపటి వరకూ అవకాశం
- 14న లాటరీ ద్వారా కేటాయింపు

ఒంగోలు (క్రైం), అక్టోబరు 9 : మద్యం దుకాణాల కోసం దరఖాస్తు గడువును ప్రభుత్వం మరో రెండు రోజులు పెంచింది. శుక్రవారం వరకు అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. జిల్లాలో 171 మద్యం దుకాణాలకు అధికారులు నోటిఫికేషన్ ఇచ్చారు. తొలుత ప్రకటించిన ప్రకారం బుధవారంతో దరఖాస్తుల దాఖలుకు గడువు ముగియాల్సి ఉంది. కానీ దరఖాస్తుదారుల విజ్ఞప్తి మేరకు ఈనెల 11 వరకూ గడువు పొడిగించింది. బుధవారం రాత్రి వరకూ 2,168 దరఖాస్తులు అందాయి. ఈనెల 14న లాటరీ విధానంలో షాపులు కేటాయించనున్నారు. 16 నుంచి అవి తెరుచుకోనున్నాయి. ఇప్పటి వరకూ మద్యం దుకాణాల దరఖాస్తు ఫీజు ద్వారా 43.36 కోట్ల మేర ప్రభుత్వ ఖజానాకు ఆదాయం చేకూరింది. ప్రస్తుతం సరాసరి మద్యం దుకాణానికి 12 దరఖాస్తులకు పైగా వచ్చాయి. మరో రెండు రోజులు అవకాశం ఇవ్వడంతో వీటి సంఖ్య మరింత పెరుగుతుందని ఎక్సైజ్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.


# త్వరలోనే మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం

## ఎమ్మెల్యే దామచర్ల



నూతన బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు (కార్పొరేషన్), అక్టోబరు 9: టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100రోజుల్లోనే అభివృద్ధివైపు అడుగుల వేయడంతో పాటు, హామీలు అమలు చేసి చూపిస్తుందని ఎమ్మెల్యే దామచర్ల జ నార్దన్ పేర్కొన్నారు. ఏపీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో ఒంగోలులో నూతనంగా ఏర్పాటు చేసిన రెండు ఇంద్ర, స్టార్‌లైన్ బస్సులను ఎమ్మెల్యే ప్రారంభించారు ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ ప్రైవేటు బస్సులకు దీటుగా ఆర్టీసీ ఆధ్వర్యంలో ఆధునిక హంగులు, నూతన బస్సులను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలోనే ఒంగోలు డిపోకి 105 కొత్త బస్సు లను తీసుకురావడం జరిగిందన్నారు. రోడ్డు భద్రత విషయంలో ఆర్టీసీ ప్రయాణ సురక్షితమని, ఆర్టీసీకి ఆదాయం వచ్చినా ప్రభుత్వానికి వచ్చినట్లే అని ఆ యన చెప్పారు. ఒంగోలు డిపోలో మొత్తంగా 22 ఏసీ బస్సులను తెచ్చినట్లు వివరించారు. ప్రజలు ఆర్టీసీలో ప్రయాణించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు.



## కొత్త సిలబస్ ప్రకారమే 'పది' పరీక్షలు

నెల్లూరు (విద్య), అక్టోబరు 9: 2024-25 విద్యా సంవత్సరంలో పదవ తరగతి విద్యార్థులకు కొత్త సిలబస్ ప్రకారమే పబ్లిక్ పరీక్షలు జరుగుతాయని డీఈవో రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. 2021-22, 2022-23, 2023-24 విద్యా సంవత్సరాల్లో ఫెయిలైన, విత్‌హెల్డ్, మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడిన వారికి మాత్రం పాత సిలబస్‌లోనే పరీక్షలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచారని పేర్కొన్నారు.





నెల్లూరు: చండీ అలంకరణలో ఇరగాళమ్మ




రాపూరు: పెంచలకోనలో సరస్వతీదేవిగా ఆదిలక్ష్మి



బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలో సరస్వతీదేవిగా కామాక్షితాయి



నెల్లూరు రూరల్: సరస్వతీ దేవిగా ఆదిలక్ష్మి అమ్మవారు



నెల్లూరు: సరస్వతీదేవిగా రాజరాజేశ్వరి

# సరస్వతీ నమస్తుభ్యం!

నెల్లూరు (సాంస్కృతికం) అక్టోబరు 9 : నవరాత్రి ఉత్సవాల్లో ఏడవ రోజు బుధవారం దేవేరులు విద్యాప్రదాయనీ, వీనాపాణిగా సరస్వతీ అలంకరణలో కొలువుదీరారు. హంస వాహనంపై శ్వేతవస్త్రం ధరించి ఒక చేతిలో వీణ, మరో చేతిలో పుస్తకం ధరించి భక్తులకు విద్యాప్రాప్తిని కలగాలని ఆశీర్వదిస్తూ దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం జిల్లావ్యాప్తంగా అన్ని ఆలయాల్లో సరస్వతీ హోమం, సరస్వతీ పూజ, అక్షరాభ్యాసం వంటి కార్యక్రమాలు జరిగాయి. నెల్లూరు నగరంలో రాజరాజేశ్వరి అమ్మవారు సరస్వతీగా దర్శనం ఇచ్చింది. సంపుటీకరణ, చండీహోమం, నవావరణ పూజలు, విశేష పూజలు, పూలంగిసేవలు జరిగాయి. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరి సరస్వతి కొలువుదీరారు. మూలవిరాట్, ఉత్సవమూర్తులకు పుస్తకా లు, పలకలు, పెన్నులతో విశేష అలంకారాలు జరిగాయి. నగర దేవత ఇరుకళల పరమే శ్వరి అమ్మవారికి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, నవావరణ పూజలు, పూలంగిసేవ, చండీహోమాలు జరిగాయి. పెంచలకోన, జొన్నవాడ, వేదగిరి, సంగం, కావలి, కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి తదితర ప్రాంతాల్లోని ఆలయాలు భక్తులతో శోభిల్లాయి.

### వైభవంగా భవానీల ఊరేగింపు

రాజరాజేశ్వరి అమ్మవారి దీక్షా మాలలు ధరించిన భవానీల కలశాల ఊరేగింపు బుధవారం రాత్రి నగరంలో వైభవంగా జరిగింది. శ్రీ రాజరాజేశ్వరి సేవా సమితి సన్నపరెడ్డి పెంచలరెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 3వేల మందికిపైగా భవానీలు పాత మున్సిపల్ కార్యాలయం పెన్నా రేవులో పెన్నా జలాలను కలిశాలలో ఎత్తుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి ఊరేగింపుగా బయలుదేరారు. అమ్మవారి చిత్రపటంతో బాణాసంచా కాల్పులు, విశేష పుష్ప, విద్యుద్దీపాలంకరణలు, వేదమంత్రాలతో భవానీల ఊరేగింపు సంతపేట, ఏసీ బొమ్మ, గాంధీబొమ్మ, మార్కెట్, ఆర్టీసీ, కేవీఆర్ పెట్రోలు బంకు, శబరి శ్రీరామక్షేత్రం మీదుగా రాజరాజేశ్వరి ఆలయానికి చేరుకుని కలిశాలు అమ్మవారి సన్నిధికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో సన్నపరెడ్డి పెంచలరెడ్డి, అళహరి విజయ్‌కుమార్, అల్లూరు గిరీష్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, నగర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.





నెల్లూరులో వీణకచేరి



కలశాలతో భవానీ భక్తుల ఊరేగింపు

## రేషన్ కార్డుల రేషనలైజేషన్ పూర్తి

- 179 షాపుల్లో 800లకు మించి కార్డులు
- కలెక్టర్‌కు నివేదించిన అధికారులు
- కొత్త షాపుల ఏర్పాటుకు త్వరలో నోటిఫికేషన్

నెల్లూరు (హరనాథపురం) : జిల్లాలో రేషన్ కార్డుల రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తయ్యింది. 800 కార్డులకు మించి ఉన్న 179 రేషన్ షాపులను అధికారులు గుర్తించారు. ఈ షాపుల పరిధిలో కొత్త షాపుల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నారు. ఈ మేరకు" మీ కార్డుల విభజన చేస్తున్నాం. కొత్తగా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం కల్పించాలని అనుకుంటున్నాం. మీకేమైనా అభ్యం తరమా!?" అంటూ డీలర్లకు సివిల్ సప్లయిస్ అధికా రులు, తహసీల్దార్లు నోటీసులు జారీ చేశారు. ఈ నెల 12వ తేదీలోగా డీలర్లు సమాధానం ఇవ్వాల్సి ఉం ది. ఆ తర్వాతే అధికారులు నివేదిక తయారు చేసి కలెక్టర్ ఆనంద్‌కు అందజేయనున్నారు. ఆ తరువాత కొత్త షాపుల ఏర్పాటుకు జిల్లాలో నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. వీటి భర్తీకి రాత పరీక్ష కూడా నిర్వహిస్తారు.



### రేషన్ కార్డులు ఇలా...

జిల్లావ్యాప్తంగా ఒక్కో షాపు పరిధిలో 400 నుం చి 450 రేషన్‌కార్డులు ఉండాలి. మున్సిపాలిటీల్లో 500 నుంచి 550, కార్పొరేషన్‌లో 600 నుంచి 650 కార్డులు ఉండాలి. అంతకుమించి కార్డులు కలిగి ఉన్న షాపులను అధికారులు గుర్తించారు. జిల్లాలో 1,543 షాపులు ఉండగా, 7.32 లక్షల కార్డులు ఉన్నాయి.

## కందుకూరులో బీపీసీఎల్ రిఫైనరీ?

- రామాయపట్నం పోర్టు సమీపంలో ఏర్పాటుకు ప్రభుత్వం యోచన

కందుకూరు: కందుకూరు నియోజకవర్గంలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) రిఫైనరీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిసింది. రామాయపట్నం పోర్టు సమీపంలో రూ.65 వేల కోట్ల భారీ పెట్టుబడితో రిఫైనరీ ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక బీపీసీఎల్ ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి పెట్రోకెమికల్స్ రిఫైనరీ ఏర్పాటుకు ప్రతిపాదించారు. దీంతో మచిలీపట్నం పోర్టు ప్రాంతంలో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అప్పట్లో చంద్రబాబు సూచించారు. అయితే, ఆ ప్రాంతంలో వేలాది ఎకరాల భూములు లేవని గుర్తించిన ప్రభుత్వం రామాయపట్నం పోర్టు పరిసరాలను అనువైన ప్రాంతంగా యోచిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. రామాయపట్నం ప్రాంతం ఇటు అమరావతికి అటు చెన్నై మహా నగరానికి మధ్యలో ఉండటం కూడా అనుకూలమని బీపీసీఎల్ ప్రతినిధులు సూచించడం ఈ ప్రాంతంలో భూముల లభ్యత కూడా అనువుగా ఉంటుందన్న ఆలోచనతో ప్రభుత్వం ఆ దిశగా యోచిస్తున్నట్లు సమాచారం. రామాయపట్నం పోర్టు పరిసరాలలో వేలాది ఎకరాల అటవీ భూములు ఉండటం, విమానాశ్రయం కోసం ఇప్పటికే ఆ భూములను డీ నోటిఫై చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధంగా ఉండటంతో భూ సమీకరణ ప్రక్రియ కూడా సులువుగా పూర్తవుతుందన్న ఆలోచనతో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. భారీ పెట్టుబడితో ఏర్పాటయ్యే బీపీసీఎల్ రిఫైనరీ వల్ల ప్రత్యక్షంగా పరోక్షంగా 30 వేల మందికి ఉపాధి లభిస్తుందన్న అంచనా ఉంది.

## సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు!

- జిల్లావాసులకు ఎస్పీ విజ్ఞప్తి

నెల్లూరు (క్రైం) : సైబర్ నేరగాళ్ల పట్ల జిల్లావాసులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కృష్ణకాంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీబీఐ, ఈడీ, కస్టమ్స్, ఏసీబీ అధికారులమంటూ కొంతమంది నేరాలకు పాల్పడుతున్నారని అలాంటి వారిని నమ్మొద్దని తెలిపారు. కొత్త వ్యక్తుల నెంబర్ల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, వీడియో కాల్స్‌కు రెస్పాండ్ కావద్దని పేర్కొన్నారు. అనామకులు పంపే వెబ్‌సైట్ లింకులు, ఫైల్స్ తెరవద్దని, రూ.వేలల్లో పెట్టుబడులు పెడితే లక్షల్లో లాభాలు వస్తాయని వాట్సాప్, టెలిగ్రామ్ ప్రకటనలను కూడా నమ్మొద్దని తెలిపారు. సైబరు నేరగాళ్ల చేతుల్లో మోసపోయినప్పుడు ఎటువంటి సంకోచం, సందేహాలు పెట్టుకోకుండా ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావాలని కోరారు. 48 గంటల్లో హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేస్తేనే పోగొట్టుకున్న నగదు తిరిగి వారి బ్యాంకు ఖాతాలో జమయ్యే విధంగా చేయవచ్చని తెలిపారు. సైబర్ నేరాలు, ఇతర ఆన్‌లైన్ మోసాల బారిన పడితే వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన సైబర్ మిత్ర వాట్సాప్ నెంబరు 9121211100, 1930, ఎన్‌సీఆర్పీ పోర్టల్ ఛిఝ్బట ఛిటజీర్ఖు.జౌ.జీలకు ఫిర్యాదు చేయాలని కోరారు.

# మృగాలున్నారు జాగ్రత్త!

- అభం శుభం ఎరుగని పసిమొగ్గలను చిదిమేస్తున్నారు!
- ఈ ఏడాదిలో 32 అత్యాచార ఘటనలు
- వెలుగులోకి రాని దారుణాలెన్నో..!

ఈ నెల 1వ తేదీన అల్లూరు మండలం నార్తుమోపూరు దళితవాడలో మద్యం మత్తులో కళ్లు మూసుకుపోయిన ఓ కసాయి కన్నకూతురిపైనే లైంగికదాడికి పాల్పడ్డాడు. ఇంటిలో భర్త చేస్తున్న అకృత్యానికి ఆ ఇల్లాలు గుండెలవిసేలా రోదించినా ఫలితం లేకుండా పోయింది. చివరకు తల్లి ఒడికి చేరిన ఆ బాలిక జరిగిన దారుణాన్ని చెప్పుకుని బోరున విలపించింది. స్థానికులు తేరుకుని కసాయితండ్రిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

చేజర్ల మండలంలోని ఓ గ్రామంలో కన్నకూతురిపైనే తండ్రి లైంగిక దాడికి పాల్పడినట్లు ఈ నెల 1వ తేదీన వెలుగులోకి వచ్చింది. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు.

మచ్చుకు ఇవి కొన్ని మాత్రమే. సమాజంలో మానవ విలువలు మాయమవుతున్నాయి. అరచేతిలోకి ప్రపంచం వచ్చిన తర్వాత ఆన్‌లైన్‌లో చిన్న, పెద్ద తేడా లేకుండా అశ్లీల చిత్రాలు, వీడియోలు చూసేవారి సంఖ్య పెరిగిపోయింది. మద్యం మత్తులో కొందరు, కామంతో కళ్లు మూసుకుపోయి మరికొందరు అభం సుభం తెలియని చిన్నారుల జీవితాలను చిదిమేస్తున్నారు. చివరికి కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన కన్నతండ్రులే కసాయిగా మారిపోతున్నారు. బాలికలు ఇల్లు దాటి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకునే వరకు అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని ఎదురు చూడాల్సిన పరిస్థితులు దాపురించాయి. ఆడపిల్లల భద్రతకు ఎన్నో కఠినచట్టాలు ఉన్నా, ఏళ్ల తరబడి శిక్షలు పడుతున్నా కామాంధుల్లో మాత్రం మార్పు ఉండటం లేదు.

నెల్లూరు (క్రైం) : చిన్నారుల చిరునవ్వుల కంటే ప్రపంచంలో గొప్ప చిత్రాలు బహుశా పెద్దగా ఉండవు. కల్మషం లేని ఆ నవ్వులు.. ఆ చూపులు.. ఆ మాటలు.. ఆ పాటలు.. చిలిపి చేష్టలు.. ఇలా చెప్పుకుంటూపోతే చిన్నారులతో ఉన్నంతసేపు ఓ కొత్త ప్రపంచంలో ఉన్న భావన కలుగుతుంది. అయితే అభంశుభం తెలియని బాలికలపై జిల్లాలో అకృత్యాలు పెరిగిపోతున్నాయి. ఏవేవో మాటలు చెప్పి చిన్నారుల పట్ల వికృతంగా ప్రవర్తిస్తున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. ఇంటిలో బంధువులతో పాటు స్నేహితులు, ఉపాధ్యాయులు, మందు బాబులు ఇలా చెప్పుకుంటూపోతే చాలామందే ఉన్నారు. వీరినుంచి చిన్నారులను ఏ విధంగా రక్షించుకోవాలా అన్న క్షోభ కన్నతల్లులను వెంటాడుతోంది.

### నిర్భయా కన్నా కఠినంగా పోక్సో

చిన్నారుల పట్ల అసభ్యకంగా ప్రవర్తించే వారిపై నిర్భయా కన్నా కఠినమైన పోక్సో చట్టాన్ని 2012లో రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. దీనికింద కేసు నమోదు అయితే పదేళ్లకు పైగా జైలు శిక్ష పడే అవకాశం ఉంది. సామాన్యులకంటే అధికారులు, ఉద్యోగులు అఘాయిత్యాలకు పాల్పడితే మరింత ఎక్కువ శిక్ష పడేలా చట్టాన్ని రూపొందించారు. 18ఏళ్లలోపు బాలికలపై లైంగిక వేధింపులు, దాడులకు పాల్పడిన వారిపై ఈ చట్టం కింద కేసులు నమోదు చేస్తారు. ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా బాలికలపై జరిగిన లైంగికదా డులకు సంబంధించి 32 కేసులు నమోదయ్యాయి. నేరం రుజువై పదేళ్లకుపైగా జైలు శిక్ష పడిన కేసులు నాలుగు వరకు ఉన్నాయి.

### ఈ జాగ్రత్తలు తీసుకోండి!

- తల్లిదండ్రుల పేర్లు, చిరునామా, ఫోన్ నెంబరు గుర్తుపెట్టుకునేలా పిల్లలకు నేర్పాలి.
- ఏదైనా బహుమతులు లేదా తినుబండారాలు ఇచ్చే అపరిచితులతో స్నేహం చేయకుండా వారిని అప్రమత్తం చేయాలి
- మీ పిల్లలు మీతో స్వేచ్ఛగా మాట్లాడటానికి తగినంత విశ్వాసాన్ని కలిగించడం ద్వారా వారు అనుమా నాస్పదంగా లేదా అసౌకర్యంగా ఏదైనా అనుభవించిన ట్లయితే సంకోచించకుండా మీ వద్దకు వచ్చి చెబుతారు.
- ఆత్మరక్షణకు సులభమైన మార్గాలను పిల్లలకు నేర్పించాలి. ఇది అత్యవసర పరిస్థితుల్లో గొప్ప సాయంగా ఉంటుంది.
- ఎవరైనా తలుపు తట్టినప్పుడు తలుపు తెరవడానికి పిల్లలను అనుమతించవద్దు.
- వీలైనంత వరకు పిల్లలతో తల్లిదండ్రులు సమయం కేటాయించాలి.
- గుడ్ టచ్, బ్యాడ్ టచ్, నో టచ్‌లు అంశాలపై అవగాహన కల్పించాలి.
- పిల్లలు చెప్పే అంశాలను క్షుణ్ణంగా, ఓపికగా వినడం, ప్రవర్తనలో మార్పులు కనిపెట్టడం ముఖ్యం.
- ఇతరులతో ఎలా మెలగాలో పిల్లలకు నేర్పించాలి. ఒంటరిగా పిల్లలను ఎక్కడికీ పంపించకూడదు. నిర్ణయా లు, భయాలు, సమస్య పరిష్కార శక్తిని నేర్పించాలి.



### తల్లిదండ్రుల పర్యవేక్షణ ఎంతో అవసరం



బాలికలపై జరిగే అత్యాచార ఘటనలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. బాలికలపై జరిగే నేరాలు, మిస్సింగ్ కేసుల అదుపునకు ప్రత్యేక కార్యాచరణ రూపకల్పన చేశాం. ఈ క్రమంలోనే కళాశాల ప్రిన్సిపాళ్లు, కరస్పాండెంట్లకు అవగాహన కల్పిస్తున్నాం. జిల్లావ్యాప్తంగా సీఐలు, ఎస్ఐలు విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి ఇంటర్నెట్ ప్రభావంపై అవగాహన కల్పిస్తున్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సంరక్షకులు కూడా బాలబాలికలకు నైతిక విలువల గురించి తరచూ తెలియజేస్తూ ఉండాలి. ఇవన్నీ ఎలా ఉన్నా ఇరుగు పొరుగు వారు, బంధువులు, స్నేహితులు, అపరిచితుల విషయంలో కౌమార దశలో ఉన్న బాలలు ఏవిధంగా వ్యవహరించాలో నేర్పించాల్సిన బాధ్యత, వారి మీద ఎల్లప్పుడూ నిఘా ఉంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే.

- జీ కృష్ణకాంత్, ఎస్పీ

### ఈ కారణాలతోనే మృగాలుగా..



బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడే వారు ఆల్కహాల్, డ్రగ్స్ ఎక్కువగా తీసుకోవడం వల్ల జంతు వాంఛ పెరుగుతుంది. పెడోఫిలియా (చిన్నపిల్ల లపై) కామంతో ఉండే జబ్బు వంటి మానసి రుగ్మతలు ఉన్నవారు ఇలా ప్రవర్తిస్తారు. విలువలు, బంధాలు, మానవ సంబంధాలు, కుటుంబ సంబంధాల వైఫల్యాలు ఉన్న వారు ఇలా ప్రవర్తిస్తుంటారు. ప్రధానంగా చిన్నారులపై తల్లి పర్యవేక్షణ అధికంగా ఉండాలి. కుమార్తెలతో అన్ని విషయాలు చర్చిస్తూ ఉండాలి.

- డాక్టర్ సురేష్ బాబు, మానసిక వైద్య నిపుణులు

## నిర్భయంగా దరఖాస్తు చేసుకోండి!

- రేపు రాత్రి 7 గంటల వరకు గడువు
- మద్యం వ్యాపారులకు ఎక్సైజ్ డీసీ పిలుపు
- 14న లాటరీ విధానంలో షాపుల కేటాయింపు
- 16న వైన్‌షాపుల ప్రారంభం

నెల్లూరు (క్రైం), అక్టోబరు 9 : ప్రైవేటు మద్యం దుకాణాలకు ఆశావహులందరూ నిర్భయంగా దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ డీసీ శ్రీనివాస రావు తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం 11వ తేదీన రాత్రి 7 గంటల వరకు గడువు ఇచ్చినట్లు చెప్పారు. వ్యాపారులు ఏ దుకా ణీకైనా ఎక్కడి నుంచైనా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. బయట వినిపించే పుకార్లు నమ్మకుండా ప్రశాంతంగా దరఖాస్తులు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 12, 13 తేదీలలో దరఖాస్తులను పరిశీలించి, 14వ తేది ఉదయం లాటరీ విధానంలో వైన్‌షాపులను వ్యాపారులకు కేటాయించి లైసెన్సులు జారీ చేయనున్నట్లు చెప్పారు. 16వ తేది ఉదయం నుంచి వ్యాపారులు షాపులు ప్రారంభించుకోవచ్చని అన్నారు. కాగా, ఇప్పటివరకు 182 వైన్‌షాపులకు 2,533 దరఖాస్తులు అందినట్లు సమాచారం.

## ఇటు ఉల్లి లొల్లి.. అటు టమోత..!

- భగ్గుమంటున్న కాయగూరల ధరలు
- విలవిల్లాడుతున్న సామాన్య ప్రజానీకం

నెల్లూరు (వ్యవసాయం), అక్టోబరు 9 : కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. ముఖ్యంగా టమోటా మోత మోగిస్తుండగా, కోయకనే ఉల్లి కన్నీరుపెట్టిస్తోంది. చిక్కుడు, బీన్సు, బీర, అల్లం తదితర రకాల కాయగూరల ధరలు అమాంతం పెరిగిపోయి సామాన్యులకు అందనంత ఎత్తుకు చేరిపోయాయి. చాలీచాలని జీతంతో జీవితాలను నెట్టుకొస్తున్న వారికి నిత్యావసరాలు, కాయగూరల ధరలు పెరుగుదల ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇటీవల విస్తారంగా వర్షాలు కురవడం, పోటెత్తిన వరదలతో పంటలు దెబ్బతిని దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి. దీనికితోడు మార్కెట్‌లో ధరల నియంత్రణ కొరవడింది. మార్కెట్‌లో ధరలను పరిశీలిస్తే ఒక్కో కూరగాయకు కనీసం రూ.20 నుంచి రూ.30 వరకు అధిక ధరకు విక్రయిస్తున్నారు. వెరసి పేద, మధ్య తరగతి వారిపై అదనపు భారం పడుతోంది. ఓ వైపు అమ్మవారి మాల, రానున్న మరో రెండు నెలల్లో అయ్యప్ప మాలల ధరించే భక్తులు ఎక్కువగా ఉంటారు. వీరంతా శాకాహార భోజనమే చేయాల్సి ఉంటుంది. ఈ పరిస్థితుల్లో మార్కెట్‌లో ధరలు పెరుగుతుండటం కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. వ్యాపారులు మాత్రం రవాణా ఖర్చులు పెరిగాయని, కూరగాయల డిమాండ్ ఉండటంతోనే ధరలకు రెక్కలు వచ్చినట్లు చెబుతున్నారు. ఏదిఏమైనా అధికారులు స్పందించి ధరలను నియంత్రించాల్సిన అవసరం ఉందని వినియోగదారులు కోరుతున్నారు.

కిలో కూరగాయల ధరలు ఇలా (రూ.లలో)..

| రకం | నెలక్రితం | ప్రస్తుతం |
|---|---|---|
| టమోటా | 33 | 100 |
| వంకాయలు | 60 | 80 |
| అలుగడ్డలు | 50 | 70 |
| బెండ | 35 | 45 |
| గోరుచిక్కుళ్లు | 20 | 40 |
| బీన్సు | 80 | 110 |
| దొండ | 30 | 40 |
| బీరకాయ | 50 | 70 |
| ఉల్లి | 55 | 70 |
| అల్లం | 240 | 260 |
| కాకర | 50 | 60 |
| చామ | 50 | 60 |
| దోస | 30 | 40 |
| పందిరి చిక్కుళ్లు | 60 | 80 |

# కావలి
## కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి



## రీ సర్వే పాసుపుస్తకమా.. హడల్!

- రుణ మంజూరుకు బ్యాంకర్లు, పీఏసీఎస్‌ల నిరాకరణ
- తలలు పట్టుకుంటున్న అన్నదాతలు

**అల్లూరు, అక్టోబరు 9:** వ్యవసాయ భూములపై రుణాలు పొందాలంటే రైతులకు భూ యాజమాన్యపు హక్కుపత్రం,పట్టాదారు పాసుపుస్తకములు ఉంటే పంట రుణం లేదా దీర్ఘకాలిక రుణాలు గానీ మంజూరు చేసే అవకాశం ఉంది. ఈ రుణాలతో కొంత మేర వ్యవసాయ ఖర్చులకు వినియోగిస్తే మిగిలినవి కుటుంబానికి అవసరమయ్యే కార్యకలాపలకు, శుభకార్యములకు వినియోగిస్తారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం భూ శాశ్వత హక్కు పథకం అంటూ చేపట్టిన రీ సర్వే ప్రక్రియతో మంజూరు చేసిన పాసుపుస్తకాలతో బ్యాంకర్లు రుణాలు ఇచ్చేది లేదని తేల్చి చెబుతుండటంతో ఈ పుస్తకాలు దేనికీ పనికి రాకుండా పోతున్నాయి. గతంలో సాధారణంగా భూమిపై హక్కును కలిగిన రైతు తమ పేరు వెబ్‌ల్యాండ్‌లో పొందుపరచి పట్టాదారు పాసుపుస్తకం కలిగి ఉంటే పంట రుణాన్ని మంజూరు చేసే అవకాశం ఉండేది.

**గత పట్టాదారు పాసుపుస్తకాలకే విలువ :** పాత పాసుపుస్తకాలతో వెబ్‌ల్యాండ్‌లో 1బి నమూనా, అడంగల్ పహణీ, ఎన్‌కంబ్రెన్స్ సర్టిఫికెట్ ఉంటే రుణ మంజూరుకు సిద్ధమని బ్యాంకర్లు, పీఏసీఎస్‌లు ముందుకొస్తున్నాయి. రీసర్వే పాసుపుస్తకం అంటేనే హడలిపోతున్నారు. రీ సర్వే ప్రక్రియ అనంతరం ఎల్.పి.ఎం నెంబరు అంటూ నూతన ఒరవడిని తీసుకరావాలని ఉద్దేశంతో చేపట్టిన వెబ్‌ల్యాండ్ రికార్డుతో సమస్యలు ఏర్పడ్డాయి. సాంకేతిక సమస్యలతో పాటు భూ విస్తీర్ణములు వివరాల్లో కూడా సమస్యలు ఏర్పడ్డాయి. రుణాలు పొందేందుకు అర్హత కలిగిన భూ రికార్డులు రైతుల వద్ద ఉన్నా వెబ్‌ల్యాండ్-2 బ్యాంకర్లకు అందుబాటులో లేకపోవడంతో బ్యాంకర్లు సైతం ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. చేసేది లేక రైతులు ఎప్పటికైనా రుణాలు ఇవ్వకపోతారా అని బ్యాంకులు, సమకార బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.



రీ సర్వే ద్వారా మంజూరు చేసిన పట్టాదారు పాసుపుస్తకం

### రీసర్వే ప్రక్రియతో అన్నీ అనర్థాలే



రీసర్వే ప్రక్రియతో భూముల విస్తీర్ణం తగ్గడం, పెరగడం కానీ జరుగుతోంది. విస్తీర్ణం తగ్గిన రైతులు మాత్రం ఇబ్బందులు పడుతున్నాం. రుణాలు పొం దాలంటే బ్యాంకర్లు ససేమీ రా అంటున్నారు.

- యరటపల్లి శేఖర్ రెడ్డి, అల్లూరు

### పాత పాసుపుస్తకాలు ఇవ్వాలి



రీ సర్వే ప్రక్రియ అనంతరం మంజూరు చేసిన పట్టాదారు పాసుపుస్తకాలు ఉప యోగపడకపోతే ఇంకెందుకు. జగనన్న బొమ్మ కలిగిన పాసుపుస్తకం కనీసం చేతికి కూడా తీసుకోవడం లేదు. బ్యాంకర్లు ఇక రుణాలు ఏ విధంగా ఇస్తారు.

- రామిశెట్టి కృష్ణచైతన్య, అల్లూరు

## ఎట్టకేలకు అధికారులు స్పందించారు



**కలిగిరి, అక్టోబరు 9:** పాచి తొలగించరు.. లీకేజి నివారించరు.. అంటూ మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తకు స్పందించిన అధికారులు, పాలకులు రక్షిత మంచినీటి పథకం ట్యాంకును పంచాయతీ కార్మికులతో శుభ్రం చేయించారు. ట్యాంకును బ్లీచింగ్‌తో శుభ్రం చేయడంతో పాటు ట్యాంకు అడుగుభాగాన పేరుకుపోయిన వ్యర్థాలు, పాచిని తొలగించారు. శుభ్రపరిచిన తాగునీరు రావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

## హనుమంత, గజ వాహన సేవలో శ్రీవారు

**కావలి టౌన్, అక్టోబరు 9:** బృందావనం కాలనీలోని వెంకటేశ్వరస్వామి బుధవారం ఉదయం హనుమంత వాహన, రాత్రి గజ వాహనసేవలు అందుకున్నారు. టీటీడీ అర్చక బృందంతో నిర్వహించిన ఉత్సవాలను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీరామ్‌మాల్యాద్రి పర్యవేక్షించారు. సాయంత్రం వసంతోత్సవ పుష్పపల్లకీ జరి గింది. రాత్రి శ్రీవారు గజవాహనంపై విహరిస్తూ అలరించారు.



హనుమంత వాహన సేవలుందుకుంటున్న శ్రీవారు

## దత్తాత్రేయస్వామి హుండీ లెక్కింపు

**లింగసముద్రం, అక్టోబరు:** మొగిలిచెర్ల దత్తాత్రేయస్వామి ఆలయం హుండీ ఆదాయం రూ.19.4.9లక్షల ఆదాయం వచ్చింది. బుధవారం ఆలయం ఆవరణలో జరిగిన హుండీ లెక్కింపును కందుకూరు దేవాదాయ ధర్మాదాయ శాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పర్యవేక్షించారు. గతంలో వచ్చిన ఆదాయం కంటే ఈ సారి రూ.3.73లక్షలు ఎక్కువ సమకూరినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కెనరా బ్యాంకు మేనేజరు, బ్యాంకు క్యాషియర్, అర్చక, అర్చకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## రాజకీయ ఒత్తిళ్లకు తావులేదు

- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ దయాసాగర్

**కావలి, అక్టోబరు 9:** రాష్ట్రంలో మద్యం షాపుల ఏర్పాటులో రాజకీయ ఒత్తిళ్లకు తావు లేని ఈ పాలసీని ప్రభుత్వం తీసుకవచ్చిందని నెల్లూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ పీ. దయాసాగర్ తెలిపారు. మద్యం షాపులకు వస్తున్న దరఖాస్తుల తీరును పరిశీలించేందుకు బుధవారం ఆయన కావలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను సందర్శించారు. ఇంతవరకు వచ్చిన అప్లికేషన్‌ల వివరాలు, దరఖాస్తుదారులకు ఎదురువుతోన్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కావలి సీఐ సుంకర శ్రీనివాసులుతో కలిసి ఏసీ విద్యాసాగర్ మాట్లాడారు. మద్యంషాపుల నిర్వహకులకు అనువుగా తీసుకవచ్చిన ఇలాంటి పాలసీ ఇండియాలో ఎక్కడా లేదన్నారు. లాటరీ సిస్టం ద్వారా షాపులు కేటాయింపు, దుకాణాలకు శ్లాబ్ ధరలు, రెండు నెలలకు ఒకసారి కిస్తీ చెల్లించుకునే విధానం, నెలరోజుల తర్వాత రెండు నెలలకు సరిపడా బ్యాంకు గ్యారెంటీలతో మద్యం షాపుల నిర్వహకులకు పెట్టుబడులు తగ్గుతున్నాయన్నారు. ఒత్తిళ్లు ఉన్నట్లు తమ దృష్టికి తెస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సర్కిల్ పరిధిలోని 17షాపులకు బుధవారం మధ్యాహ్నంనకు 158దరఖాస్తులు వచ్చాయని, మరిత పెరిగే అవకాశాలు ఉందన్నారు.



మాట్లాడుతున్న ప్రొహిబిషన్ కమిషనర్ దయాసాగర్

## మిల్లు నిర్వాహకుడిపై దాడి

**కావలి రూరల్, అక్టోబరు 9:** స్థానిక వేపకాయల మిల్లు నిర్వాహకుడు దామిశెట్టి మల్లికార్జున్‌పై బుధవారం పట్టణానికి చెందిన దేవరకొండ శ్రీనివాసులు, మరో 5మంది వచ్చి మడత కుర్చీ తీసుకుని దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

## ఇంటర్న్‌షిప్‌పై అవగాహన సదస్సు

**దగదర్తి, (బిట్రగుంట) అక్టోబరు 9:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సమగ్ర శిక్షణ స్కిల్‌డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో టైమ్స్ సెంటర్ ఫర్ లెర్నింగ్ లిమిటెడ్ వీసీలు పీ.కార్తీక్, బీ.శ్రీనులు 38మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పీఎం ఇంటర్న్‌షిప్ పథకం కింద విద్యార్థి దశ నుంచి స్కిల్ డెవలప్‌మెంట్ చేయాలన్నదే కేంద్రం ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. కార్యక్రమంలో ఓకేషనల్ ఉపాధ్యాయులు మాధవి, హరితప్రియ ఉన్నారు.

## ప్రతిఒక్కరూ భక్తి భావం కలిగి ఉండాలి

**లింగసముద్రం, అక్టోబరు 9:** ప్రతిఒక్కరూ దేవుని పట్ల భక్తిభావం కలిగి ఉండాలని శ్రీనర్మదానంద బ్రహ్మచారి స్వామీజీ తెలిపారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఆయన భక్తులకు శక్తిపీఠాలు గురించి వివరించారు. తాను మధ్యప్రదేశ్‌లోని నర్మదా నది జలకూటి రేవా పంచవటి సేవాన్యాస్ ఆశ్రమం నుంచి వచ్చినట్లు తెలిపారు. కాలినడకన ప్రయాణం చేస్తూ ఇప్పటివరకు 15పీఠాలు దర్శించుకున్నట్లు చెప్పారు. రాత్రికి కొండాపురంలో బస చేస్తారన్నారు. ఈయన హిందీ, ఇంగ్లీషు బాషలు మాత్రమే మాట్లాడగలరు. హిందీలో మాట్లాడే బోధనలను అక్కడే ఉన్న ఒకరిద్దరు మహిళా భక్తులు అనువాదం చేసి భక్తులకు తెలుగులో వినిపించారు.

## ఈ క్రాప్ నమోదుపై ఆర్డీవో తనిఖీ

**బిట్రగుంట, అక్టోబరు 9:** నాగులవరం పంచాయతీలో ఈ-క్రాప్ చేసిన పంటలను బుధవారం కావలి ఆర్డీవో వంశీకృష్ణ పరిశీలించారు. మండలంలో ప్రధానంగా వేసే పంటలపై వ్యవసాయ అధికారిని విజయలక్ష్మిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాగులవరం, చెంచులక్ష్మీపురంలోని పలు సర్వే నంబర్లలో పంటను తనిఖీ చేశారు. తహసీల్దారు సురేష్‌బాబు, గ్రామ వ్యవసాయ సహాయకురాలు లక్ష్మి ఉన్నారు.

**ఆత్మకూరు:** జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపికైన విద్యార్థులను బుధవారం తన కార్యాలయంలో ఆర్డీవో బి.పావని అభినందించారు. ఇటీవల రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ఎస్ విజ్ఞేష్, తనూజ గెలుపొంది జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో ఆమె వారిని అభినందించారు.



వ్యర్థాలు, మురుగుతో నిండి ఉన్న అన్నపుగుంట

## అన్నపుగుంట శుద్ధి అయ్యేదెన్నడో..!

**కావలి రూరల్, అక్టోబరు 9 :** పట్టణ నడిబొడ్డున ఉన్న అన్నపుగుంట వ్యర్థాలను చూసి స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. నాడు పట్టణ వైకుంఠపురంలో మంచినీటి గుంటగా ఉన్న ఈ అన్నపుగుంట నేడు కాలువల్లో మురుగునీరు, చెత్తా చెదారం, జంతు కళేబరాలు, చికెన్ దుకాణాల వ్యర్థాలతో నిండి కంపుకొడుతోంది. ఈ సమస్యతో చుట్టుపక్కన ఉన్న బోర్లు, బావు ల్లోని నీరు కూడా కలుషితం అవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నీటిని తాగి రోగాలబారిన పడుతున్నట్లు చెబుతున్నారు. గత ప్రభుత్వంలో అనేకమార్లు ఈ విషయం పై అప్పటి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డికి విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి చొరవ తీసుకొని అన్నపుగుంటలోని వ్యర్థాలను తొలగించి శుద్ధి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

## 75 పొట్టేళ్ల వేలం

**కొండాపురం, అక్టోబరు 9:** చింతలదీవి పశుసంవర్థక క్షేత్రంలో బుధవారం 177పొట్టేళ్లకు వేలం నిర్వహించగా 75 పొట్టేళ్లను రైతులు వేలంలో తీసుకున్నారు. కేజీల లెక్కన వేలం నిర్వహించగా 75 పొట్టేళ్లకు రూ.7.84లక్షలు వచ్చిందని అధికారులు తెలిపారు. మిగిలిన పొట్టేళ్లకు ఉన్నతాధికారుల ఆదేశాలతో మరలా వేలం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డీఏహెచ్‌వో రమేష్ నాయక్, చింతలదీవి క్షేత్ర డీడీ పెద్దస్వామి, ఏడీ రామన్, మాధవీలత, సీహెచ్, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఏవీఎస్ కార్యకర్తల రక్తదానం

**కావలి, అక్టోబరు 9:** స్థానిక రెడ్‌క్రాస్ రక్తకేంద్రంలో బుధవారం ఏవీఎస్ కార్యకర్తలు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఏడాదిలో రక్తదానం చేయాలన్నారు. రక్తదానం చేయటమంటే ప్రాణదానం చేయటమే అన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ డీ.రవిప్రకాష్, ఏవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, కార్యకర్తలు అభిషేక్, హనుమంత్‌రెడ్డి, సృజన, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## కొండాపురం ఎస్‌ఐగా వెంకటరావు

**కొండాపురం, అక్టోబరు 9:** మండల నూతన ఎస్‌ఐ వెంకటరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న మహేంద్ర వీఆర్‌కు వెళ్లగా వేదాయపాలెం స్టేషన్ ఎస్‌ఐగా పనిచేస్తున్న వెంకటరావు ఇక్కడికి వచ్చారు. మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కల్పించన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

## స్వచ్ఛ నీరందించడమే ధ్యేయం

**లింగసముద్రం, అక్టోబరు 9:** ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ పాఠశాల సమీపంలోని పంచాయతీ స్థలంలో ఆర్వోప్లాంటు ఏర్పాటుకు బోరు వేయించారు. మండల పరిషత్ జనరల్ ఫండ్, 15వ ఆర్థిక సంఘం, పంచాయతీ నిధులు రూ.6లక్షలతో బోరు, ఆర్వోప్లాంటు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రంగయ్య, అర్థాకుల పెదసత్యం, తిరుపతయ్య ఇంజనీరింగ్ అసిస్టెంటు స్రవంతి పాల్గొన్నారు.

## పూడికతీత పనులకు శ్రీకారం

**ఆత్మకూరు, అక్టోబరు 9:** ఇటీవల రైతు సంఘం నాయకులు ఆత్మకూరు చెరువు సప్లయ్ కెనాల్ పూడికతీత పనులపై జరిపిన పోరాట ఫలితంగా బుధవారం ఏటికాలువ పూడికతీత పనులు చేపట్టారు. సోమశిల జలాశయం నుంచి ఉత్తర కాలువ ద్వారా నీరు అందాల్సి ఉండగా ఏటికాలువలో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో సోమశిల జలాలు ఆత్మకూరు చెరువుకు అంద లేదు. ఈ విషయాన్ని రైతుసంఘం నాయకులు రాష్ట్ర మంత్రి ఆనం, ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో మంత్రి ఆనం ఆదేశాల మేరకు ఏటి కాలువ వెంబడి 7.2కి.మీ మేర యంత్రాలతో యుద్ధప్రాతి పదికన పూడికతీత పనులు చేపట్టారు.

## సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ

**సీతారామపురం, అక్టోబరు 9 :** స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో భాస్కర్ అధ్యక్షతన బుధవారం పంచాయతీల ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు గ్రామ పంచాయతీ పరిపాలనా విధానం, ఎపిపిఆర్ చట్టం, తదితర అంశాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంటటి కార్యదర్శులు రామ్‌నాథ్‌రెడ్డి, జీవన్‌కుమార్, రాజేష్, పంచాయతీ కార్యదర్శులు, 14 ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## నేడు డయల్ యువర్ డీఎం

**ఉదయగిరి రూరల్, అక్టోబరు 9:** ఉదయగిరి ఆర్టీసీ డిపో పరిధిలో బస్సుల సౌకర్యాలు, లా జిస్టిక్ సేవలపై ప్రయాణికులు, ప్రజల నుంచి సలహాలు, సూచనల కోసం గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాసరావు బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి 12 గంటల మధ్యలో 9959225095 నెంబర్‌కు ఫోన్ చేసి తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని ఆయన కోరారు.

## ఎస్‌ఎస్ ట్యాంకుల పరిశీలన

**కావలి, అక్టోబరు 9:** పట్టణానికి మంచినీటిని సరఫరా చేసే సమ్మర్ స్టోరేజి(ఎస్ఎస్) ట్యాంకును మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ పరిశీలించారు. అనంతరం కుక్కల కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసే షెడ్డును పరిశీలించారు.

### దోమల నివారణ మందు పిచికారీ

**కందుకూరు:** పట్టణంలోని ఖాజీపాలెం, జనార్దనగుడి, పోతురాజుమిట్ట, చాకలిపాలెం ఏరియాలోని సైడు కాలువలు, నీరు నిల్వ ఉన్న కుంటల్లో బుధవారం దోమల నివారణ మందు పిచికారీ చేయించినట్లు కమిషనర్ అనూష తెలిపారు.

## అక్షరజ్ఞానం ఇవ్వు.. చదువుల తల్లీ!

- ఏడోరోజుకు చేరిన శరన్నవరాత్రి ఉత్సవాలు
- వివిధ రూపాల్లో అమ్మవార్ల దర్శనం



ఉదయగిరి రూరల్: శివాలయంలో సరస్వతిగా అమ్మవారు



సంగం: సరస్వతిగా కామాక్షిదేవి



అల్లూరు: కన్యకాపరమేశ్వరికి 108 రకాల ప్రసాదాలు



ఆత్మకూరు: సరస్వతీదేవి అలంకరణలో దాచూరమ్మ



వరికుంటపాడు: కాళరాత్రి అలంకరణలో మానసాదేవి



కందుకూరు: సరస్వతీ దేవికి విద్యార్థుల ప్రత్యేక పూజలు

**కావలి టౌన్, అక్టోబరు 9:** పట్టణంలోని గ్రామదేవత కలుగోళశాంభవి సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చి హంసవాహన సేవలందుకున్నారు. పాతూరు శివాలయ దుర్గాభ్రమరాంబమా తాంగీశ్వరీదేవిగా, విష్ణాలయం రాజ్యలక్ష్మీ విద్యాలక్ష్మీదేవిగా, వడ్డెపాలెం కనకదుర్గాదేవి సరస్వతీదేవి అలంకరణలో దర్శనం ఇచ్చారు. ముసునూరు హనుమత్ క్షేత్రం దుర్గాదేవి సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు.

**కందుకూరు:** స్థానిక పెద్దబజారు కన్యకాపరమేశ్వరి సరస్వతీ అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ నిర్వాహకులు కోట నరసింహం ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు బాలయ్య స్వామి, రాజా స్వామి బాల బాలికలతో అమ్మవారికి ప్రత్యేకపూజలు చేయించారు. నూతన రజిత సింహ వాహన కవచాన్ని రావి చెట్టు వద్ద ప్రత్యేక పూజ లు నిర్వహించి ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకొచ్చారు. కందుకూరు ఇలవేల్పు అంకమ్మతల్లికి అర్చకులు అభిషేకం నిర్వహించి, అష్టోత్తరం, కుంకుమ పూజలు చేపట్టారు. ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణవేణితోపాటు ఉభయదాతలు అమ్మవారి సేవలో పాల్గొన్నారు.

**ఆత్మకూరు:** పట్టణంలోని ఉత్తర బలిజవీధిలో ఉన్న జ్వాలాముఖి సరస్వతీదేవి అలంకారంలో శోభిల్లారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో, తిరునాళ్ళతిప్పలోని కాశీనాయన ఆశ్రమంలోని అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

**అల్లూరు:** స్థానిక కన్యకా పరమేశ్వరికి 108 రకాల ప్రసాదాలను భక్తులు నైవేద్యంగా పెట్టారు. అంతకుముందు అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి పూజలు చేశారు. ఉభయదాతలుగా దోగిపర్తి నిరంజన్, దోగిపర్తి పద్మలు వ్యవహరించారు. దసరా ఆలయం, కలుగోళమ్మ ఆలయం, ఇస్కపల్లి గంగమ్మ ఆలయం, నార్తుమోపూరులో మహాలక్ష్మమ్మ ఆలయాల్లో వేడుకలు వైభవంగా నిర్వహించారు.

**ఉదయగిరి రూరల్:** పట్టణంలోని పార్వతీపరమేశ్వరాలయం, శ్రీసంతానలక్ష్మీదేవి ఆలయాల్లో అమ్మవారు సరస్వతిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

**వరికుంటపాడు:** తూర్పురొంపిదొడ్ల మానసాదేవి కాళరాత్రి అలంకరణలో, వరికుంటపాడు నాగరప్పమ్మ అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

**సంగం :** కామాక్షిదేవి సమేత సంగమేశ్వరాలయంలో కామాక్షిదేవి సరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం పల్లకీసేవ నిర్వహించారు.

**బిట్రగుంట:** విశ్వనాథరావుపేట కోదండరామాలయంలోని రాజరాజేశ్వరి అమ్మవారు సరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. బోగోలు సాయిమందిరం, రామస్వామిపాలెం రామలింగేశ్వరస్వామి ఆలయం, జువ్వలదిన్నె శివాలయంలో ప్రత్యేక పూజాభిషేకాలు నిర్వహించారు.

**కలువాయి :** దాచూరు గ్రామదేవత దాచూరమ్మ సరస్వతీదేవీగా దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు శిక్షణ

**సంగం, అక్టోబరు 9:** స్థానిక మండల సమావేశ మందిరంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు పంచాయతీ పాలనపై బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీ పాలనలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ఈవోపీఆర్డీ ప్రసాద్ మాట్లాడుతూ ఉపసర్పంచ్, వార్డు సభ్యుల విధులు, బాధ్యతలపై వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## పాడి రైతులకు బహుమతుల ప్రదానం

**సంగం, అక్టోబరు 9:** మండలంలోని అన్నారెడ్డిపాళెం విజయ పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘంలో పాల ఉత్పత్తిదారులకు బుధవారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విజయ డెయిరీ ఎండీ కృష్ణమోహన్ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా డెయిరీ నష్టాల్లో ఉందని, ఈ ఏడాది లాభాల బాట పట్టిందన్నారు. వచ్చే లాభాల్లో పాల ఉత్పత్తిదారులకు పాల క్యాన్‌లను బహుమతిగా అందచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట అన్నారెడ్డిపాళెం విజయ పాల ఉత్పతిదారుల సహకార సంఘం అధ్యక్షుడు బేత సుబ్రహ్మణ్యం, సొసైటీ డైరెక్టర్లు, పలువురు పాడి రైతులు పాల్గొన్నారు.

## వెంగమాంబ సన్నిధిలో వేలం

**దుత్తలూరు(ఉదయగిరి రూరల్), అక్టోబరు 9:** నర్రవాడ వెంగమాంబ పేరంటాలమ్మ ఆలయ ఆవరణలో బుధవారం పాత ఇనుము, ప్లాస్టిక్ సామగ్రి, భక్తులు సమర్పించిన బియ్యం, గోశాల వద్ద పోగుచేసిన ఎరువులకు మల్లేశ్వరిస్వామి ఆలయ కార్యనిర్వాహణాధికారి కవిత పర్యవేక్షణలో కార్యనిర్వాహణాధికారి ఉషశ్రీ ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు.

## విగ్రహాలను ధ్వంసం చేయడం దారుణం

**వరికుంటపాడు, అక్టోబరు 9:** రాజకీయ నాయకుల విగ్రహాలను ధ్వసం చేయడం దారుణమైన పద్ధతి అని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం తోటలచెరువుపల్లిలో మాట్లాడారు. ఇటీవల బస్టాండ్ సెంటర్‌లోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని కొంతమేర ధ్వంసం చేయడం శోచనీయమన్నారు. అనంతరం విగ్రహానికి పాలభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

**లింగసముద్రం, అక్టోబరు 9:** అన్నెబోయినపల్లి మన్నేరు వాగు ఇసుకను రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను బుధవారం ఎస్‌ఐ షేక్ మహబూబ్ సుబాని అదుపులోకి తీసుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు తెల్లవారుజామున 3గంటల సమయంలో సిబ్బందితో వెళ్లగా గ్రామ శివారులో పట్టుకుని ట్రాక్టర్లు, డ్రైవర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## ఇన్‌చార్జి ఎమ్పీడీవో గా శ్రీదేవి బాధ్యతల స్వీకరణ

**కావలి రూరల్, అక్టోబరు 9:** మండల ఇన్‌చార్జి అభివృద్ధిగా బుధవారం శ్రీదేవి బాధ్యతలు స్వీకరించారు. బోగోలు మండల ఈవోపీఆర్డీగా పనిచేస్తూ అక్కడ నుండి దగదర్తి ఇన్‌చార్జి ఎమ్పీడీవోగా విధులు నిర్వహించేవారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఈ నెల 4న కావలి ఈవోపీఆర్డీ గా విధుల్లో చేరిన అనంతరం ఇన్‌చార్జి ఎమ్పీడీవోగా బాధ్యతలు చేపట్టారు.

## మద్యం షాపులకు 39 దరఖాస్తులు

**మర్రిపాడు, అక్టోబరు 9:** మండలంలో ఏర్పాటు చేయనున్న 5 మద్యం షాపులకు బుధవారం సాయంత్రం వరకు 39మంది దరఖాస్తులు చేసుకున్నట్లు ఉదయగిరి ఎక్సైజ్ సీఐ టి లక్ష్మణస్వామి తెలిపారు. 11వరకు దరఖాస్తుకు గడువు పెంచినట్లు ఆయన తెలిపారు.

## శంకరనగరంలో మాజీ మంత్రి కాకాణి పర్యటన

**అనంతసాగరం, అక్టోబరు 9:** మండలంలోని శంకరనగరంలో బుధవారం ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డితో కలిసి మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పర్యటించారు. ఈసందర్భంగా వైసీపీ నాయకుల ఇళ్లకు వెళ్లి పలకరించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.

## అవగాహనతో పంటలు సాగు చేయాలి

**అల్లూరు, అక్టోబరు 9 :** అవగాహనతో వ్యవసాయం చేపడితే తక్కువ వ్యయంతో అత్యధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి తెలిపారు. బీరంగుంటలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అవసరానికి మించి రసాయనిక ఎరువులు, అత్యధిక మోతాదులో పురుగు మందులు పిచికారి చేస్తే కలిగే అనర్థాలను వివరించారు. ప్రతీ ఒక్కరూ వ్యవసాయ సాగులో వీఏఏలతో సూచనలు పొందాలన్నారు. అవసరమైతే మండల కేంద్రంలోని వ్యవసాయాధికారిని కలిసి నివృత్తి చేసుకోవాలని తెలిపారు. స్థానిక వ్యవసాయాధికారి శ్రీహరి, నారాయణ, కృష్ణచైతన్య పాల్గొన్నారు.

**దుత్తలూరు(ఉదయగిరి రూరల్):** నల్లరేగడిభూముల్లో శనగ పంటకు ప్రత్యామ్నాయంగా జొన్న, మొక్కజొన్న, ధనియాలు, ఆవాల పంటలు సాగు చేస్తే ఖర్చులు తగ్గడంతోపాటు అధిక దిగుబడులు పొందవచ్చని ఆత్మ పీడీ శివన్నారాయణ, శాస్త్రవేత్త సురేఖదేవి పేర్కొన్నారు. పొలం పిలుస్తోందిలో భాగంగా తెడ్డుపాడు, దుత్తలూరు-1 పరిధిలో సాగులో ఉన్న పంటలు పరిశీలించి తెగుళ్ల, నివారణ చర్యలపై రైతులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఏవో ఎన్‌వీ సుబ్బారెడ్డి, వ్యవసాయ, పశు సంవర్ధక శాఖల సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.




అల్లూరు: మాట్లాడుతున్న జేడీ సత్యవాణి

### అధ్వానంగా లింక్‌రోడ్లు ..



అన్నెబోయినపల్లి-అంగిరేకులపాడు గ్రామాల రోడ్లు ఛిద్రమైయ్యాయి. అలాగే సత్యనారాయణపురం- జంగాలపల్లి రోడ్డు, మేదరమెట్ల పాలెం-చినపవని అడ్డరోడ్డు, ముత్యాలపాడు-ముత్తంవారిపాలెం వరకు ఉన్న రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నాయి. కొత్తపేట-రాళ్లపాడు రోడ్డు, ఆర్‌ఆర్ పాలెం బస్టాండ్ నుండి గ్రామంలోకి వెళ్లే రోడ్డు, మొగిలిచెర్ల - నారసింహాపురం రోడ్డు, వెంగళాపురం- తిమ్మారెడ్డిపాలెం రోడ్లు దారుణంగా తయారయ్యాయి. - లింగసముద్రం

### ఆదమరిస్తే అంతే.!



స్థానిక రాయాజీవీధిలో రోడ్డుకు అడ్డంగా డ్రెయినేజీని పూడ్చి సిమెంటు రోడ్డు నిర్మించారు. నీరు వెళ్లక పోవడంతో నగర పంచాయతీ సిబ్బంది మరమ్మతులు చేసి నీరు వెళ్లేలా చేశారు. ఈ సమయంలో చేసిన గుంత అలానే వదిలేశారు. స్థానికులు గుంతను పూడ్చాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. - అల్లూరు

### కర్రలే విద్యుత్ స్తంభాలు



ముసునూరు ఇందిరమ్మ, చంద్రబా బునాయుడు, అట్టలఫ్యాక్టరీ కాలనీ, వినాయక కాలనీల్లో కర్ర లే విద్యుత్ స్తంభాలుగా ఉన్నాయి. అధికారులు ఈ ప్రాంతాల్లోని ఇళ్లకు సరిపడా స్తంభా లను ఏర్పాటు చేయక పోవడంతో స్థానికులు చేసేదిలేక 15ఏళ్లుగా వీటితో కాలంవెల్లదీస్తున్నారు. అధికారులు సమస్య పరిష్కారానికి చర్య లు తీసుకోవాలని కోరుతున్నారు. - కావలి రూరల్

### ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులు..



అల్లిమడుగు పంచాయతీ కప్పరాళ్లతిప్ప సమీపంలోని అల్లిమడుగులో రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. అంతర్గత రోడ్డులోని ఏర్పాటు చేసిన సింగిల్‌ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభం పక్కనే ఎర్త్‌వైర్ పైపు ఉంది. ఈ ప్రాంతంలో కనీసం రక్షణ గోడ లేకుండా ఎర్త్‌పైపు ఏర్పాటు చేస్తారని స్థానికులు మండిప డుతున్నారు. -బిట్రగుంట